

బ్రహ్మర్షి పత్రీజీ దివ్య ఆశీస్సులతో...

# జీవిత సత్యాలు

## తటవర్తి వీర రాఘవరావు



**బ్రహ్మర్షి పత్రీజీ**




అనుబంధం:
పత్రీజీ సందేశాలు,
పిరమిడ్ అద్భుతశక్తి



# జీవిత సత్యాలు



రచన:

**తటవర్తి వీర రాఘవరావు,**

తటవర్తివారి వీధి, భీమవరం - 534 201. ప॥గో॥జిల్లా.

ఫోన్ : 08816 - 234353, సెల్ : 94901 71853

email : balajipyramid.bvrm@gmail.com

# జీవిత సత్యాలు

రచన & ప్రచురణ : **తటవర్తి వీర రాఘవరావు**

మొదటి ముద్రణ : అక్టోబరు, 2008

ప్రతులు : 2000

రెండవ ముద్రణ : జనవరి, 2010

ప్రతులు : 3000

వెల : **రూ. 60/-లు**

డిజైనింగ్ & ప్రింటింగ్ : చైతన్య గ్రాఫిక్స్,
తటవర్తి వారి వీధి, ఆంధ్రాబ్యాంక్ ప్రక్కన,
భీమవరం - 534 201.
ఫోన్ : 08816 - 233011
సెల్ : 9848393179, 9849393179

**కాపీలకు :**

## తటవర్తి వీర రాఘవరావు,

**తటవర్తివారి వీధి, భీమవరం - 534 201. ప॥గో॥జిల్లా.**
**ఫోన్ : 08816 - 234353, సెల్ : 94901 71853**
email : balajipyramid.bvrm@gmail.com

## పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ - ఇండియా

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | "అన్నీ అనుభవించేది మనస్సే!" | 5 |
| 2. | తప్పు ఎవరిది? | 8 |
| 3. | "ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి!" | 10 |
| 4. | "మనకు ఇవ్వబడింది ఏదీ మనది కాదు!" | 12 |
| 5. | ఎందుకు ఇవ్వాలి? | 14 |
| 6. | "స్వార్థం - నిస్వార్థం" | 16 |
| 7. | "కనపడేదే కాదు- కనపడని జీవితం చాలా వుంది!" | 18 |
| 8. | "ఉండేది - లేనివి!" | 20 |
| 9. | "పరమసుఖం - పరమశాంతి - పరమానందం!" | 22 |
| 10. | "ముక్తి కావాలంటే!" | 24 |
| 11. | "జీవితాన్ని వృధా చేయకూడదు!" | 26 |
| 12. | "పుట్టిన క్షణం నుంచే మరణం ప్రారంభమవుతుంది!" | 28 |
| 13. | "ఋణ విముక్తులు కావాలి!" | 29 |
| 14. | "అవసరమైనవే చెయ్యాలి!" | 31 |
| 15. | "కర్తృత్వ భావం లేకుండా చెయ్యాలి!" | 33 |
| 16. | "దేని మీద శ్రద్ధ చూపించాలి?" | 35 |
| 17. | ఏ సంపదలు గొప్పవి? | 37 |
| 18. | "బద్ధకమే బద్ధ శత్రువు!" | 39 |
| 19. | "ధర్మార్థ కామమోక్షాలు!" | 41 |
| 20. | "అల్పభావం పోవాలి!" | 43 |
| 21. | "సోమరులు కాకూడదు!" | 47 |

22. "ప్రకృతి తల్లిలాంటిది!" 50

23. మానవుడు స్వేచ్ఛా జీవా? 53

24. "కలిసి జీవించాలి!" 57

25. "ప్రకృతి నిర్ణయాన్ని గౌరవించాలి!" 63

26. "దేవుళ్ళు మనకోసమే వున్నారా?" 65

27. కోరడమా? యాచించడమా? 67

28. "ఆరాధన - అనుగ్రహము!" 70

29. భగవంతునికి ఆగ్రహ అనుగ్రహాలు వుంటాయా? 72

30. "లోకా సమస్తా సుఖినోభవన్తు!" 75

31. "ఆస్థికుడు - నాస్థికుడు!" 77

32. "సర్వాంతర్యామి!" 79

33. "ఆత్మచింతన చెయ్యాలి!" 81

34. "ఎవరు, ఎవరిని పూజిస్తున్నారు!" 83

35. "ఆలోచించండి!" 85

36. "జ్ఞాని విశిష్టత!" 86

## అనుబంధం

1) బ్రహ్మర్షి పత్రీజీ - సందేశాలు 87

3) పిరమిడ్ అద్భుత శక్తి 133

# "అన్నీ అనుభవించేది మనస్సే!"

సమాజంలో గమనిస్తే అందరూ కష్టాల్లో, బాధల్లో వున్నవారే. దీనికి ముఖ్యకారణం అంతా కర్మలు చేసి వచ్చినవారే. అందుచేత కష్టాలు లేకుండా ఎవరూ వుండరు. అంతేకాదు అంతా కష్టాలు పోవాలని ప్రార్థిస్తూ వుంటారు కూడా. కానీ ఎన్ని పూజలు చేసినా, ప్రార్థనలు చేసినా కష్టాలు పోవట్లేదని సమాజాన్ని గమనిస్తే మనకు అర్థం అవుతుంది. దీనికి ముఖ్య కారణం చేసిన కర్మ అనుభవించకుండా ఎవరి కష్టం తీరదు. ఎటువంటి వారైనా కర్మఫలాన్ని అనుభవించి తీరవలసిందే. ఇది సృష్టి ధర్మం.

ఎవరికైనా కష్టాలు అనుభవించడం బాధాకరమే. కారణం బాధను భరించలేరు కాబట్టి. మరి కష్టాలు అధిగమించాలంటే మార్గ ముందా? వుంది. కష్టాల్ని తట్టుకునే శక్తి సంపాదించుకోవాలి. ఎందుచేత నంటే పాపకర్మల వల్ల మనకు కష్టం లేకుండా చెయ్యడం ఎవరికీ సాధ్యం కాదు. కాని కష్టాన్ని తట్టుకునే శక్తి మాత్రం మనం సంపాదించుకోవచ్చు. ఎప్పుడయితే కష్టాన్ని తట్టుకునే శక్తి మనకు ఉంటుందో, ఎన్ని కష్టాలు వచ్చినా లెక్కచెయ్యం. కష్టాన్ని తేలికగా అధిగమిస్తాం. అది ఎలాగో చూద్దాం.

సాధారణంగా ఎవరి దేహానికి గాయమైనా, శరీరంలో ఏ భాగంలో నొప్పివచ్చినా, ఆ బాధ దేహానిదనుకుంటాం. కానీ బాధ దేహానిది కాదు, మనస్సుది అన్న సంగతి చాలా మందికి తెలియదు.

చిన్న ఉదాహరణ చూద్దాం. విపరీతమైన కడుపునొప్పితో బాధ పడేవాడిని, సహజంగా బంధువులు కానీ, స్నేహితులు కానీ పరామర్శించ టానికి వస్తారు. అప్పటి దాకా నొప్పి, నొప్పి అని బాధ పడేవాడు, నొప్పికి కారణం చెపుతూ మాటల్లో పడతాడు. మాటలు చెపుతున్నంతసేపూ నొప్పి అనడు. మాటలు అయిపోగానే మరల నొప్పి అంటాడు. అంటే మాట్లాడుతు న్నంతసేపూ నొప్పి ఏమయ్యింది? నొప్పే కనుక దేహానిదయితే అస్తమానూ ఉండాలి కదా? అంటే మనస్సు వేరే విషయాల మీదకు మళ్ళినపుడు నొప్పి లేదు? మనస్సు దృష్టి నొప్పి మీద ఉంటేనే నొప్పి అంటున్నాడు. అంటే నొప్పి మనస్సుదే కాని దేహానిది కాదు అని మనకు స్పష్టంగా అర్థం అవుతుంది.

అంతేకాదు ఎవరైనా చిన్న పిల్లవాడికి అన్నం తినిపించేటప్పుడు వాడికి నచ్చకపోతే నాకు వద్దు, అని మారాం చేస్తాడు. అప్పుడు తల్లి చందమామను చూపించి, పిల్లినో, కాకినో చూపించి , లేకపోతే ఏదైనా చిన్న కథ చెప్పి, ఆ పిల్లవాడి మనస్సు వాటి మీదకు మళ్ళిస్తుంది. అప్పుడు

వాడు తినేస్తూంటాడు. కాని కథ అయిపోగానే ఆ పిల్లవాడి మనస్సు ఆహారం మీదకు మళ్ళుతుంది. వెంటనే వద్దని మారాం చేస్తాడు. అంటే ఇక్కడ కూడా తినేది మనస్సే కానీ నోరు కాదు అని మనం అర్థం చేసుకోవచ్చు.

అలాగే జీవితంలో అనేక సందర్భాలలో మనం ఈ విషయం గమనించవచ్చు. ఏదైనా మంచి ఉపన్యాసం మీద మనస్సు లగ్నమైనపుడు ఆసక్తికరమైన విషయం వింటున్నప్పుడు, గంటల గంటల సమయం ఇట్టే గడిచిపోతుంది. అప్పుడు ఆకలి గురించి కాని, దాహం గురించి కానీ, ఫాను వుందా? లేదా? ఉక్కపోస్తుందా? అన్నది కూడా తెలియదు. కానీ మనస్సు మళ్ళితే మరల అన్నీ కావాలనిపిస్తుంది. అలాగే కామపూరితమైన కోరికలు కూడా మనస్సువే కానీ, శరీరానివి కావని గమనిస్తే మనకు అర్థం అవుతుంది.

దీనిని బట్టి కష్టమైనా, సుఖమైనా, బాధ అయినా, సంతోషమైనా అనుభవించేది మనస్సే కానీ శరీరం కాదు అని స్పష్టంగా తెలుస్తుంది. అంటే ఇంద్రియాల ద్వారా అన్నీ అనుభవించేది మనస్సే అని మనం తెలుసుకోవచ్చు. మనస్సు ఎప్పుడూ సుఖాన్నే కోరుకుంటుంది. కష్టాన్ని భరించలేదు. అందుకే మనం చిన్న కష్టం వచ్చినా తట్టుకోలేం విలవిలలాడతాం.

మరి ఈ స్థితి నుంచి మనం బయటపడాలంటే ఒక్కటే మార్గం. మనస్సు యొక్క ప్రాముఖ్యం తగ్గించాలి. అంటే మనస్సు యొక్క శక్తి తగ్గించాలి. ప్రస్తుతం మనశరీరం మనస్సు ఆధీనంలో వుంది. అంటే మనస్సు ఎలా చెపితే అలా పని చేస్తుంది. మనస్సు ఆధీనంలో దేహం వున్నంత సేపు మనసుకు కలిగిన బాధ దేహం ద్వారా వ్యక్తం చేస్తాం. అందుచేత మనస్సు ఆధీనంలో వున్న దేహాన్ని ఇంద్రియాలను మనస్సు ఆధీనంలో నుండి తప్పించి ఆత్మ ఆధీనంలో వుంచాలి. అప్పుడు మనస్సు ఆధీనంలో ఉన్న దేహం, ఇంద్రియాలు ఆత్మ ఆధీనంలోకివస్తాయి. ఎప్పుడయితే ఆత్మ ఆధీనంలో దేహం వుంటుందో ఎన్ని బాధలు, కష్టాలు వచ్చినా బాధ అని అనం. కారణం దేహానికి బాధ వుండదు, అలాగే ఆత్మ అంటే భగవంతుడు కనుక, భగవంతునికీ దుఃఖం వుండదు. అలాంటి స్థితిలో ఏ కష్టం వచ్చినా బాధపడం.

గమనిస్తే బాధ అనుభవించేది మనస్సే, రుచి కోరేది మనస్సు, శారీరక వాంఛ మనస్సుది, చూసేది మనస్సు, వినేది మనస్సు, అన్నీ కోరేది మనస్సు, కష్టమైనా, సుఖమైనా అన్నీ మనస్సువే కాని దేహానివి కాదు. అందుచేత " అన్నీ అనుభవించేది మనస్సే" అని తెలుసుకోవాలి.

దేహాన్ని మనస్సు ఆధీనంలో వుంచితే అంతా దుఃఖమే, కానీ ఆత్మ ఆధీనంలో వుంచితే అంతా ఆనందమే. దేహాన్ని ఆత్మ ఆధీనంలో ఉంచాలంటే ఒక్కటే మార్గం అదే "ఆనాపానసతి ధ్యానం" చెయ్యడం. ఈ ధ్యాన సాధన విశేషంగా చేస్తే మనస్సు ప్రాముఖ్యం పూర్తిగా తగ్గించుకోగలుగుతాం. మనస్సును కాలిపోయిన త్రాడులా తయారు చేసుకుంటాం. కాలిపోయిన తాడు చూడటానికి తాడులా వుంటుంది కానీ ఏ మాత్రం పనిచేయదు. మనస్సు వుంటుంది. కానీ ప్రాముఖ్యత వుండదు.

భోగుల దేహం మనస్సు అధీనంలో వుంటుంది. అందుచేత శరీరానికి బాధ కలిగితే దుఃఖిస్తాడు. కానీ యోగుల దేహం ఆత్మ ఆధీనంలో వుంటుంది. అందుచేత శరీరానికి బాధ కలిగినా దుఃఖించడు. దేహ బాధలు భోగికి, యోగికి ఒక్కటే. కానీ భోగి దుఃఖిస్తాడు. యోగి దుః ఖించడు. ఇదే తేడా.

యోగి అయిన రమణమహర్షి చేతికి కాన్సరు పుండు అయినా ఎప్పుడూ నవ్వుతూ వుండేవారు. జీసస్‌కు చేతిలో మేకులు దిగవేసినా వారిని క్షమించమని ప్రార్థించాడే కానీ బాధపడలేదు. శ్రీరామచంద్రుడు వనవాసం చేశాడే కానీ బాధపడలేదు. అలా ప్రతీ యోగీ కష్టాలు పడినవాడే. వారెప్పడూ బాధపడలేదు. వారంతా మనస్సును జయించిన మహాత్ములు. వారిలాగే మనం కూడా మనస్సును జయించి కష్టాలు అధిగమిద్దాం.

## తెలుసుకోండి

**మనం ఎవరమో మనకు తెలియకపోవటమే అజ్ఞానం.**

**భగవంతుడు జన్మ ఇచ్చింది భౌతిక సంపదలు పెంచు కోవటానికి కాదు. జ్ఞాన సంపద పెంచు కోవటానికి.**

**పాపపు పనులు చేసేవాడు నరకాన్ని పుణ్యాత్ములు స్వర్గాన్ని పొందుతారు. మనస్సులో మాలిన్యం లేని మహాత్ములు పరినిర్వాణాన్ని పొందుతారు.**

**-గౌతమ బుద్ధుడు.**

# తప్పు ఎవరిది?

సహజంగా లోకంలో ప్రతీవారు ఇతరులను విమర్శిస్తూంటారు. అక్కడకు తామేదో మంచివారైనట్టు. ఇతరులే చెడ్డవారన్నట్టు. తమలో చెడే లేనట్టు ప్రవర్తిస్తూంటారు.

ముఖ్యంగా మనలో చెడు వుంటేనే ఇతరులలో చెడు కనబడుతుంది. అందుచేత విమర్శించేవారు తమలోనే చెడు వుందని గ్రహించాలి. తమలో చెడు లేకపోతే ఎవరిలోనూ చెడు కనిపించదు.

అలా ఇతరుల చెడు చూసే బదులు, తమలో చూసుకుంటే తమలో ఎన్ని చెడు గుణాలు ఉన్నాయో, తమను సరిచేసుకోవలసింది ఎంత వుందో స్పష్టంగా తెలుస్తుంది. మరి తమను సరిచేసుకోవడానికి ప్రయత్నించకుండా, ఎంతసేపూ ఇతరులను విమర్శిస్తూ కూర్చుంటే ప్రయోజనమేమిటి? అలా చేస్తే తాను మంచి వాడైపోతాడా?

తమలోనే ఎన్నో దోషాలు వుంటే, ఇతరులను విమర్శించే హక్కు తనకెక్కడిది? ఒకసారి కొందరు, ఒక వేశ్యను తప్పు చేసిందని రాళ్ళతో కొట్టి శిక్షిస్తుండగా "జీసస్" ఇలా అన్నారు. మీలో ఏ తప్పు చేయనివారు ఎవరైనా వుంటే, వారు ఆమెను శిక్షించవచ్చు అన్నారు. అప్పుడు అందరూ రాళ్ళు క్రింద పడేశారు. అంటే అందరూ తప్పులు చేస్తున్నట్టే కదా? అందరిలోనూ దోషాలు వున్నట్టే కదా?

అందుకే వేమన యోగీంద్రులు ఇలా అన్నారు.

"తప్పలెన్నువారు తండోపతండంబు  
ఉర్విజనులకెల్ల నుండు తప్ప  
తప్పలెన్ను వారు తమ తప్పలెరుగరు!  
విశ్వదాభిరామ వినురవేమ!"

అందుచేత తప్పులు ఎంచడం గొప్పకాదు! తప్పులు సరి చేసు కోవడమే గొప్ప! ప్రతీ ఒక్కరూ తమలోని చెడును సరిచేసుకోవాలి. తమను మార్చుకోవాలి! తమ మీద దృష్టి వుంచాలి.

గుర్తుంచుకోండి "తప్పులు ఎంచడమే తప్పు, విమర్శించడమే తప్పు". విమర్శించడం సృష్టి ధర్మానికి విరుద్ధం. ప్రకృతి ధర్మానికి విరుద్ధం.

శ్రీ కృష్ణ భగవానుడు గీతలో ఏమన్నారంటే

ప్రతీ ఒక్కరు “సత్వ, రజ, తమో” గుణాలలో ఏదో ఒక గుణంతో, ప్రవర్తిస్తారు. అంటే ఏ గుణం వున్న వారు అలా ప్రవర్తిస్తారు. అంటే తమోగుణం వున్నవారు కుంభకర్ణునిలా, రజోగుణం వున్నవారు రావణాసురినిలా, సత్వ గుణం వున్నవారు విభీషణుడిలా ప్రవర్తిస్తుంటారని ఆయన సందేశం.

అందుచేత కొంతమంది ఏమీ చేయకుండా బద్ధకస్తుడిలా వుండటం సహజమే. కొంతమంది హత్యలు చేయడమూ సహజమే. కొంతమంది సేవలు చేయడమూ సహజమే. అందుచేత తమోగుణంలో వున్నవారు, రజోగుణంలో వున్నవారిగా ప్రవర్తించరు. రజోగుణంలో వున్నవారు సాత్వికగుణంలో వున్నవారిలాగా ప్రవర్తించరు. సాత్వికగుణంలో వున్నవారు నిర్గుణుడైన శ్రీరామచంద్రునిలా ప్రవర్తించలేరు. అందుచేత ఎవరి గుణాన్ని బట్టి వారు ప్రవర్తిస్తుంటారు. అందుచేత ఎవరినీ విమర్శించకూడదు.

“తప్పు ఎవరిదీ అంటే తప్పు అన్న వారిదే తప్పు”

అందుకే పత్రీజీ ముఖ్యంగా ఈ రెండూ చెపుతూ వుంటారు. “నో కామెంట్, నో జడ్జిమెంట్”. అంటే “ఎవరినీ విమర్శించవద్దు, ఎవరి గురించి నిర్ణయాలు చెయ్యవద్దు”. అందుచేత అందరినీ విమర్శిస్తూ సమయాన్ని వ్యర్థం చేయకుండా ధ్యానం చేస్తూ మనల్ని మనం సరిచేసుకుందాం! మనలోని దోషాల్ని తొలగించుకుందాం! మంచి వారుగా మారుదాం!

## తెలుసుకోండి

**గురువు దారి చూపిస్తాడే కానీ చెయ్యి పట్టుకుని నడిపించడు.**

**మృత్యువు నిన్ను నాశనం చేయదు. అది కేవలం నిన్ను నీ శరీరం నుండి వేరు చేస్తుంది.**

# "ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి!"

"ఉద్ధరేదాత్మ నాత్మానం" - అని భగవద్గీతలో శ్రీ కృష్ణ భగవానుడు చెప్పారు. అంటే "ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి" అంటే ఒకరిని ఒకరు ఉద్ధరించరు. అంటే మనల్ని ఒక దేవుడు కానీ, గురువు కానీ ఉద్ధరించలేరు.

కారణం మన జీవితంలో జరిగే సంఘటనలకు మనమే బాధ్యులం అంటే . మన దుఃఖాలకు, కష్టాలకు, సమస్యలకు మనమే కారణం. అలాగే మన సుఖాలకు, భోగాలకు, ఆనందానికి మనమే కారణమని తెలుసుకోవాలి.

గతంలో మనం చేసిన పాపాలే దుఃఖాలవుతున్నాయి. మనం చేసిన పుణ్యాలే భోగాలవుతున్నాయని తెలుసుకోవాలి.

మన పాపాల ద్వారా వచ్చిన మన కష్టాలు, రోగాలు పోవాలంటే మన స్వయం ధ్యాన సాధన ద్వారానే పోగొట్టుకోవాలి. "మనం ఇప్పుడు బాధపడుతున్నాము అంటే గతంలో ఎవరినో బాధించామని అర్థం". ఇప్పుడు "మోసపోయామంటే గతంలో ఎవరినో మోసం చేశామని అర్థం". ఇప్పుడు "నష్టపోయామంటే గతంలో ఎవరినో నష్టపెట్టామని, ఏక్సిడెంట్‌లో మన చెయ్యి పోయిందంటే గతంలో ఎవరి చెయ్యో నరికామని" తెలుసుకోవాలి. అలా "మనం గతంలో చేసిందే ఇప్పుడు మనం అనుభవిస్తున్నాం".

అలాగే భవిష్యత్‌లో మనం ఆరోగ్యంగా ఉండాలంటే మనం ఇప్పుడు పాపాలు చేయకూడదు. మనం సంతోషంగా ఉండాలంటే ఎవరినీ దుఃఖ పెట్టకూడదు. భవిష్యత్తులో మనకు కష్టం కలగకూడదనుకుంటే మనం ఇప్పుడు ఎవరినీ కష్టపెట్టకూడదు. ఎవరి వల్లా మనకు అపకారం జరగకూడదనుకుంటే మనం ఎవరికీ అపకారం చేయకూడదు. గతంలో చేసుకున్నది ఇప్పుడు అనుభవిస్తున్నప్పుడు భవిష్యత్‌లో ఏది కోరుకుంటామో అదే ఇప్పుడు చెయ్యాలి అలాగే ఏది వద్దనుకుంటామో అది చెయ్యకూడదు.

మన కష్టాలు తీరాలంటే  మన పాపాలను మన ధ్యాన సాధన ద్వారా మనమే పోగొట్టుకోవాలి. మన సుఖాలను మన ధర్మాచరణ ద్వారా మనమే పొందాలి.

అంతేకాని "ఏ భగవంతుడో వచ్చి మనలను రక్షిస్తాడు" అని అనుకోవడం పొరపాటు! మన మంచి చెడులు  మనవే చూసుకోవాలి. ఎవరి  జీవితంలో భగవంతుడు తల దూర్చడు. ఆయన సాక్షీభూతుడు.

పూజలు, ప్రార్థనలు, నమాజులు చేస్తూ ఎంతసేపూ ఆ భగవంతుడే వచ్చి మన కష్టాలు తీరుస్తాడని ఎదురుచూడకూడదు. మన జీవితం ఆనందమయం కావాలంటే! మన ప్రయత్నం తప్పనిసరి. అలా "మనల్ని మనమే ఉద్ధరించుకోవాలి".

**ప్రార్థించేవాడు భంగపడతాడు**
**సాధన చేసేవాడు ఆనందం పొందుతాడు**

## తెలుసుకోండి

**పత్రి గారు చేసే ప్రయత్నం ఏమిటంటే నీకు దేవుని చూపించటం కాదు. నిన్నే దేవుడిగా చేస్తున్నారు.**

**గతం నిరంతరం ప్రస్తుతంలోనికి వస్తూ ఉంటే ప్రస్తుతాన్ని అది వుండనివ్వదు.**
**నీవు ప్రస్తుతాన్ని కోల్పోతే  అన్నింటిని కోల్పోయినట్లే.**

# "మనకు ఇవ్వబడింది ఏదీ మనది కాదు!"

చాలామందిని చూస్తూ ఉంటాం. వారికి ఐశ్వర్యం, పదవులు, చదువు, తెలివి తేటలు, పాండిత్యం, మాట్లాడే నైపుణ్యం లాంటివి వుంటాయి. కొంతమంది వివిధ రంగాల్లో అంటే ఆటలు, పాటలు, కవితలు, కంప్యూటర్, సైన్స్ మొ॥గు వాటిలో అత్యున్నత స్థితికి చేరుకుంటారు. వారు అదంతా తమ గొప్పతనమనుకుంటారు. తమ కష్టార్జితమనుకుంటారు. అలా వారు వారికున్నది చూసి గర్విస్తారు. అందరికన్నా తామే అధికులమని భావిస్తారు. వారు ఏ స్థితికి ఎదిగినా, తృప్తి చెందక ఇంకా ఇంకా అధికులు కావాలని స్వార్థంతో చేయకూడని పనులు చేస్తారు.

కానీ సృష్టిలో మనకి ఏది ఇవ్వబడినా అది మన కోసం కాదు. అది లోకం కోసం, లోక కళ్యాణం కోసం మాత్రమే. లోకానికి ఒక్కొక్కరి ద్వారా ఒక్కొక్కటి ఇవ్వబడుతుంది. ఒక్కడే అన్నీ చెయ్యలేడు కాబట్టి వారి స్థితిని బట్టి ఒక్కొక్కటి ఇవ్వబడుతుంది.అందుచేత మనకి ఏది ఇవ్వబడినా దానిని ఇతరులకు, లోకానికి ఉపయోగించాలి.

కలలో కనిపించినవి నిజమనుకుంటే ఎంత అవివేకమో. ఇవి కూడా అంతే. ఇవి కూడా భ్రాంతే. ఎప్పడో ఒకప్పడు మాయమయ్యేవే. కానీ అన్నీ నిజమనుకుని దోచుకుంటున్నాం. దాచుకుంటున్నాం. మనం మన ముందు వారిని ఎంతో మందిని చూస్తున్నాం. అలా రాజులు పోయారు, రాజ్యాలు పోయాయి. పదవులు పోయాయి. అందాలు పోయాయి, యవ్వనం పోయింది, కండలు పోయాయి. పేరు ప్రఖ్యాతులు పోయాయి. ఆరోగ్యం పోయింది, అసలు జీవితమే ఉండటం లేదు. మరి మన ముందు వారి విషయంలో ఇవన్నీ చూస్తూ కూడా వాటన్నిటి మీద మమకారం వదులుకోలేక మళ్ళీ అవే కావాలని కోరుకుంటున్నాం. వచ్చినవన్నీ నావే అని కూడబెడుతున్నాం.

ఈ సకల చరాచర జగత్తు అంతా, ఆ పరమాత్మదే. అందులో స్వల్పాతి స్వల్పమే మనకు ఇవ్వబడింది. మరణించిన తరువాతే కాకుండా, ఉండగానే మన నుండి తీసుకోబడుతున్నాయి అందుచేత మనకు

ఇవ్వబడింది. అంటే డబ్బు కాని, సమయం కాని, తెలివి కానీ, శక్తి కానీ మనది కాదు అని తెలుసుకోవాలి! కొంత లోకానికి పంచాలి. ప్రత్యేకించి మనకు ఇవ్వబడడంలోని ఉద్దేశ్యం గ్రహించాలి

అలాగే ఇచ్చింది సద్వినయోగం కాకపోయినా అంటే లోకానికి ఉపయోగించకపోయినా! దుర్వినియోగమయినా! ఈ జన్మలోనే తీసుకోబడుతుంది. అలా డబ్బు వున్న వాళ్ళు బికారులుగా మారటం చూస్తున్నాం. పదవులు కోల్పోయిన వారిని కూడా చూస్తున్నాం. ఎంత నైపుణ్యం వున్నా దుర్భరమైన జీవితం గడిపే వాళ్ళని కూడా చూస్తున్నాం. అందుచేత మనదగ్గర ఏది వున్నా దాన్ని సద్వినియోగం చెయ్యటానికి ప్రయత్నించాలి. అసలు మనదే మనది కానపుడు ఇతరులది మనదెలా అవుతుంది? అందుచేత ఇతరులది ఆశించకూడదు. ఇతరులను మోసగించకూడదు.

అలాంటి స్థితి రావాలంటే ధ్యానం చెయ్యాలి.

## తెలుసుకోండి

**కష్టాలు ఎదుర్కోవాలంటే కష్టాల వల్ల వచ్చే ఫలితం మీద ధ్యాస వుంచాలి. చెట్టు మీద పండు అందాలి అంటే చెట్టు ఎక్కడానికి కష్టపడాలి.**

**నీదన్నది ఈ లోకంలో ఏదీ లేదని మరువకు. అంతా ఆ పరమేశ్వరునిదే. నీదనుకున్నదంతా వదిలి వేయవలసిందే.**

# ఎందుకు ఇవ్వాలి?

మనం ఎన్నో కావాలని కోరుకుంటాం. కోరుకోవడానికి కోరు కుంటున్నాం కానీ కోరుకున్నవన్నీ ఎందుకు పొందలేకపోతున్నాం? కారణం సృష్టి సిద్ధాంతం అంటే భగవంతుని సిద్ధాంతం మనం అర్థం చేసుకోక పోవడమే! ఆయన సిద్ధాంతం ప్రకారం మనం సృష్టి నుండి ఏవి కోరుకుంటామో అవి ఇవ్వాలి. అలా ఇస్తేనే సృష్టి నుండి వచ్చేది. అందుచేత ఎందుకు ఇవ్వాలి? ఎందుకు మంచి చెయ్యాలి? అన్న వివరాలు చూద్దాం.

(1) ఎందుకు మంచి చెయ్యాలి? - మన మంచి కోసమే.

(2) ఎందుకు ప్రేమించాలి? - మనం ప్రేమించబడటానికి.

(3) ఎందుకు దయ చూపించాలి? - మనం దయ పొందటానికి.

(4) ఎందుకు కరుణ చూపించాలి? - మనం కరుణ పొందటానికి.

(5) ఎందుకు క్షమించాలి?- మనం క్షమింపబడటానికి.

(6) ఎందుకు కనికరించాలి? - మనం కనికరింపబడటానికి.

(7) ఎందుకు జాలి చూపించాలి? - మనం జాలి పొందటానికి.

(8) ఎందుకు గౌరవించాలి? - మనం గౌరవింపబడటానికి.

(9) ఎందుకు శాంతిని పంచాలి? - మనం శాంతిని పొందటానికి.

(10) ఎందుకు ఆనందం పంచాలి? - మనం ఆనందం పొందటానికి.

(11) ఎందుకు ధర్మం చెయ్యాలి? - మనం లాభం పొందటానికి.

(12) ఎందుకు పుణ్యం చెయ్యాలి? - మనం భోగం పొందటానికి.

(13) ఎందుకు చెడు చేయకూడదు? - మనకు చెడు జరుగకుండా వుండటానికి.

(14) ఎందుకు హింసించకూడదు? - మనం హింసింపబడకుండా వుండటానికి.

(15) ఎందుకు కష్టపెట్టకూడదు? - మనం కష్టాలు పాలు కాకుండా వుండటానికి.

(16) ఎందుకు నష్టపెట్టకూడదు? - మనం నష్టపోకుండా వుండటానికి?

(17) ఎందుకు మోసగించకూడదు? - మనం మోసపోకుండా వుండటానికి.

(18) ఎందుకు విమర్శించకూడదు? - మనం విమర్శింపబడకుండా వుండటానికి.

(19) ఎందుకు దూషించకూడదు? - మనం దూషింపబడకుండా వుండటానికి.

(20) ఎందుకు అవమానించకూడదు? - మనం అవమానింపబడకుండా వుండటానికి.

(21) ఎందుకు ద్వేషించకూడదు? - మనం ద్వేషింపబడకుండా వుండటానికి.

(22) ఎందుకు జ్ఞానం పంచాలి? - మనం జ్ఞానవంతులు కావటానికి.

(23) ఎందుకు ధ్యానం చెయ్యాలి? - మనం ముక్తిని పొందటానికి.

అందుచేత సృష్టి సిద్ధాంతం అంటే భగవంతుని సిద్ధాంతం ప్రకారం ఏది వద్దనుకుంటామో అది ఇవ్వకూడదు. ఏది కావాలనుకుంటామో అది ఇవ్వాలి. అంతే కాని పూజల వల్ల, ప్రార్థనల వల్ల, నమాజుల వల్ల, భజనల వల్ల ఏ ప్రయోజనం లేదు.

## తెలుసుకోండి

**కోరిక అన్ని బాధలకూ మూలం.**

**లోకం, లోకంగా నిజం కాదు. లోకం బ్రహ్మంగా నిజం.**

**గొలుసు, గొలుసుగా నిజం కాదు. గొలుసు బంగారంగా నిజం.**

# "స్వార్థం - నిస్వార్థం!"

తమ గురించి, తమ వారి గురించి ఆలోచించడం స్వార్థం. ఇతరుల గురించి ఆలోచించడం నిస్వార్థం. తన బాగు చూసుకోవడం, తన గురించి పాటుపడడం స్వార్థం, కాని ఇతరుల బాగు చూడటం, ఇతరుల గురించి పాటుపడటం నిస్వార్థం.

సహజంగా లోకంలో తమ గురించి ఆలోచించేవారు ఎక్కువ వుంటారు. ఇతరుల గురించి ఆలోచించేవారు తక్కువ. తమ గురించి ఆలోచించే వారు తాము, తమ కుటుంబం బాగా వుండాలని, సుఖంగా వుండాలని, అందరికంటే ఉన్నతంగా, గొప్పగా, బ్రతకాలని అనుకుంటారు. అందుచేత తమకోసం, తమ ఆనందం కోసం, తమ ఉన్నతి కోసం ఎంతో కష్టపడతారు, పాటు పడుతూవుంటారు. అంతేకాదు, తమ కోసం ఇతరులను మోసగిస్తారు. అధర్మంగా ప్రవర్తిస్తారు. పాపాలు కూడా చేస్తారు. చివరకు జీవితాన్ని దుఃఖమయం చేసుకుంటారు.

కాని ఇతరుల కోసం ఆలోచించేవారు, ఇతరులను, మోసగించరు, అధర్మంగా ప్రవర్తించరు, పాపాలు చెయ్యరు, ఆనందంగా జీవిస్తారు.

ఇంకా గమనిస్తే తమ కోసం ఆలోచించేవారు ఎప్పుడూ తమ భవిష్యత్తు గురించి భయపడుతూ వుంటారు. తమ భవిష్యత్తు ఎలా వుంటుంది? జీవించినంతకాలం లోటు లేకుండా వుంటుందా? ఎవరిమీదా ఆధారపడకుండా వెళ్ళిపోగలనా? లేదా? అని భయపడుతూంటారు. ఎంత సంపాదించినా, ఎంత కూడబెట్టినా ఇంకా సందేహిస్తూనే వుంటారు. భవిష్యత్తు గురించి ఆందోళన చెందుతూంటారు.

కాని ఇతరుల గురించి ఆలోచించేవారు, ఎప్పుడూ తమ భవిష్యత్తు గురించి భయపడరు, అసలు ఆలోచించనే ఆలోచించరు. వారికి ఏ రకమైన ఆందోళన వుండదు.

గమనిస్తే తమ గురించి ఆలోచించేవారు తమ గురించి తాము జాగ్రత్త పడాలి. తమ గురించి తామే చూసుకోవాలి. కాని ఇతరుల గురించి ఆలోచించే వారు తమ గురించి జాగ్రత్త పడవలసిన పనిలేదు.

వారి గురించి ఇతరులు జాగ్రత్త పడతారు. కారణం తాము ఇతరులను చూస్తే ఇతరుల తమను చూస్తారు కనుక.

తమ గురించి ఆలోచించేవారు తమ దగ్గర తమకు కావలసినవన్నీ జాగ్రత్త పెట్టుకోవాలి. ఎంత జాగ్రత్త పెట్టుకున్నా అవి ఎంతకాలం వుంటాయో గ్యారంటీ లేదు. కోల్పోవచ్చు కూడా. కాని ఇతరుల గురించి ఆలోచించేవారు తమకు కావలసినవన్నీ ఇతరుల దగ్గర జాగ్రత్త పెట్టినట్టే. ఇతరుల దగ్గర వున్నవన్నీ వారివే.

అందుకే స్వార్ధపరులైన భోగులు తమను తాము చూసుకోవాలి. కాని నిస్వార్ధంగా జీవించే యోగుల గురించి అంతా చూసుకుంటారు. వారు ఎక్కడకు వెళ్ళినా ఎవరో ఒకరు ఆదరిస్తారు, ఆహ్వానిస్తారు. ఆతిధ్యమిస్తారు. కాని భోగులు ఎక్కడకు వెళ్ళినా తమ బస, ఆహారం అన్నీ తామే చూసుకోవాలి. సృష్టి రహస్యమేమిటంటే అందరికి మంచి చేస్తే అందరూ మనకి సేవచేస్తారు. అందుచేత అందరి గురించి ఆలోచించే నిస్వార్ధపరులు తమ గురించి తాము ఆలోచించనవసరం లేదు. కాని స్వార్ధంతో తమ గురించి పాటుపడేవారు తమ గురించి తామే ఆలోచించుకోవాలి.

మన గురించి మనం ఎంత ఆలోచించినా ఇంకా భయం వుంటూనే వుంటుంది. అందుచేత నిర్భయంగా జీవించాలంటే! అందరి గురించి పాటుపడాలి. నిస్వార్ధంగా జీవించాలి. ఇదే యోగులు మహాత్ములు నడిచిన మార్గం.

నిస్వార్ధంగా జీవించాలంటే ధ్యానం చెయ్యాలి. యోగులులా ధ్యానం చెయ్యడమే ఏకైక మార్గం.

**తెలుసుకోండి**

**అన్ని ప్రాణులు ఒకటేనన్న అభిప్రాయం మనకి వచ్చిన రోజున మనం ఏ ప్రాణికి భయపడం.**

# "కనపడేదే కాదు - కనపడని జీవితం చాలా ఉంది!"

సామాన్యంగా మానవులంతా తమ శారీరక సుఖాల కోసం ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ ఎంత ప్రయత్నం చేసినా తాము కోరుకున్న సుఖం, ఆరోగ్యం, ఆనందం, శాంతి పొందలేకపోతున్నారు. ఎందుచేతనంటే వారి జీవితం గురించి వారు తెలుసు కున్నది చాలా స్వల్పం. ఇంకా వారు తెలుసు కోవలసిన, తెలియని జీవితం ఎంతో ఉంది. వారి కనబడని జీవిత ప్రభావం ప్రస్తుతం కనిపించే జీవితం మీద చూపుతుందని వారు తెలుసు కోలేకపోతున్నారు. మరి వారి కనబడని జీవితం గురించి అర్థం చేసుకోకుండా, దాని గురించి ఆలోచించకుండా కనబడే జీవితం గురించే ఆలోచించి, కష్టపడటం వల్ల ప్రయోజనం లేదు, వారు కోరుకున్న ఆనందం పొందలేరు.

మానవులకు కనిపించని జీవితం కూడా చాలా వుంది. ఆ కనిపించని జీవితం గురించి అర్థం చేసుకుంటేనే కనిపించే జీవితం సుఖమయమవుతుంది. కనిపించే జీవితం స్వల్పం - కనిపించని జీవితం అనంతం. ఎక్కువగా ఉన్న జీవితాన్ని వదలి తక్కువ భాగం వున్న జీవితం గురించి ఆలోచిస్తే దుఃఖమే మిగులుతుంది. అందుచేత కనబడని ఎక్కువ జీవితానికి ఎక్కువ సమయం కేటాయించాలి. కనబడే తక్కువ జీవితానికి తక్కువ సమయం కేటాయించాలి. కానీ తక్కువ జీవితానికి పూర్తి సమయం కేటాయిస్తున్నాం. అనంతమైన కనబడని జీవితానికి అసలు సమయమే కేటాయించడం లేదు.

అసలు మనం ఎవరు? ఎక్కడ నుండి వచ్చాం? తిరిగి ఎక్కడకు వెళతాం? గత జీవితానికి, ఇప్పటి జీవితానికి సంబంధం వుందా? దాని ప్రభావం ఈ జీవితం మీద వుంటుందా? ఉంటే ఎలా వుంటుంది? ఈ జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది? అసలు దేనికి ప్రాముఖ్యం ఇవ్వాలి? కనబడని శాశ్వతమైన మన గురించా? కనిపించే, నశించిపోయే ఈ తాత్కాలికమైన శరీరం గురించా? అసలు వీటన్నిటినీ తెలుసుకోవటం ఎలా?

ఇన్ని విషయాలు అర్థం చేసుకోవలసి వుండగా, మనం డబ్బు, సంపదలు, పేరు ప్రఖ్యాతులు, పదవులలాంటివి సంపాదించటానికి

ప్రయత్నిస్తున్నాం. ఎందుకంటే ఇప్పుడు మనకు కనిపించే తల్లిదండ్రులే కాకుండా ఇంకా ఎంతో మంది తల్లిదండ్రులు గతంలో వున్నారు. అలాగే భార్యలు ఉన్నారు. భర్తలు ఉన్నారు. పిల్లలు ఉన్నారు. భవిష్యత్తులో వుంటారు. మరి వారందరి గురించి ఎందుకు ఆలోచించటం లేదు?

అసలు మనకు కనబడేది, మనకు తెలిసింది చాలా స్వల్పం. మనకు కనబడనిది, మనం తెలుసుకోవలసింది అనంతం. తెలుసుకోవలసిన అనంతమైన దాని గురించి ఆలోచించకుండా జీవితాన్ని వ్యర్థం చేసుకుంటున్నాం.

అందుచేత ఉన్న కాస్త జీవితాన్ని వృధా చేయవద్దు. సద్వినియోగం చేసుకోవాలి. కనిపించని జీవితం గురించి కూడా ఆలోచించాలి. ఎవరయితే కనపడని జీవితం గురించి ఆలోచించి సాధన చేస్తారో వారికే ప్రస్తుత కనబడే జీవితం సుఖమయం అవుతుంది. మరి కనబడని జీవితం గురించి తెలుసుకోవాలన్నా, కనబడే జీవితం ఆనందంగా ఉండాలన్నా ఒక్కటే మార్గం. అదే ధ్యానం. ధ్యానం ఒక్కటే కనబడని జీవితానికి సంబంధించినది.

గమనిస్తే యోగులు కనబడే జీవితం కంటే కనబడని జీవితానికే పూర్తి ప్రాముఖ్యం ఇచ్చారు. జీవితమంతా ధ్యానానికి కేటాయించారు కాని భోగులు కనబడే జీవితానికే ప్రాముఖ్యం ఇస్తున్నారు. భోగాలకు ప్రాముఖ్యం ఇస్తున్నారు. దుఃఖాల పాలవుతున్నారు.

మనం కూడా యోగులులా కనబడని జీవితానికి కూడా ప్రాముఖ్యం ఇచ్చి కొంత సమయాన్ని ధ్యానానికి కేటాయిద్దాం. జీవితాన్ని సద్వినియోగం చేసుకుందాం.

## తెలుసుకోండి

**వ్యక్తి తనను తాను తెలుసుకోవటం ద్వారా అందరినీ తెలుసుకోగలడు.**

# "ఉండేది - లేనివి!"

సృష్టిలో రెండు రకాలు వున్నాయి. ఉండేవి - లేనివి. అంటే ఉండేవీ వున్నాయి లేనివీ వున్నాయి. ఇదే సృష్టి యొక్క గొప్పతనం. ఉండేవి శాశ్వతమైనవి. లేనివి తాత్కాలికమైనవి.

ఇంకా విచిత్రమేమంటే ఉండేవి లేనట్లుగా కనిపిస్తాయి. లేనివే ఉన్నట్టుగా కనిపిస్తాయి. అందుచేత మానవులు ఉన్నట్టుగా కనిపించే లేని వాటికోసం ప్రయత్నిస్తారు. తాపత్రయం పడతారు. సంపాదించుకుంటారు. దోచుకుంటారు. కాపాడుకుంటారు. చివరకు భంగపడతారు. చివరకు ఏదీ వుండదు.

ఆశ్చర్యమేమిటంటే వున్నాననుకున్న వాడే వుండడు. తానే లేనపుడు తనవేవి వుంటాయి? ఎంత విచిత్రమో చూడండి. లేని తాను వున్నానుకుంటాడు. లేనివి సంపాదిస్తాడు. లేనివి సంపాదించి గొప్పవాడై పోయాననుకుంటాడు. గర్విస్తాడు. అహంకరిస్తాడు. జీవితమంతా పరుగులు పెడతాడు. ఏదో చేసేస్తున్నాననుకుంటాడు. చివరకు అదృశ్యమైపోతాడు.

ఒక్కసారి బాగా ఆలోచించండి. సృష్టి ఏర్పడి ఎన్నో కోట్ల సంవత్సరాలయ్యింది కదా? ఎన్నో యుగాలు మారాయి కదా? మరి భూమిమీద ఒకసారి కనబడిన వాడు మరల ఎప్పడైనా కనబడ్డాడా? ఏమయ్యాడు? ఉన్నాననుకున్నాడు కదా? మరి లేడేంటి? లేనివాడు ఉండేవాడు, ఎలా అవుతాడు? ఉండేవాడే వున్నవాడు. కాలం మారినా, యుగాలు మారినా ఎప్పడూ ఉండేవాడే ఉన్నవాడు. అలా వుండేవాడు భగవంతుడు ఒక్కడే ఆయనే శాశ్వతమైనవాడు. మార్పు చెందనివాడు సత్యమైన వాడు. అంతే కాని ఉండనివాడు ఉన్నవాడు ఎలా అవుతాడు? అలాగే ఉండనివి కూడా లేనివనే తెలుసుకోవాలి. అందుచేత ఉండేవి ఏవి? లేనివి? ఏవి? అన్నది ముందు తెలుసుకోవాలి. ఇది వివేకవంతులు చేయవలసిన పని.

బాగా గమనిస్తే సృష్టిలో ఏదయితే కనబడుతున్నాయో అవన్నీ లేనివే. అలాగే ఏదయితే కనబడదో అదే వుండేది. ఎంత విచిత్రమో చూడండి. ఉన్నది లేనట్టుగా కనబడుతుంది. లేనివి వున్నట్టుగా కనబడుతున్నాయి.

కాని ఇన్ని తెలివితేటలున్నాయనుకునే మానవుడు లేనివాటినే వున్నాయనుకుంటాడు. ఉన్నదానిని లేదనుకుంటాడు.

కాని లేనిది లేనట్టుగా, ఉన్నది ఉన్నట్టుగా తెలుసుకోగలిగినవాడే తెలివైనవాడు. అలా తెలుసుకున్నవారే యోగులు. భోగులకు ఇవేమీ బోధపడదు. అర్థం కాదు. కాని అన్నీ తెలుసుననుకుంటారు. ఏవేవో చేస్తుంటారు. చివరకు దుఃఖంలో మునిగిపోతారు. అందులోంచి బయట పడలేక ఈ సత్యాన్ని తెలుసుకున్న యోగుల కాళ్ళ మీద పడతారు. రక్షించమని, దిక్కులేనివాడిలా రోదిస్తుంటారు. అందుచేత ఉండేది ఏదో? లేనిది ఏదో? తెలుసుకోవాలి.

గమనిస్తే లేనివన్నీ దుఃఖాన్ని కలిగిస్తాయి. ఉండేదే శ్వాశ్వతమైనది. అదే ఆనందాన్నిస్తుంది. గమనిస్తే ఉండేదాని తెలుసుకున్నవారు గొప్పవారయ్యారు. లేనిది వున్నట్టుగా భావించేవారంతా పాపాల్లో, కష్టాల్లోకూరుకుపోయారు. మరి ఉండేది ఏమిటి? ఎలా తెలుసుకుంటాం? ఉండేది భగవంతుడు ఒక్కడే.

మరి ఉండే భగవంతుని తెలుసుకోవాలంటే ధ్యానం ఒక్కటే మార్గం. అంతకు తప్పించి వేరే మార్గం లేదు. ధ్యానం చెయ్యని వారంతా లేనివే వుండేవి అనుకుంటారు. ఉన్న భగవంతుని గురించి అసలు తెలియనే తెలియదు.

"ఉన్నది ఉన్నట్టుగా, లేనిది లేనట్టుగా" తెలుసుకున్నవాడు, "చావు పుట్టుకలు లేని జీవితం "పొందుతాడు. లేకపోతే వాడికి "చచ్చి పుట్టే జీవితమే "గతి. చచ్చి పుట్టే జీవితమంతా దుఃఖమే. కష్టాలే, బాధలే. మరి దీనిలోంచి బయటపడాలంటే "శ్వాస మీద ధ్యాస వుంచి ధ్యానం" చెయ్యాల్సిందే.

**తెలుసుకోండి**

**సాధకుడు సరైన ధ్యానం చేస్తే అనవసరమైన అలవాట్ల నుండి సహజంగానే విముక్తుడవుతాడు.**

**ఉండనిది ఇస్తేనే ఉండేది వస్తుంది**

# "పరమసుఖం - పరమశాంతి - పరమానందం!"

ఏ సుఖమయితే అన్ని సుఖాలకంటే గొప్ప సుఖమో, ఏ సుఖం పొందితే ఇక పొందవలసిన సుఖం ఉండదో దానిని పరమ సుఖం అంటారు. ఏ శాంతి అయితే అన్నిటికంటే గొప్ప శాంతో, ఏ శాంతి పొందితే ఇక పొందవలసిన శాంతి వుండదో దానిని పరమశాంతి అంటారు. ఏ ఆనందం పొందితే ఇక పొందవలసిన ఆనందం వుండదో అదే పరమానందం. అదే శాశ్వతానందం.

సృష్టిలో ఇహము, పరము అనేవి రెండు వున్నాయి. ఇహము అంటే కనబడేది. పరము అంటే మన కంటికి కనబడనిది. అందుచేత ఇహలోక సుఖము, ఇహలోక శాంతి, ఇహలోక ఆనందము అనేవి వున్నాయి. అలాగే పరలోక సుఖం, పరలోక శాంతి, పరలోక ఆనందము వున్నాయి.

మానవులకు ఇహలోక సుఖాలు, ఇహలోక శాంతి, ఇహలోక ఆనందం మాత్రమే తెలుసు, కాని పరలోక సుఖము, పరలోక శాంతి, పరలోక ఆనందం గురించి తెలియదు.

పరలోకము అంటే ప్రభువు యొక్క లోకము. భగవంతుని లోకము. ఇహలోకము అంటే మానవుల లోకం. మానవుల భూలోకంలో కంటే, భగవంతుని పరలోకంలో వుండే సుఖము, శాంతి, ఆనందం అత్యంత గొప్పది. శాశ్వతమైనది కూడా.

మానవునకు పరము గురించి తెలియక ఎంతసేపూ సుఖము, శాంతి, ఆనందం కోసం ఈ భూలోకంలోనే వెతుకుతున్నాడు పొందటానికి ప్రయత్నిస్తున్నాడు. ఎన్నో జన్మలు ప్రయత్నిస్తున్నాడు. కాని ఎన్ని జన్మలు ప్రయత్నించినా కూడా శాశ్వత సుఖం, శాశ్వత శాంతి, శాశ్వత ఆనందం మాత్రం పొందలేక పోతున్నాడు. చివరకు పరమదుఃఖాన్ని మాత్రం పొందుతున్నాడు. అంటే భూలోకంలో అంటే ఇహలోకంలో పరమ దుః ఖం వుంది కాని పరమ ఆనందం లేదని తెలుసుకోలేకపోతున్నాడు.

సృష్టిలోని ఈ రహస్యాన్ని యోగులు గ్రహించారు. అందుచేత వారు ఇహలోక సుఖాల మీద మమకారం వదులుకున్నారు. ఇహలోకంలోని ఆనందం కోసం ప్రయత్నించలేదు. ఎంతసేపూ వారి దృష్టి

పరమ సుఖం పొదడం కోసం, పరమశాంతి పొందడం కోసం, పరమానందం పొందడం కోసమే. అంటే వారి జీవిత లక్ష్యం పరమానందం పొందడమే.

కొంచెం ఆలోచించండి. పరమ దుఃఖాన్ని మిగిల్చే వాటికోసం ప్రయత్నించేవారు గొప్పవారా? పరమానందాన్ని పొందడం కోసం ప్రయత్నించేవారు గొప్పవారా? పరమానందం అంటే పరలోక ఆనందం అంటే భగవంతుని లోకంలో వుండే ఆనందం పొందాలనుకునేవాడు ఇహలోక సుఖాల మీద మమకారం వదలాలి. ఎవరైనా సరే, ఇహలోక సుఖాలమీద ఏ మాత్రం మమకారం ఉన్నా పరలోక పరమానందాన్ని పొందలేరు. అందుకే యోగులు ఇహలోక సుఖాలు, భోగాలు తృణప్రాయంగా భావించారు. తుచ్ఛమైనవిగా చూశారు. వాటిమీద పూర్తిగా మమకారం వదిలారు.

భోగులు అంటే ఇహలోక సుఖాలు కోరుకునేవారు. యోగులను చూసి పిచ్చివాళ్ళు అని కూడా అనుకుంటారు. కాని నిజమైన పిచ్చివాళ్ళు భోగులే కాని యోగులు కారు. ఇక్కడ ఇద్దరూ ఆనందం కోసమే ప్రయత్నిస్తున్నారు. కాని ఒకరు దుఃఖాన్ని పొందుతున్నారు. మరొకరు కోరుకున్న పరమానందాన్ని పొందుతున్నారు.

ఇక్కడ ప్రతీ ఒక్కరు గమనించవలసింది ఏమిటంటే శాశ్వతాన్ని కావాలనుకునేవారు తాత్కాలికాన్ని వదిలిపెట్టాలి. తాత్కాలికాన్ని వదిలిపెట్టకుండా, శాశ్వతం ఎప్పటికి లభించదు. అందుచేత ఎవరయితే భూలోక సుఖాలమీద మమకారం వదలరో వారికి పరమానందం లభించదు.

ఢిల్లీ వెళ్ళాలంటే విజయవాడ వదలాలికదా? విజయవాడ వదలకుండా ఢిల్లీ ఎప్పటికీ చేరలేం కదా?. అంతేకాదు విజయవాడ వదలాలంటే విజయవాడ మీద పూర్తిగా మమకారం వదలాలి. విజయవాడ మీద ఏ మాత్రం మమకారం వున్నా తిరిగి మరల రావాలనిపిస్తుంది. అసలు వదలలేరు కూడా.

మరి యోగులులా పరమదుఃఖాలనుంచి బయటపడి పరమ సుఖం, పరమ శాంతి, పరమానందం పొందాలంటే వారిలాగే ధ్యాన సాధన చెయ్యాలి. ధ్యానం ఒక్కటే పరమానందాన్ని ఇవ్వగలిగేది.

# "ముక్తి కావాలంటే !"

చాలా మంది జీవితంలో కలిగే బాధలకు, కష్టాలకు, రోగాలకు, సమస్యలకు దుఃఖపడుతూ వుంటారు. ఈ బాధలు ఎప్పుడు పోతాయా! ఈ కష్టాలు ఎప్పడు తీరతాయా? అని ఆవేదన చెందుతూ వుంటారు. అసలు ఈ కష్టాలు లేకుండా వుంటే బాగుండును అనుకుంటారు. ఇంకా వారు ఇటువంటి దుఃఖాల నుంచి పూర్తిగా బయటపడలేనా? అసలు వీటి నుంచి విముక్తి లేదా? నా బ్రతుకు ఇంతేనా? నాకు ముక్తి లభించదా? అని వాపోతూ వుంటారు.

కానీ ఆలోచిస్తే ఎవరికైనా ముక్తి అన్నది సాధ్యమే. వారికున్న సమస్త దుఃఖాల నుండి శాశ్వతంగా బయటపడటం కూడా సాధ్యమే. కానీ, దాని కోసం కొంత కృషి చెయ్యాలి. ఆ దిశగా ఆలోచించాలి.

ఎవరైతే భగవంతుడు చెప్పిన ధర్మాల్ని ఆచరిస్తారో! ఆయన చెప్పిన మార్గంలో పయనిస్తారో! వారు ఎన్నో జన్మలు ఎత్తనవసరం లేదు. ఈ జన్మలోనే ముక్తి పొందగలరు.

కానీ ప్రస్తుతం మానవులు ఎంతసేపూ తనకు నచ్చిన విధంగా వుంటూ, తన ఇష్టానుసారం ప్రవర్తిస్తూ, తనకు ఏది తోస్తే అది చేస్తూ, భౌతిక సుఖాలకు ప్రాముఖ్యం ఇచ్చి, ఎన్నో కోరికలు కోరుతూ, ఆ కోరికలు తీరితే చాలు అనుకుంటూ, ఎన్ని కోరికలు నెరవేరినా తృప్తి చెందక ఇంకా ఇంకా అంటూ, చూసినదాని కల్లా ఆశపడుతూ, వాటిని పొందటానికి ఎన్నో అడ్డమార్గాల ద్వారా చేయకూడని పనులు చేస్తున్నారు. అంతేకాదు అటువంటి పనులకు భగవంతుని సాయం అర్థిస్తూ, దాని కోసం ఆయనకు రకరకాల కానుకలు సమర్పిస్తున్నారు. ఏమి చేసినా అనుకున్నది సాధించలేక పోతున్నారు. అయినా సరే ప్రయత్నం మటుకు మానడం లేదు. తన ఆలోచనా విధానం మార్చుకోవటం లేదు. తాను చేసేదే కరక్టు అని అనుకుంటున్నారు. ఎంతసేపూ భగవంతుడు తన కోరికలు కష్టాలు తీర్చడానికే వున్నాడనుకుంటున్నారు.

అలా మానవులు ఎంతసేపూ తమకు నచ్చినట్లు చేస్తున్నారే కానీ, తాము చేసేది. భగవంతుడు మెచ్చుతున్నాడా? లేదా? అని ఆలోచించడం లేదు. కానీ భగవంతుడు మాత్రం ఆయన చెప్పిన మార్గంలో పయనిస్తేనే మెచ్చుకుంటాడు. అందుచేత మానవులు ఆయన చెప్పినట్లు ఆచరించి సమస్త దుఃఖాల నుండి శాశ్వతంగా బయట పడాలి. ముక్తి పొందాలి.

మరి చాలా మందికి అనిపించవచ్చు భగవంతుడు మనకు కనపడడు కదా? ఆయన చెప్పేవి మనకెలా తెలుస్తాయి? ఆయన చెప్పినట్లు నడుచుకోవటం మాకెలా సాధ్యం? ఆయన చెప్పేవి మేమెలా తెలుసుకోగలం? అని అనవచ్చు. కానీ అది కూడా సాధ్యమే.

మానవులు ముక్తి పొందటానికి భగవంతుడు ఎన్నో మార్గాలు చూపించాడు. ఇంకా చూపిస్తూనే వున్నాడు. ఆయన అనేక రూపాలలో భూమి మీద అవతరించాడు. మానవుడు ఎలా ప్రవర్తించాలో తెలియ చేశాడు. వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, బైబిలు, ఖురాన్ ఇంకా అనేక పవిత్ర గ్రంధాల ద్వారా కూడా బోధించడం జరిగింది.

అంతే కాదు మానవుడి జీవితంలో జరిగే అనేక సంఘటనలు ద్వారా, ప్రకృతిలోని అనేక జీవుల ద్వారా, ప్రకృతి ద్వారా, ఇలా ఎన్నో రకాలుగా సందేశాలు ఇవ్వబడుతున్నాయి. ఇంకా కలల ద్వారా, అనేక మంది ఉపన్యాసాల ద్వారా కూడా మానవులకు ముక్తి మార్గం బోధించబడుతుంది. కానీ మానవులు ఇవేమీ పట్టించు కోవడం లేదు. ఎంతసేపూ తన గోలే! తన సుఖమే! తన కోరికలే!

అయినా కూడా భగవంతుడు మానవులకు సాయం చెయ్యడం మానలేదు. భగవంతుడు ప్రతీ ఒక్కరూ ముక్తి పొందటానికి అంతరాత్మ రూపంలో ప్రతి క్షణం, ప్రతీ సందర్భంలో ఆచరించవలసిన ధర్మాలు బోధిస్తున్నాడు.

అలా ఆయన మానవులు ఎలా ఆలోచించాలి? ఎలా మాట్లాడాలి? ఎలా ప్రవర్తించాలి? అని ప్రతీ విషయంలో మానవులకు సహాయం అందిస్తున్నాడు. అలా మానవులకు వారు ఆచరించవలసిన ధర్మాన్ని బోధిస్తున్నాడు. ఎవరైతే అంతరాత్మ అంటే భగవంతుడు చెప్పే ధర్మాల్ని తూ.చ. తప్పకుండా పాటిస్తారో వారి జీవితం ధన్యమైనట్టే. అలా ఆచరించి నడిచిన వారు తప్పకుండా ఈ జన్మలోనే ముక్తి పొందగలరు.

కానీ మానవులు అంతరాత్మ అంటే భగవంతుడు చెప్పిన ధర్మాన్ని పాటించలేకపోతున్నారు. మనస్సనే మాయలో పడి అంతరాత్మ చెప్పిన ధర్మాల్ని విస్మరిస్తున్నారు. దుఃఖంలో మునిగిపోతున్నారు

కానీ ధ్యానం చేస్తే మనస్సు యొక్క ప్రాముఖ్యం తగ్గించుకోవచ్చు. అంతరాత్మ చెప్పిన ధర్మాల్ని ఆచరించగలుగుతాం. ముక్తిని పొందుతాం. అందుచేత ముక్తి కావాలంటే ధ్యానం చెయ్యవలసిందే.

# "జీవితాన్ని వృధా చేయకూడదు!"

భగవంతుడు మానవులకు అతి విలువైన, అపురూపమైన, అత్యద్భుతమైన జన్మను ఇచ్చాడు. కానీ మానవులు మానవ దేహం యొక్క విలువ తెలియక జీవితాన్ని ఎంతో వృధా చేసుకుంటున్నారు. ప్రాముఖ్యం లేనివాటిని ఆదా చేస్తున్నారు. ప్రాముఖ్యమైనవి వృధా చేస్తున్నారు. ఎంతో నష్టపోతున్నారు. అలా చేస్తూ కూడా తెలివైన వారిమని భావిస్తున్నారు. కాని కొంచెం ఆలోచిస్తే విలువైన తమ జీవితాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవచ్చు.

ఎవరైనా ఇడ్లీలు కాని, పిండి వంటలు కాని తినగా మిగిలితే వాటిని బయట పడవేయరు. ఇతరులకో, పనివారికో ఇస్తారు. కారణం వృధా కాకూడదని అలా చేస్తూ పొదుపు చేశామనుకుంటారు.

ఇంకా గమనిస్తే సబ్బు బిళ్ళ అరిగిపోతే ఇంకో సబ్బుకు అతికిస్తారు. కారణం పొదుపు అంటారు. పేస్టు అయిపోతే నేలమీద వేసి తొక్కుతారు. కారణం పొదుపు. బయటకు వెళ్ళేటపుడు లైట్లు, ఫ్యాన్లు ఆర్పివేస్తారు. కారణం పొదుపు పాటిస్తున్నామనుకుంటారు.

ఎంతో తెలివి వున్న మానవులు ఇలాంటి అల్ప, విలువలేని విషయాలలో పొదుపు పాటిస్తున్నారు కానీ విలువ కట్టలేని వాటిని వృధా చేస్తున్నారు.

ఆలోచించండి సబ్బు ముక్క విలువైనదా? సమయం విలువైనదా? ఇడ్లీలు విలువైనవా జీవితం విలువైనదా? పేస్టు విలువైనదా? పంచేంద్రియాలు విలువైనవా? కొద్దిపాటి కరెంటు విలువైనదా? మన శక్తి విలువైనదా? ఆలోచిస్తే మనం పొదుపు చేసే వాటి కంటే భగవంతుడు మనకు ఇచ్చిన సమయం, శక్తి, ఇంద్రియాలు, ఆఖరుకు మన జీవితం అన్నీ కూడా మన వూహకు అందనంత గొప్పవి, విలువైనవి.

సబ్బుముక్క వృధా అవుతుందని బాధపడుతున్నాం. సమయం వృధా అవుతుందని ఎప్పుడైనా బాధపడ్డామా?

అల్పమైనవి వృధా అవుతున్నందుకు బాధపడుతున్నాం. వాటిని

ఆదా చెయ్యటానికి నానా తిప్పలు పడుతున్నాం. కానీ విలువ కట్టలేని వాటిని ఎంతో వృధా చేస్తున్నాం. కనీసం బాధకూడా పడటం లేదు. మరి మనం నిజంగా తెలివైనవారమా? ఆలోచించండి.

మరి మనకు ఇవ్వబడిన విలువైన వాటిని మనం మన కోసమైనా ఉపయోగించుకోవాలి లేదా సమాజానికి, సమాజ శ్రేయస్సుకు ఉపయోగించాలి. అంతే కాని ఇవ్వబడినది వృధా చేస్తే కోల్పోవలసి వస్తుందని తెలుసుకోవాలి. అందుచేత దేనిని వృధా చెయ్యకూడదు. ముఖ్యంగా “జీవితాన్ని వృధా చెయ్యకూడదు”.

అందుచేత మాటలను గమనించాలి. ఆలోచనలను గమనించాలి. పనులను గమనించాలి. ఏమైనా వృధా అవుతుంటే సద్వినియోగం చెయ్యాలి. మరి ఇవన్నీ గమనించే శక్తి కావాలన్నా, జీవితాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నా ధ్యానం చెయ్యాలి. ధ్యానం చేస్తే జీవితాన్ని వృధా చెయ్యం. పూర్తిగా సద్వినియోగం చేసుకోగలుగుతాం. జీవిత లక్ష్యాన్ని సాధిస్తాం.

**భోగంతో, రోగంతో ఈ దేహం నుంచి**
**నిష్క్రమించకూడదు. యోగంతో నిష్క్రమించాలి.**
**అలా చేస్తే మరల జీవితం రాదు.**

**తెలుసుకోండి**

**ఎదుట వారి నుండి ఏది ఆశిస్తున్నామో**
**మనం కూడా ఇతరుల పట్ల అదే విధంగా ప్రవర్తిస్తున్నామా?**
**లేదా? అని ఆలోచించాలి.**

# "పుట్టిన క్షణం నుంచే మరణం ప్రారంభమవుతుంది!"

మనం కొంచెం ఆలోచిస్తే జీవితం గురించి కొన్ని విషయాలు అర్థం అవుతాయి. చాలా మంది ప్రతి పుట్టిన రోజు ఒక పండుగలా వేడుకగా చేసుకుంటారు. ఆలోచించండి పండుగ కాని, వేడుక కానీ, ఏదైనా సంతోషించవలసిన విషయమైనప్పడు, లాభించి నపుడు మాత్రమే చేసుకుంటారు. ఆలోచిస్తే పుట్టిన రోజు అంటే మన జీవితంలో ఒక సం॥రం కోల్పోయామని అర్థం. మన ఆయుష్షు ఒక సం॥రం తగ్గిందని అర్థం. అంటే మరణానికి ఒక సం॥రం దగ్గరయ్యామని అర్థం. అంటే జీవితాన్ని నష్టపోతున్నట్టేగా.

ఎవరైనా మరణిస్తే వారి బంధువులు, స్నేహితులు అంతులేని దుఃఖాన్ని పొందుతారు. మరి మరణానికి దగ్గరవుతున్నప్పడు లాభం పొందుతున్నట్టా? నష్టపోతున్నట్టా? ఎందుకు వినోదం? ఎవరైనా లాభం పొందినపుడు ఆనందిస్తారు, పండుగ చేసుకుంటారు. కాని నష్టపోయినపుడు, చావుకు దగ్గరవుతున్నప్పడు పండుగ చేసుకుంటారా? పుట్టిన రోజు అంటే జీవితాన్ని నష్టపోవటమే కాని వేరొకటి కాదు.

అలాగే కొంతమంది 'మ్యారేజ్ డే' అని ప్రతి సం॥రం సంతోషంగా పండుగ చేసుకుంటారు. ఇది కూడా అలాంటిదే. ఇద్దరూ పెళ్ళి చేసుకుని దగ్గరయినప్పటి నుండి ప్రతీ రోజూ వారి జీవితాలు దూరమవుతున్నాయి. అలాగే ప్రతీ సం॥రం వారి యిరువురి మధ్య దూరం పెరుగుతుంది. శాశ్వతంగా దూరమయ్యే రోజు దగ్గరకు వస్తుంది అని గుర్తించలేకపోతున్నారు. మరి దూరమయ్యే రోజు దగ్గర పడుతున్నప్పడు పండుగ ఎలా చేసుకుంటాం?

ఇలా మనం ప్రతీక్షణం విలువైన కాలాన్ని, జీవితాన్ని ఎలా కోల్పోతున్నామో గమనించలేక పోతున్నాం. మానవుడు ప్రతి దినం తాను చనిపోతున్నానని అనుకోడు. అసలు ప్రతీ దినమే కాదు, ప్రతీ క్షణం అతడు క్షీణిస్తూనే వున్నాడు. కానీ తాను శాశ్వతంగా ఉంటానని భావిస్తాడు. నిజానికి "పుట్టిన క్షణం నుంచీ మరణం ప్రారంభమవుతుందని" తెలుసుకోవాలి. మానవుడు ప్రతి దినం, ప్రతీ క్షణం చనిపోతూనే వున్నాడని అర్థం చేసుకోవాలి. అసలు మరణం ఎప్పడు వస్తుందో కూడా తెలియదు.

ఈ విషయాన్ని అర్థం చేసుకుని యోగులంతా అవకాశం దొరికిన ప్రతి నిమిషం ధ్యాన సాధనకు ఉపయోగించారు. జీవితాన్ని ధన్యం చేసుకున్నారు. అలాగే మనం కూడా మన సమయాన్ని, జీవితాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ధ్యానం చెయ్యాలి.

# "ఋణ విముక్తులు కావాలి!"

చూడండి ఎవరి దగ్గరైనా మనం ఏదైనా తీసుకుంటే వారికి మనం ఋణపడివున్నట్టే కదా? వారికి తిరిగి చెల్లించాలి కదా? అది ధర్మమే కదా? అలాగే భగవంతుని సృష్టినుండి మనం ఎన్నో పొందుతున్నాం. ఎన్నో అనుభవిస్తున్నాం. అలా ఆయనకు మనం ఎంతో ఋణపడివున్నాం. ఎందుకంటే పుచ్చుకున్నవాడు ఋణపడతాడు, కాని ఇచ్చిన వాడు ఎలా ఋణపడతాడు?

ఋణగ్రస్తుడు ఋణం తీరకపోతే ఎన్నో బాధలు పడవలసివస్తుంది. అంతే కాదు నిత్యం అశాంతికి లోనై వుంటాడు. అందుచేత ఎవరికైనా ఋణం తీరితేనే ఆనందం. అలాగే భగవంతుని సృష్టి నుంచి ఎన్నో పొందుతూ ఆయనకు మనం ఋణపడి వున్నాం. ఆయనకు బాకీపడ్డాం అని తెలుసుకోలేకపోతున్నాం.

మనం నిత్యం ఆయన ఇచ్చిన నీరు త్రాగుతున్నాం. గాలి పీలుస్తున్నాం. ఆయన ఇచ్చిన వెలుతురు, వేడి అనుభవిస్తున్నాం. సుందరమైన ప్రకృతి దృశ్యాలు వీక్షిస్తున్నాం. ఇంకా ఎన్నో ఆనందాలు అనుభవిస్తున్నాం. ఒక సినిమా చూడాలంటేనే టిక్కెట్టుకు డబ్బులు ఇస్తున్నాం కదా? మరి ఇన్ని ప్రకృతి అందాలు చూస్తూ భగవంతునికి ఏమి ఇస్తున్నాం?అంతేకాదు ఒకబాటిల్ నీరుకి రూ.10/-లు సమర్పించుకుంటున్నాం. రాత్రి కాంతి కావాలంటే ఎంత కరెంటు బిల్లు చెల్లిస్తున్నాం. అలా ఆలోచిస్తూ పోతే మనం ఎన్నో రకాలుగా భగవంతుని నుంచి లాభం పొందుతున్నాం. అసలు ఆయనకు ఏమి ఇస్తున్నాం?

అలా మన ఋణం పెరుగుతూనే వుంది కాని తగ్గటం లేదు. మన ఋణం పెరిగే కొద్దీ మన జన్మలు పెరుగుతూనే వుంటాయి. దుఃఖం పెరుగుతూనే వుంటుంది. మరి దుఃఖం పోవాలంటే ఋణం తీర్చాలి. ఋణం తీరాలి అంటే తీసుకున్నది ఇస్తేనే కదా తీరుతుంది. కాని మనం అప్పు తీర్చకుండా రోజూ ప్రార్థనలు చేస్తున్నాం కోరుతున్నాం. ఇంకా ఇవ్వమంటున్నాం. అంటే ఉన్న అప్పు చాలనట్టు ఇంకా అప్పు పెంచుకోవటానికి ప్రయత్నిస్తున్నాం. అప్పు పెంచుకోవడం కాదు తీర్చాలి. ఋణ విముక్తులు కావాలి. అందుచేత భగవంతునికి ఇవ్వాలి. మనవి ఇవ్వాలి. మనవి ఇచ్చినపుడే అది సాధ్యం. మరి భగవంతునికి ఎలా ఇవ్వగలం? కాని భగవంతునికి కూడా ఇవ్వగలం. ఎలా అంటే లోకానికి

ఇస్తే అది భగవంతునికి ఇచ్చినట్టే. కారణం లోకమే భగవంతుడు కనుక.

లోకానికి ఏమి ఇవ్వగలం? లోకానికి ప్రేమను ఇవ్వగలం, ఆనందాన్ని ఇవ్వగలం. శాంతిని ఇవ్వగలం. అలా లోకానికి ఎన్నో మంచి పనులు చెయ్యడం ద్వారా భగవంతుని ఋణం తీర్చుకోగలం. లోకానికి ఎంత ఇస్తే భగవంతుని ఋణం అంత తీరుతుంది. అలా ఎన్నో జన్మలనుండి భగవంతుని నుంచి పొందుతూ ఋణపడ్డాం. బంధంలో చిక్కుకున్నాం. కాని ఋణం తీరితే బంధ విముక్తులవుతాం. మోక్షాన్ని పొందుతాం. అందుచేత భగవంతుని నుంచి పొందడం కాదు ఇవ్వాలి. ఇచ్చేవాడే గొప్పవాడు. లోకానికిచ్చిందే భగవంతునికి ఇచ్చినట్లవుతుంది.

మహాత్ములంతా లోకానికి ఎంతో సేవ చేసారు. లోకానికి ఎంతో ఇచ్చారు. వారు ఎంతసేపూ తీసుకునేవారు కాదు ఇచ్చేవారు. వారు "తీసుకోవటానికి బ్రతకలేదు, ఇవ్వటానికి జీవించారు". తమ స్వార్థం వదలి మరీ ఇచ్చారు. ఇవ్వగలిగే అవకాశం కలిగినందుకు భగవంతునికి కృతజ్ఞతలు చెప్పకునేవారు. చివరికి వారు ధన్యులయ్యారు. దివ్యులయ్యారు. దేవుళ్ళయ్యారు. అందుచేత ఇచ్చేవాడే గొప్పవాడని తెలుసుకోవాలి.

"పూజ అంటే ఇవ్వడం కాదు. సేవ అంటేనే ఇవ్వడం". అందుచేత సేవ ద్వారానే భగవంతుని ఆనందింప చేయగలం. ఋణం తీర్చుకోగలం. మరి లోకానికి సేవ చేసే శక్తి రావాలంటే ఒక్క ధ్యానం వల్లనే సాధ్యం. అందుకే ధ్యానం చేసే యోగులంతా లోకానికి ఎంతో మేలు చేశారు. అందుచేత ధ్యానం చేసి ఋణవిముక్తులవుదాం, బంధం నుంచి విముక్తులవుదాం, ముక్తిని పొందుదాం.

## తెలుసుకోండి

**ఏ పురాణం చూసినా మాంసాహారులైన**

**రాక్షసులు సంహరింపబడ్డారు.**

**రాక్షస సంహారం చేసినవారంతా దేవుళ్ళయ్యారు.**

# "అవసరమైనవే చెయ్యాలి!"

మన నిజ జీవితంలో ప్రతీరోజు ఎన్నో పనులు చేస్తున్నాం. అలా ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి నిద్రించే వరకు ఏదో ఒకటి చెయ్యాలి కాబట్టి ఏదో ఒకటి చేస్తున్నాం. కానీ ఏ పని చెయ్యాలి? ఏ పని చెయ్యకూడదు? అన్న అవగాహన చాలా మందికి లేదు. అలా ఎవరికి వారు, వారి మనస్సుకు తోచిన, మనస్సుకు నచ్చిన పనులు చేస్తున్నారు. అలా చేస్తూ అంతా సవ్యంగా చేస్తున్నాం. అన్నీ సవ్యంగా చేస్తున్నాం అని అనుకుంటున్నారు.

కొంచెం గమనించండి. చాలా మంది ఎక్కువగా టి.వి.లు చూస్తూ కబుర్లు చెపుతూ ఎంతో సమయాన్ని వృధా చేస్తున్నారు. ఇంకా కొంతమంది ఆరోగ్య నియమాలని, అందంగా కనబడాలని ప్రయత్నిస్తూ చాలా సమయాన్ని, శక్తిని, డబ్బునూ వృధా చేస్తున్నారు. కొంత మంది లావు తగ్గటం కోసం, కొంతమంది లావుగా తయారవటం కోసం, కొంతమంది జుట్టును సరిచేసుకుంటూ, రంగులు వేసుకుంటూ, దుస్తులు, వస్తువులు అలంకరించుకుంటూ సమయాన్ని వృధా చేస్తున్నారు. అలాగే ఫంక్షన్స్, పార్టీలంటూ, వినోద కాలక్షేపం చేస్తూ ఎంతో సమయాన్ని వృధా చేస్తున్నారు. పనికిరానివి ఆలోచిస్తూ వృధా చేస్తున్నారు. అలా రాజకీయాలంటూ, శాశ్వతం కాని పదవుల కోసం, తాత్కాలికమైన పేరు కోసం సమాజ సేవ అంటూ ఎంతో సమయాన్ని వృధా చేస్తున్నారు.

కానీ ఇలా వ్యర్థం చేసే సమయంలో నిజ జీవితానికి అవసరమైనవి, మనకు ఉపయోగపడే పనులు ఎన్నో చేసుకోవచ్చు. అంతేకాదు ఆ సమయంలో ఇంకా మన గురించి ఆలోచించుకున్నట్లయితే మనలోని లోపాలు గుర్తించగలుగుతాం. ఇంకా మన జీవితంలో దుఃఖం ఎందుకు కలుగుతుంది? కష్టాలు ఎందుకు వస్తున్నాయి? దీర్ఘకాలిక రోగాల బారిన ఎందుకు పడుతున్నాం? జీవితంలో శాంతి ఎందుకు లేకుండా పోయింది? అన్న వాటికి కారణాలు తెలుస్తాయి. కారణం తెలియగానే, వాటిని నివారించుకోగలుగుతాం. జీవితంలో దుఃఖం లేకుండా చేసుకోగలుగుతాం. అలా జీవితాన్ని ఆరోగ్యంగా, ఆనందంగా

చేసుకోగలుగుతాం.

కానీ ఆ వ్యర్థం చేసే సమయంలో అవసరమైన పనులు, మనకు లాభించే పనులు, మన ఉన్నతికి తోడ్పడే పనులు చేస్తే, జీవితం సద్వినియోగం అవుతుంది. అందుచేత ప్రతీరోజు మనం చేసే పనులలో ఏ పనులు వ్యర్థమైనవో? గమనించాలి. ఏఏ పనులు మన జీవితానికి, మనకు అవసరం లేదో గుర్తించాలి. అలా రోజువారీ పనులను బేరీజు వేసుకోవాలి. అవసరం లేని పనులన్నీ మానేస్తే మన సమయం ఎంతో ఆదా అవుతుంది. శక్తి మిగులుతుంది. ధనం ఆదా అవుతుంది. ఆ సమయాన్ని అవసరమైన వాటికి వినియోగించవచ్చు.

అలా ఆలోచించిన రోజున మన జీవితంలో మనకు అవసరమైన పనులే చేస్తాం. అవసరమైనంత వరకే మాట్లాడతాం, అవసరమైనవే ఆలోచిస్తాం. సరైన మార్గంలో పయనిస్తాం. అలా అన్నీ అవసరమైనవే చేయడం వల్ల జీవితం వ్యర్థం కాదు. ఏ కారణం కోసమైతే ఈ జన్మ తీసుకున్నామో అది సాధిస్తాం. జన్మ సార్థకమవుతుంది.

మనకు అవసరం కానివి కూడా అవసరమైనట్టుగా భ్రమ కల్పిస్తున్నది మన మనస్సు. మనస్సనే మాయ నుండి బయటపడాలంటే ఒక్కటే మార్గం అదే ధ్యానం. ధ్యానం చేస్తే అవసరమైనవే చేస్తాం.

## తెలుసుకోండి

**శ్రీరాముని వెనకాల శాకాహారులైన వానరులు నిలిచారు. ధన్యులయ్యారు.**

**రావణాసురుని వెనకాల మాంసాహారులైన రాక్షసులు నిలిచారు, నాశనమయ్యారు**

## ధ్యాన సత్యం

**ధ్యానం ద్వారా స్వాధీనమయిన మనస్సు మనలను సుఖ పెడుతుంది. స్వాధీనంలో లేని మనస్సు దుఃఖాన్నిస్తుంది.**

# "కర్తృత్వ భావం లేకుండా చెయ్యాలి!"

సహజంగా భగవంతుడే అన్నిటికీ కర్త. అలాగే చేసేది ఆయనే. చేయించేది ఆయనే అని మనం అంటూ వుంటాం. కానీ లాభం వచ్చినపుడు, ఏదైనా గొప్పది సాధించినపుడు నేనే అని చెప్పకుంటాం. గర్విస్తాం. కానీ మన జీవితంలో కష్టం, నష్టం వచ్చినపుడు మాత్రం భగవంతుడు దయతలచలేదని చింతిస్తూ వుంటాం.

ఏదైనా మంచి చెయ్యమంటే అంతా ఆ భగవంతుడే చేయిస్తున్నాడు. ఆ పని చెయ్యటానికి ఆయన అనుగ్రహం ఎప్పడు కలుగుతుందో, ఆ టైమ్ రావాలి కదా? ఆయన అనుగ్రహం వుంటే తప్పకుండా చేస్తాను. నా చేత ఆయన ఎప్పడు  చేయించుకుంటాడో? ఆయన అనుగ్రహం  ఇంకా కలగలేదు.  ప్రస్తుతం నన్ను వదిలేయ్ అని అంటాం. కాని పాపాలు మటుకు మామూలుగా చేసేస్తాం. దానికి మాత్రం. ఆయన అనుగ్రహం కోసం చూడం.

మంచి చెయ్యటానికి అలా అంటాం. కానీ మన జీవితంలో ప్రతీది నేనే అనే భావంతో చేస్తున్నాం. నేనే డబ్బు సంపాదించాను. నేనే పదవి సంపాదించాను. నేనే మంచి పేరు పొందాను. నేనే అందరికీ ఉపకారం చేస్తున్నాను. నేనే అందరికీ సేవ చేస్తున్నాను. నేను ఈ విజయాలు సాధించాను. అన్నీ నేనే చేస్తున్నాను అని అంటాం, భావిస్తూంటాం. అలా నేను అని భావించడమే అహంకారం.

అంతేకాకుండా ఈ ఇల్లు నాది, ఈ కారు నాది, ఈ భోగభాగ్యాలు నావి. ఈ భార్య నాది, నా కొడుకు, నా కూతురు, నా సంపద అంటూ వాటి మీద అపరిమితమైన మమకారం ప్రదర్శిస్తూ వుంటాం.

పైకి అనడం మటుకు అంతా భగవంతుడే అన్నీ భగవంతుడే అంటాం. కానీ అంతా నాదే, అన్నీ నావే అని మమకారం ప్రదర్శిస్తున్నాం.

ఇలా మనం ఎంతకాలమైతే నేను అనే అహంకారం ప్రదర్శిస్తామో! నాది అనే మమకారం చూపిస్తామో! మనకి ఈ భూమి మీద జీవితం తప్పదు. చావు పుట్టుకలు తప్పవు. బాధలు, కష్టాలు, రోగాలు, సమస్యలు,

దుఃఖం తప్పదు.

అందుచేత  అంతా భగవంతుడే. అన్నీ భగవంతుడే అని అంటే సరిపోదు. ఆ రకమైన భావం వుండాలి. ఆచరణ వుండాలి. ఆచరణలో అహంకార, మమకారాలు లేకుండా జీవించాలి. అలా జీవించినపుడే అంతా భగవంతుడని ఆచరణలో చూపిస్తున్నవారవుతాం. అలాంటి వారికి ఏ కర్మా అంటదు. అకర్ముడై ముక్తిని పొందుతాం. కర్మలు చేస్తున్నా చెయ్యని వారమవుతాం. శ్రీ కృష్ణ పరమాత్మ చెప్పినట్లు "కతృత్వ భావం లేకుండా కర్మలు చేసిన వారమవుతాం".

మరి ఈ స్థితి కలగాలంటే ధ్యానం ఒక్కటే మార్గం. ధ్యానం చేసినపుడే 'నేను' అనే భావం పోతుంది. నాది అనే మమకారం పోతుంది. అన్ని భగవంతుడే అన్న స్థితి వస్తుంది.

## తెలుసుకోండి

**నీవు ఎంతకాలం జీవించావు? అని కాదు.**
**ఎలా జీవించావు?  అన్నది ముఖ్యం.**

**మతమంటే బొట్లు వుంచుకోవటం కాదు. బొట్టు తీసి వేయటం కాదు, బురఖా కప్ప కోవటం కాదు, సత్ చరిత్ర, సద్భావము, సచ్ఛీలము కలిగి ఉండటమే మతము.**

**నోరు దాటిన మాటకు నీవు బానిసవు**
**నోటిలోని మాటకు నీవు యజమాని**

# దేనిమీద శ్రద్ధ చూపించాలి?

సహజంగా ఎవరిని చూసినా ఎంత సేపూ దేహ అందం, దేహ సుఖం మీదే శ్రద్ధ చూపిస్తూ వుంటారు. వాటికి ప్రాముఖ్యం ఇస్తూ వుంటారు. ఎంత శ్రద్ధ చూపిస్తారంటే ఇంచుమించు జీవితమంతా దానికే వెచ్చిస్తారు. అంతేకాదు ఇంకా గమనిస్తే లేచినప్పటినుండి నిద్రపోయేవరకు అందంగా వుండటానికి, బాగా కనబడటానికి, సుఖంగా బ్రతకటానికి చేసే ప్రయత్నం శ్రద్ధ ఆశ్చర్యం కలిగిస్తాయి.

అలా ఒక్క జుట్టు గురించి తీసుకునే శ్రద్ధ గురించి ఆలోచిస్తే మనం ప్రతిరోజు జుట్టకు నూనె రాస్తాం, దువ్వుకుంటాం, ఒక్కొక్కపుడు రోజులో నాలుగైదుసార్లు దువ్వుకుంటాం, జుట్టు గురించి శ్రద్ద తీసుకుంటాం ఆడవారైతే రకరకాల కేశాలం కారాలు చేస్తారు. జడలలో రకాలు, ముడులలో రకాలు, వేసుకుంటూ జుట్టు మీద శ్రద్ధ చూపిస్తారు

అదే మగవారైతే రకరకాల క్రాపులు, రకరకాల స్టైల్స్‌లో చేయించు కుంటారు. ఇంకా తెల్లబడితే రంగులు వేసుకుంటారు. హెన్నా పెట్టుకుంటారు. అందం కోసం రంగులు వేసుకునే వారు కూడా వున్నారు. అంటే ఒక్క జుట్టు మీద ఎంత శ్రద్ధ చూపిస్తున్నామో గమనించవచ్చు.

మనం ఇంత శ్రద్ధ చూపిస్తున్నాం కాబట్టే జుట్టు గురించి ఫ్యాషన్ షోలు వచ్చాయి. తీసివేసిన జుట్టుకు విపరీతమైన గిరాకీ కూడా వచ్చింది. అంటే మనం జుట్టు మీద శ్రద్ధ చూపించటానికి మన సమయం ఎంత ఖర్చు చేస్తున్నాం? ఎంత డబ్బు ఖర్చు చేస్తున్నాం? ఎంత జీవితాన్ని వెచ్చిస్తున్నాం?

అలాగే ఒంటిని శుభ్రం చేసుకోవటానికి, శుభ్రంగా వుంచు కోవటానికి ఎంతో శ్రద్ధ తీసుకుంటాం. ఇంకా గోళ్ళు అందంగా వుండాలని వాటిమీద శ్రద్ధ చూపించేవారు కూడా వున్నారు. ఇంకా ట్రిమ్‌గా ఉండాలని, ఆకర్షణీయంగా కనబడాలని, శరీరం నాజుకుగా వుండాలని రకరకాల ఎక్సర్‌సైజులు చేస్తారు, వాకింగులు చేస్తారు. యోగాసనాలు వేస్తూ, పచ్చి కూరగాయలు తింటారు.

అలాగే తినే తిండి గురించి ఎంతో శ్రద్ధ తీసుకుంటాం. ఎన్ని రకాలు తినాలి. ఎంతో మధురమైనవి తినాలి. ఎన్నిసార్లు తినాలి అని చాలా శ్రద్ధ చూపిస్తాం. అలాగే వుండటానికి కూడా శ్రద్ధ చూపిస్తాం. మంచి ఇంటిలో వుండాలి. అందమైన ఇంటిలో వుండాలి. అన్ని సౌకర్యాలు వుండాలి. వాటి మీద ఎంతో శ్రద్ధ చూపిస్తున్నాం.

ఇంకా భార్యమీద, భర్తమీద, సంసారంమీద ఎంతో శ్రద్ధ చూపిస్తున్నాం. డబ్బు సంపాదన మీద శ్రద్ధ చూపిస్తున్నాం. ఇలా ఎన్నిటిమీదో శ్రద్ధ చూపిస్తున్నాం కాని అసలైన వాటిమీద శ్రద్ధ చూపించడం లేదు. అంటే వీటన్నిటి మీద శ్రద్ధ అవసరం లేదు అని కాదు. వీటి మీద అవసరానికి మించి చూపిస్తున్నాం. అవసరమైన వాటిని విస్మరిస్తున్నాం.

దేహంకంటే ముఖ్యం గుణాలు, మన గుణాల మీద శ్రద్ధ చూపించాలి. మంచి గుణాలకు ప్రాముఖ్యం ఇవ్వాలి. దేహం మీద శ్రద్ధ చూపిస్తే చూడటానికి బాగుంటుంది, కాని గుణాలమీద శ్రద్ధ చూపిస్తే జీవించటానికి బాగుంటుంది. అదే అసలైన జీవితం. నిజమైన జీవితం.

ఇంకా మన పనుల మీద శ్రద్ధ చూపించాలి, మన ఆలోచనల మీద శ్రద్ధ చూపించాలి. మన ప్రవర్తన, నడవడిక, జీవనవిధానం మీద శ్రద్ధ చూపించాలి. అంటే ప్రేమ, దయ, కరుణ, న్యాయం, ధర్మం, అహింస, నిస్వార్థం లాంటి గుణాలు సంపాదించటానికి శ్రద్ధ చూపించాలి. అలాగే మనలోని కోపం, స్వార్థం, కాఠిన్యం, హింస, గర్వం, అహంకారం లాంటి గుణాలు తొలగించుకోవటానికి శ్రద్ధ చూపించాలి.

అలాగే మన మాటల మీద శ్రద్ధ ఉండాలి. అంటే సత్యం పలకాలి, ఎవరినీ విమర్శించకూడదు, దూషించకూడదు, నిందించకూడదు, అవమానించకూడదు, బాధించకూడదు, ఎరుకతో మాట్లాడాలి.

అలా ఎవరయితే శ్రద్ధ చూపిస్తారో వారు ఆనందంగా జీవించగలుగుతారు. ధ్యానం చేస్తే అవసరమైన వాటి మీద ఎక్కువ శ్రద్ధ చూపిస్తాం. అందుచేత ముఖ్యంగా అన్నిటికంటే, ధ్యానసాదన మీద శ్రద్ధ చూపించాలని తెలుసుకోవాలి.

## తెలుసుకోండి

**జన్మంతా పూజించే బదులు, ప్రార్థించే బదులు**
**ధ్యానం చేస్తే జన్మే లేకుండా చేసుకోవచ్చు**

**ఇవ్వు, ఇవ్వు అని కోరకూడదు**
**ఇవ్వడం నేర్చుకోవాలి.**

# ఏ సంపదలు గొప్పవి?

సృష్టిలో రెండు రకాల సంపదలు ఉన్నాయి. వాటిలో ఒకటి విలువ కట్టగలిగినవి, మరొకటి విలువ కట్టలేనివి. గమనిస్తే విలువ కట్టగలిగిన సంపదలు మానవుడు సంపాదించుకునేవి. విలువ కట్టలేని సంపదలు మానవునకు ఇవ్వబడినవి.

గమనిస్తే మానవుడు కోరుకుని, ఆశించేవి, కృషిచేసి, కష్టపడి సంపాదించే సంపదలన్నీ ఎంతోకొంత విలువ కలిగి వుంటాయి. అంటే మేడలు, అపార్టుమెంట్లు, భూములు, కార్లు, వస్తువులు, బంగారు ఆభరణములు, విలువైన వస్త్రాలు, వస్తుసామాగ్రి అలా వేటికైనా ఇంత విలువ అని వుంటుంది.

మానవుడు అలాంటి విలువ కట్టగలిగిన అల్పమైనవి సంపాదించుకుంటూ సంబరపడుతున్నాడు. అవి పొందితే చాలనుకుంటు న్నాడు. వాటి కోసమే జీవితమంతా వెచ్చిస్తున్నాడు. చివరకు జీవితాన్ని వ్యర్థం చేసుకుంటున్నాడు. కొంచెం గమనిస్తే మానవుడు సంపాదించే సంపదలన్నీ కొన్నాళ్లకు నశించిపోతున్నాయి. అంటే అశాశ్వతమైనవని తెలుస్తుంది.

కాని మానవునకు ఇవ్వబడిన విలువ కట్టలేని సంపదల్లో, ముఖ్యమైనది సమయం. ఈ సంపద చాలా గొప్పది. ఎందుచేతనంటే కోట్లు పోయినా తిరిగి సంపాదించుకోవచ్చు. కాని గడిచిపోయిన కాలాన్ని అంటే సమయాన్ని మరల తీసుకురాలేము.

ఇంకా మానవునకు చూసే శక్తి , వినే శక్తి, మాట్లాడే శక్తి, బుద్ధి ఇలా ఎన్నో ఇవ్వబడ్డాయి. వీటన్నిటిని భౌతిక సంపదలతో పోల్చలేం.

భూమిమీద మానవుడు సంపాదించేవి ఎప్పుడైనా సంపా దించవచ్చు. లేక ఎవ్వరైనా ఇవ్వగలరు. కాని పుట్టు అంధులకు, బుద్ధి మాంద్యం, వున్నవారికి, వినికిడి లేనివారికి వాటిని ఎవ్వరూ ఇవ్వలేరు. అలాంటివారి జీవితం ఎన్ని వున్నా వృధాయే. అందుచేత మానవుడు సంపాదించే వాటికంటే మానవునకు ఇవ్వబడిన సంపదలు విలువ

కట్టలేనివని తెలుసుకోవచ్చు.

అలాంటి విలువ కట్టలేని సంపదలతో మనం అల్పమైనవి సంపాదించుకుంటున్నాం. మనం చేసేది ఎలా వుందంటే “ఎక్కువ విలువ ఇచ్చి తక్కువ విలువగలవి సంపాదించుకుంటున్నాం”. అంటే “బంగారు గాజు ఇచ్చి శనగపప్పు తీసుకున్నట్టుంది”.

ఆలోచిస్తే అటువంటి విలువకట్టలేని వాటితో, విలువ కట్టలేనివి సంపాదించుకోవచ్చు. సృష్టిలో అన్నిటికంటే విలువైనది భగవంతుడు ఆయనకంటే విలువైనది, గొప్పది, సృష్టిలో మరొకటి లేదు. ప్రయత్నిస్తే అటువంటి భగవంతునే పొందవచ్చు. అలా భగవంతుని పొందిన వారు సమస్తమూ పొందినట్టే. అందుచేత విలువ కట్టలేని వాటితో, విలువకట్టలేని భగవంతుని పొందాలి. అదే తెలివైనవారు చేసేది. యోగులు చేసింది కూడా అదే. అందుచేత యోగులులా మనం కూడా ధ్యానం చేద్దాం. భగవంతుని పొందుదాం. అంటే ఆత్మను పొందుదాం.

## ఆలోచించండి

**కష్టాలు వద్దు అంటారు కానీ**
**కష్టాలు వున్న ఈ జీవితం వద్దు అనరేం?**

**లోపల శుద్ధి చెయ్యాలి**
**బయట సేవ చెయ్యాలి**

# "బద్ధకమే బద్ధ శత్రువు!"

మనం జీవితంలో సుఖదుఃఖాలు, మానావ మానాలు, లాభనష్టాలు గెలుపు ఓటములు లాంటివి అనుభవించి, అనుభవించి చివరకు జీవితంలో ఆరోగ్యం, శాంతి, ఆనందం అన్నవి కోల్పోతున్నాం. వేరే దారి లేక ఆధ్యాత్మిక మార్గంలో ప్రవేశిస్తాం. అలా చివరకు అద్భుతమైన ధ్యాన సాధనలోకి వస్తాం. కానీ ఈ మార్గంలో ప్రవేశించిన తరువాత పొందే ఫలితాలు స్వల్పంగానే వుంటాయి. దీనికి కారణం సాధన చెయ్యడానికి బద్ధకించడమే.

ఎందుచేతనంటే మన ఆరోగ్యానికి, శాంతికి ఆనందానికి ఆధ్యాత్మిక వికాసానికి, అతి ముఖ్యమైన ఆత్మోన్నతికి, శాశ్వత దుఃఖ నివారణకు ముఖ్యమైన మార్గం 'ధ్యాన సాధన'. ఇది తెలిసినా కూడా మనం సాధన చెయ్యలేకపోతున్నాం. దీనికి కారణం బద్ధకమే. ఈ బద్దకం వల్ల మనం ఏమీ సాధించలేకపోతున్నాం. ప్రాపంచిక విషయాలలోనే కాదు ఆధ్యాత్మిక మార్గంలో కూడ బద్దకం ఒక పెద్ద అవరోధం. మనం ఎన్నో సాధించాల నుకుంటాం. ఎన్నెన్నో పొందాలనుకుంటాం. కానీ ఏమీ సాధించ లేకపోవటానికి కారణం బద్ధకమే.

అలా ఉదయం లేచిటప్పటి నుండి బద్దకం వల్ల మనం ఎంతో నష్టపోతున్నాం. ఉదయం లేవగానే ధ్యాన సాధన చేద్దామనుకుంటాం. కానీ బద్ధకంతో ప్రక్కమీదే దొర్లుతాం. ధ్యాన సాధన చెయ్యం. రేపు చేసుకోవచ్చులే అని బద్ధకించి సమయం వృథా చేసుకుంటాం.

అలాగే జీవితంలో ఎంతో ఖాళీ సమయం దొరుకుతుంది ఆ సమయంలో మనకి సహజంగా ఉండే ఎన్నో సమస్యలు పరిష్కరించు కోవచ్చు. ముఖ్యంగా ఆరోగ్య సమస్య, శాంతి లేకపోవటం, ఆనందం లేకపోవటం, భయం, వీటన్నిటికి మించి కోరికలు అంటే తృప్తి లేకపోవటం, పనికి రాని అలవాట్లు, చెడు గుణాలు ఇలా ఎన్నో సమస్యలతో మనం దుః ఖాన్ని పొందుతున్నాం. ఈ సమస్యలన్నింటిని బద్ధకం వల్ల పరిష్కరించుకోలేకపోతున్నాం.

అలా వ్యర్థం చేసే సమయాలలో బద్ధకించకుండా దివ్యమైన ధ్యాన సాధన చేసుకోవచ్చు. తద్వారా మన సమస్యలన్నీ పరిష్కరించుకోవచ్చు. ఇంకా ఖాళీ సమయం వుంటే ఆధ్యాత్మిక పుస్తకాలు చదవవచ్చు. సజ్జన సాంగత్యం చెయ్యవచ్చు. ఇతరులకు మేలు కలిగించే పనులు చేయవచ్చు. అంతే కానీ బద్ధకిస్తే భగవంతుడు ఇచ్చిన జీవితాన్ని వ్యర్థం చేసుకున్నవారవుతాం. అన్ని అవకాశాల్ని చేజార్చుకున్నవారవుతాం. అందుచేత బద్ధకించకూడదు. బద్ధకమే మన ప్రగతికి, ఉన్నతికి పెద్ద అవరోధం. అందుచేత బద్ధకించే గుణమే మనకు శత్రువు అని తెలుసుకోవాలి. అంటే "బద్ధకమే మన బద్ధ శత్రువు."

అందుచేత బద్ధకం వదలి ధ్యాన సాధన చెయ్యాలి. జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలి.

## తెలుసుకోండి

**ప్రపంచంలో ఎంతమంది సాధుపురుషులు, మహాత్ములు, సత్పురుషులు జన్మించారో, వాళ్ళు ఎన్ని కష్టాలను, దుఃఖాలను ఎదుర్కోవలసి వచ్చిందో నీకు తెలుసా?**

**కోటీశ్వరుడు రాత్రంతా పీడకలలతో నరకాన్ని అనుభవిస్తాడు. పేదవాడు రాత్రి కలలలో భోగాలు అనుభవిస్తాడు. ఇలా ఇద్దరూ సగ జీవితంలో సుఖాలు, సగ జీవితంలో దుఃఖాలు అనుభవిస్తున్నారు.**

# "ధర్మార్థ కామమోక్షాలు!"

మానవులు జీవితమంతా డబ్బు సంపాదనకే వినియోగిస్తున్నారు కాని తాను సంపాదించుకోవలసిన సంపదలు ఇంకా చాలా వున్నాయని తెలుసుకోవటం లేదు.

ధనం కంటే విలువైన ఆరోగ్య సంపద, శాంతి సంపద అన్నిటికంటే విలువైన ఆనందమనే సంపదలాంటి వాటి కోసం ప్రయత్నం చెయ్యడం లేదు. అందుచేత ప్రపంచంలో ఎక్కడ చూసినా ధన సంపద కనిపిస్తుంది కాని ఆరోగ్యం, శాంతి, ఆనందమనేవి కనిపించడంలేదు.

భూమిమీద మానవునకు ఎన్ని సంపదలు వున్నా అవి తాత్కాలికమైనవే కాని భూమి మీద మానవుడు సంపాదించగలిగే సంపద మరొకటి వుంది. అదే మోక్ష సంపద. ఇది పొందినవారి జీవితమే ధన్యం.

మోక్షాన్ని పొందిన వారి జీవితం వర్ణించలేనిది. ఎందుచేత నంటే అసలు దుఃఖం లేని, నిత్య ఆనందమయమైన జీవితమే మోక్షం. అలాంటి మోక్ష సంపద కోసం ఎవరూ ప్రయత్నించటం లేదు. ఎంతసేపూ అల్పమైన, తాత్కాలికమైన ధనం కోసమే పరుగులు పెడుతున్నారు.

అసలు మానవ జీవితమంటేనే కామము, అర్థము, ధర్మము, మోక్షము, అనే వాటితో కూడుకున్నది. వీటిలో ప్రధానమైనది మోక్షం. కాని మానవుడు కామానికి ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తున్నాడు. కామము అంటే సెక్సు ఒక్కటే కాదు. సెక్సు అన్నది కామంలో భాగం మాత్రమే. కామము అంటే కోరిక. మానవునికి గల పంచ జ్ఞానేంద్రియాలతో సుఖాల్ని అనుభవించాలనుకోవడమే కామం. నచ్చినవి చూడడం, చక్కటి సంగీతం వినడం. సుగంధమైనవి వాసన చూడడం. రుచికరమైనవి, మధురమైనవి తినడం. శారీరక సుఖాలు, వాంఛలు ఇవన్నీ కూడా కామం క్రిందకే వస్తాయి.

పై వాటిని ఎక్కువగా అనుభవించడం కోసం, కష్టపడి కృషి చేసి సంపాదించుకొనేదే అర్థం అంటారు. అంటే జీవితంలో కష్టపడినవాడికే అర్థం లభిస్తుంది. అందుకే 'కష్టేఫలి' అంటారు.

అలా లభించిన వాటితో తాను మాత్రమే అనుభవిస్తూంటే కామము అంటారు. కాని తనకు లభించిన దానిలో కొంత ఇతరులకు కూడా పంచితే దానిని ధర్మము అంటారు. మన దగ్గర ఏది వున్నా, ఏది లభించినా అందులో కొంత ఇతరులకు పంచాలి. అలా పంచిన ధర్మమే

పుణ్యం. అటువంటి పుణ్యం వల్లే మోక్ష సంపద మానవునకు లభిస్తుంది. అంటే భోగం లభిస్తుంది. ఇది శరీరానికి సంబంధించిన కామార్థ ధర్మ మోక్షాలు.

కాని ఆత్మకు సంబంధించిన పురుషార్థాలు అంటే కామార్థ ధర్మ మోక్షాలు కూడా వున్నాయి. ఇవి శాశ్వతమైనవి. ప్రతీ ఒక్కరూ కోరుకోవలసినవి, కృషి చెయ్యవలసినవి. ఆత్మ కామమే ధ్యానం. ధ్యాన సాధన ద్వారా సంపాదించే శక్తి, జ్ఞానమే అర్థం. ఈ జ్ఞానాన్ని అందరికీ పంచడమే పురుషార్థమైన ధర్మం.

మానవుడు జీవితంలో కామార్థాలతో తృప్తి చెందకూడదు. ధర్మంతో అన్నిటికంటే విలువైన శాశ్వత మోక్షాన్ని పొందటానికి ప్రయత్నించాలి. దానికి మించిన సంపద ఏదీ లేదు.

మోక్షాన్ని పొందటానికి కావలసిన సమయం, శక్తి, తెలివి ప్రతీ మానవునికి వున్నాయి. వాటితో కష్టపడి ధ్యాన సాధన చెయ్యాలి. జ్ఞానాన్ని సంపాదించుకోవాలి. తనకు తెలిసిన ధ్యానాన్ని, జ్ఞానాన్ని అందరికీ పంచుతూంటే దానిని ధర్మమంటారు. అలా ధ్యాన ప్రచారం చేసేవారు చతుర్విధ పురుషార్థాలలో కామార్థాలనే కాక, ధర్మాన్ని కూడా సాధించినవారవుతారు. చివరకు శాశ్వత మోక్షాన్ని పొందుతారు.

జీవితంలో ధర్మం చేయకుండా ఎవరూ మోక్షాన్ని పొందలేరు. ధర్మము వల్లనే మోక్ష సంపద సాధ్యం. అందుచేత అర్థం వల్ల కామం ధర్మం వల్ల మోక్షాన్ని పొందవచ్చని తెలుసుకోవాలి.

ప్రతీ ఒక్కరూ ప్రాపంచికమైన అల్పమైన, అశాశ్వతమైన దేహ సంబంధమైన కామార్థ ధర్మ మోక్షాల కోసం జీవితాన్నంతా వృధా చేస్తున్నారు కాని కొంత సమయం ఆత్మకు సంబంధించిన ధ్యాన సాధనకు, ధ్యాన ప్రచారానికి వినియోగించాలి. శాశ్వతమైన అద్భుతమైన పురుషార్థమైన మోక్షాన్ని పొందాలి. అదే కోరుకోవాలి.

**తెలుసుకోండి**

**అంతం లేని కోరికల్ని అదుపు చేసినవాడే**

**ఆనందంగా జీవించగలుగుతాడు**

# "అల్పభావం పోవాలి!"

సమాజంలో గమనిస్తే చాలా తక్కువమందే గొప్ప కార్యాలు చేస్తూంటారు, ఉన్నత శిఖరాలకు ఎదుగుతూంటారు. వారు సాధించే విజయాలు, చేసే పనులు అందరినీ ఆశ్చర్యం గొలుపుతూ వుంటాయి.

అలా గమనిస్తే గాంధీగారు సాధించిన విజయాలు, మదర్‌థెరిస్సా చేసిన పనులు అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేస్తాయి. అలాగే స్వామివివేకానంద ప్రపంచాన్నే ఉర్రూతలూగించారు. రమణమహర్షి ఉన్నచోట నుంచి కదలకుండా ప్రపంచాన్ని ఆకర్షించారు. ఓషో రజనీష్ ఎన్నో దేశాలకు ఒణకు పుట్టించారు. అలాగే సత్యసాయిబాబా ఎన్నో గొప్ప కార్యాలు చేస్తున్నారు. ఇలా చెప్పకుంటూ పోతే ఎంతోమంది గొప్పవారు మనకు కనిపిస్తారు. ఇంకా ఎంతోమంది సాహసాలు చేసి గిన్నీస్‌బుక్‌లో ఎక్కారు. ఇంకా ప్రపంచ రికార్డులు సాధించిన వారెంతోమంది వున్నారు.

అలాంటి గొప్పవారు ఎంత మంది ఉన్నా ప్రపంచ జనాభాలో వారి శాతం చాలా స్వల్పాతి స్వల్పం. ఇన్ని విజయాలు, సాధించే వారున్నా, ఎంతోమంది తాము ఏమీ చేయలేనివారిగా అల్పులుగా జీవిస్తున్నారు. గొప్పవారు చేసే పనులను చూసి ఆశ్చర్యాన్ని ప్రకటించటం తప్ప ఏమీ చెయ్యలేక పోతున్నారు. వారిని ప్రశంసించటం మాత్రం చెయ్యగలుగుతున్నారు.

కాని గమనిస్తే దేహపరంగా, వారు వీరు ఒకేలా వుంటారు. వారికుండే కళ్ళు, చెవులు, ముక్కు, నోరు, చేతులు అన్నీ వీరికీ వుంటాయి. వారు తిన్నట్టే వీరు తింటారు. కాని వారు చేసే కార్యాలు మాత్రం వీరు చెయ్యలేరు. అందరూ మానవులే అయినా కొంతమంది గొప్పవారుగా ఎందుకు కాగలుగుతున్నారు? ఎక్కువమంది ఎందుకు అల్పులుగానే జీవిస్తున్నారు? దీనికి కారణమేమిటి?

దీనికి ముఖ్యకారణం వారి 'భావం'. వారు తాము అల్పులమని భావించడమే వారిని అల్పులుగా చేస్తుంది. అల్పులుగానే వుంచుతుంది. అల్పపనులే చేయిస్తుంది. శ్రీకృష్ణభగవానుడు గీతలో ఇదే సందేశం ఇచ్చారు. "యద్భావం తద్భవతి" అంటే మీ భావాన్ని బట్టే మీ జీవితం అని చెప్పారు.

ఆయన చెప్పినట్టు ప్రపంచంలో ఎక్కువమంది అల్పభావంతో

జీవిస్తుండడం వల్ల వారు అల్పులుగానే మిగిలిపోతున్నారు. ఏమీ చెయ్యలేకపోతున్నారు. ఏమీ సాధించలేకపోతున్నారు. ఎంతసేపూ ఎవరినో ఒకరిని అర్థిస్తూ, ప్రార్థిస్తూ రక్షించమని వేడుకుంటూ జీవితాన్ని గడుపుతున్నారు. చేయడానికి కూడా ప్రయత్నించడం లేదు. ఎవరైనా చెయ్యమన్నా అది మావల్ల ఎలా అవుతుంది? అని అంటారు, అనుకుంటారు.

అసలు సత్యమేమిటంటే "అంతా ఒకటే!" ఇదే సృష్టి రహస్యం. ఇక్కడ ఎక్కువ తక్కువలనే వారు ఎవరూ లేరు. భావాలే ఎక్కువ తక్కువగా వున్నాయి. ఎవరి భావ స్థితిని బట్టి వారి ప్రవర్తన ఉంటుంది.

అంతా దేహభావంతో జీవిస్తున్నారు. అంటే దేహమే తామనే భావంతో జీవిస్తున్నారు. కాని నిజానికి అంతా "ఆత్మలు" ఆత్మలై వుండి ఆత్మే తాను అన్న భావంతో జీవించడం లేదు. ఇదే దుఃఖానికి కారణం. ఏమీ సాధించలేక పోవటానికి కారణం.

కాని భావం మార్చుకుంటే అంటే నేను అల్పమైన దేహం కాదు, దైవస్వరూపమైన, అనంతశక్తివంతమైన 'ఆత్మను' అన్న భావంతో జీవిస్తే తప్పకుండా ప్రతీ ఒక్కరూ అద్భుతమైన విజయాలు సాధిస్తారు. ఎన్నో గొప్ప పనులు చెయ్యగలుగుతారు. ఎవరి సాయం కోసం ఎదురు చూడరు. ఎవరినీ అర్ధించరు. కోరుతూ, ఎదురు చూస్తూ కూర్చోరు. కష్టపడటానికి ప్రయత్నిస్తారు. తప్పకుండా తమకు కావలసినవన్నీ సాధిస్తారు. ఆనందంగా జీవిస్తారు. అందుకే విజయం అన్నది గొప్పకార్యాలు చెయ్యడం అన్నది, ధనంతో కాని, అధికారంతో కాని మరి దేనితో కాని సాధ్యంకాదు. ఒక్క అంతర్ భావంతో మాత్రమే అది సాధ్యం.

మానవులు అల్పభావంతో జీవిస్తున్నారనటానికి వారు చేస్తున్న పనులు, వారు జీవిస్తున్న విధానమే మనకు తెలియచేస్తుంది. ఇలాంటి పనులు చేసే వారు అల్పభావంతో వున్నట్టు లెఖ్క. వారేమీ సాధించలేరు. గొప్పవారిలా గొప్పకార్యాలు చెయ్యలేరు. చాలామంది వాడు ధనవంతుడు. నేను తక్కువ ధనం వున్నవాడినని అనుకుంటారు. వాడు అదృష్టవంతుడు. నేను దురదృష్టవంతుడ్ని అని అనుకుంటారు. ఇది అల్పభావన. అలాగే వాడికి అధికార బలం వుంది నేను సామాన్యుడను అని భావించి అలాంటివారు కనపడగానే వారికి నమస్కారం చెయ్యడం వారి కాళ్లకు మొక్కడం, వారికంటే తక్కువవారిగా ప్రవర్తించటం ఇదంతా అల్పభావమే.

అలాగే వారు పండితులు వారికి అన్ని తెలుసు. వారు బాగా

చదువుకున్నవారు. నేనే చదువులేనివాణ్ణి. నాకేమీ తెలియదు అని భావించడం కూడా అల్పభావమే. అలాగే పెద్ద ఉద్యోగంలో వున్నవారిని, ఏ రంగంలోనైనా ఉన్నతంగా వున్నవారిని చూసి వారు గొప్పవారు అని భావించడం కూడా అల్పభావనే. అలాగే ఇతరులను పొగడడం, స్తుతించడం, వారిని మీరు ఇంతవారు, అంతవారు అనటం. ఎవరైనా తనని పొగిడినా నేను అంతవాణ్ణి కాదు అనటం అంతా అల్పభావమే.

దేహభావంతో ప్రాపంచికంగా జీవించే వారికి తన కన్నా ఎవరు ఎందులో ఉన్నతంగా ఉన్నా, తనకున్న దానికన్నా ఎవరికి ఎందులో ఎక్కువగా వున్నా వారిని గొప్పవారనుకోవటం, తన ప్రవర్తనలో అది వ్యక్తం చేస్తుండటం ఇదంతా అల్పభావమే. దేహభావంలో వున్నవారికి ఈ తారతమ్యాలు కనిపిస్తుంటాయి. కాని ఆత్మభావంతో ఉంటే అంతా ఒకటిగానే, సమానంగా కనిపిస్తుంది. మన ప్రవర్తన సమానంగా లేకపోతే మనభావం అల్పంగా వున్నట్టే.

అలాగే తానే దైవమై వుండి, దైవం ఎక్కడో వున్నాడు ఆయన నాకన్నా గొప్పవాడు, నేను అల్పుణ్ణి. ఆయనే నన్ను, నా కష్టాలలోంచి రక్షించగలడు. నా సమస్యల నుంచి నన్ను కాపాడగలడు, నాకు అన్ని ఆయనే ఇవ్వాలి. అని నిత్యమూ పూజిస్తూ, ప్రార్థిస్తూ, నమాజు చేస్తూ, భజనలు చేస్తూ వేడుకోవడం అన్నది కూడా అల్పభావమే. ఇలాంటి పనులు చేసే వారంతా అల్పభావంతో ఉన్నట్టే. తాను తక్కువని భావిస్తూన్నట్టే, తాను ఏమీ చేయలేనని, తన వల్ల ఏమీ కాదన్నట్లుగా భావిస్తున్నట్టే. వారు ఇలాంటి పనులు ఎంతకాలం చేస్తూంటారో అంతకాలం వారు ఏమీ సాధించలేరు. అలా జీవితమంతా ఒకరి సాయం కోసం ఎదురుచూస్తునే ఉంటారు. ఎవరు సాయం చేస్తారని తెలిసినా వారి దగ్గరకు పరుగులు పెడుతూ వుంటారు. వాళ్ళ కాళ్ళకు మ్రొక్కుతూ వుంటారు.

దీనికంతటికీ కారణం తాను దైవమై వుండి, దేహమే తాను అని భావించడం. "యద్భావం తద్భవతి" అన్నట్టుగా దేహాన్ని చూసుకుంటూ దేహమే తాను అనుకున్నపుడు తాను తక్కువ కులం వాడుగా కనిపిస్తుంది. తాను ధనం లేనివాడుగా అనిపిస్తుంది, తనకి అధికారం లేనట్లుగా అనిపిస్తుంది. చదువులేనట్టుగా అనిపిస్తుంది. మంచి ఉద్యోగంలో లేనట్టుగా అనిపిస్తుంది. అన్ని విషయాలలోనూ తక్కువగానే అనిపిస్తుంది. అందుచేత అల్పుడుగా భావించుకుంటూ వుంటే అల్పభావంతోనే

జీవిస్తూంటారు. ఏమీ చెయ్యలేరు.

కాని ఈ మేను నేను కాదు, ఆత్మే నేను అని భావించినపుడు అంతా నేనే అని తెలుసుకుంటారు. అక్కడ ఎక్కువ తక్కువ అనే భావం పోతుంది. అంటే అల్పభావం పోతుంది. అలాంటివారు ఏదైనా సాధిస్తారు. ఎన్నో గొప్ప కార్యాలు చేస్తారు.

ప్రపంచంలో ఎక్కువశాతం అల్పభావంతో జీవించడానికి కారణం ప్రతీ ఒక్కరూ పూజలోనో, ప్రార్ధనలోనో, నమాజులోనో, భజనలోనో, వుండటమే. అందుకే ప్రపంచంలో ఎవరూ ఏమీ చేయలేక, సాధించలేక, సాధించే ప్రయత్నం చేయక దుఃఖంలో జీవిస్తున్నారు. ఎంతసేపూ కోరడం, నమ్మకంతో ఎదురు చూడడం. ఇదే ప్రస్తుత ప్రపంచ పరిస్థితి. అందుకే ప్రపచం ఇంత దుఃఖంతో నిండి వుంది. ఈ స్థితి నుంచి ప్రపంచం బయటపడాలంటే దేహభావం పోవాలి. దేహభావానికి కారణం మనస్సు. మనస్సును జయించాలంటే ధ్యానం చెయ్యాలి. ధ్యానం ఒక్కటే ప్రపంచాన్ని ఈ స్థితి నుండి కాపాడగలిగేది. ధ్యానం తప్ప ఇంకొక మార్గం లేదు.

ఎంతకాలం మానవులు ధ్యానం చెయ్యరో, అంతకాలం మానవులు అల్పభావంతో, అల్పులుగా అలమటిస్తూ వుంటారు. అందుచేత ధ్యానం చెయ్యండి. గొప్పవారుకండి. గొప్పకార్యాలు చేస్తూ గొప్పవారిగా జీవించండి.

## తెలుసుకోండి

**మానవులలో రకాలు**

**1) ఆత్మ అనుభవం పొందిన వారు,**

**2) ఆత్మ అనుభవం గురించి భోధించేవారు,**

**3) ఆత్మ అనుభవం గురించి భోదిస్తే విని అర్థం చేసుకొనేవారు.**

**4) ఆత్మ గురించి బోధించినా అర్థం చేసుకోలేని వారు.**

**ప్రపంచంలో వీరి శాతం ఎక్కువ.**

# "సోమరులు కాకూడదు!"

సృష్టిలో మానవునికి, పశువుకు చాలా తేడా వుంది. పశువు ఏ నియమాలతో బంధింపబడి లేదు. కాని మానవుడు వేలాది నైతికవిలువలు, బాధ్యతలు, కర్తవ్యాలు, ధర్మాలతో బంధింపబడి వున్నాడు.

శరీరాన్ని రోగ రహితంగా ఉంచడం, మానవుని కర్తవ్యం. అలాగే మానవునకు సంసార భాధ్యతలు వున్నాయి. సంఘంలో, సమాజంలో నైతిక విలువలు పాటించవలసి వుంది. అలాగే మంచి గుణాలు కలిగి, రాగద్వేషాలు లేకుండా, లోభమోహాల నుండి బయటపడి ఆత్మను ఉద్ధరించుకోవలసిన ధర్మం కూడా వుంది.

భగవంతుని ద్వారా ఏ పని నిమిత్తం మానవునకు ఈ జన్మ ఇవ్వబడిందో, ఆ పని పూర్తి చేయడమే మానవుని కర్తవ్యం. ఈ మానవ జన్మ ద్వారా జ్ఞానాన్ని, ప్రతిభను పెంచుకోవడమే మానవుని కర్తవ్యం.

కాని మానవుడు, తన బాధ్యతలు, కర్తవ్యాలు, ధర్మాలు విస్మరించి పశువులాగే ప్రవర్తిస్తున్నారు. జంతువులు వాటికి నచ్చినవి తిని, నచ్చినవి చూసి ఎలా ఆనందిస్తున్నాయో మానవుడు కూడా తనకు నచ్చినవి భుజించి ఆనందిస్తున్నాడు. తనకు నచ్చినవి చూసి ఆనందిస్తున్నాడు. జంతువు నిద్రించినట్టే మానవుడూ నిద్రిస్తున్నాడు. వాటిలాగే సంతానాన్ని పొందుతున్నాడు. పుత్రవాత్సల్యం కలిగి వుంటున్నాడు. వాటిలానే భయానికి లోనవుతున్నాడు. వాటిలాగే కష్టం వచ్చినపుడు రోదిస్తున్నాడు. చివరకు వాటిలాగే మరణిస్తున్నాడు. చూస్తే మానవుడు జంతువు కన్నా వేరుగా ప్రవర్తించడం లేదు, ఆలోచించడం లేదు.

తన కర్తవ్యం నిర్వర్తించుకోవటానికి భగవంతుడు మానవునికి అమోఘమైన మేధాసంపత్తి ఇచ్చాడు. కాని మానవుడు ఇంత గొప్ప సంపత్తిని, గొప్ప జీవితాన్ని, గొప్ప జన్మను, గొప్ప అవకాశాన్ని సోమరితనం కారణంగా నష్టపరచుకుంటున్నాడు.

మానవుడు పశువులాగ దిగజారవచ్చు. దేవతలా ఎదగవచ్చు. దిగజారడం చాలా తేలిక. కాని ఎదగడం చాలా కష్టం. మానవుడు సోమరితనం కారణంగా దిగజారుతున్నాడు. కాని ఎదగలేకపోతున్నాడు. మానవ జీవితం ఏదో విధంగా రోజులు గడపటానికి ఇవ్వబడలేదు. గొప్పవాడవ్వటానికి, ఏదో గొప్పపని చెయ్యటానికి ఇవ్వబడింది.

చిన్న చీమ కూడా పైకి వెళ్ళటానికి ప్రయత్నిస్తుంది. అలాగే మనం కూడా పైకి ఎదగటానికి ప్రయత్నించాలి. ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందటానికి ప్రయత్నించాలి. సోమరులు కాకూడదు.

మేల్కొన్న వాడికే సూర్యోదయం లభిస్తుంది. అలాగే ధ్యానసాధన చేసిన వాడికే జ్ఞానం లభిస్తుంది. జ్ఞానం పొందిన వాడికే ముక్తి లభిస్తుంది. సోమరులై ధ్యాన సాధన చెయ్యకపోతే జీవితం వ్యర్థమవుతుంది. ఎదగడు దిగజారతాడు.

సోమరితనానికి మించి అధిక నష్టాన్ని కలగచేసే శత్రువు మరొకటి లేదు. సోమరి ఎప్పుడూ నష్టపోతాడు, దుఃఖం పొందుతాడు. సుఖమనుకుని సోమరిలా తయారవుతే దుఃఖమే ఎదురవుతుంది. కష్టపడటం బాధాకరమే కాని కష్టపడేవాడే, ఆనందాన్ని పొందుతాడు.

ప్రపంచంలోని మహాపురుషులంతా అంతులేని శ్రమతో, కష్టంతో తమ జీవితాన్ని ఉద్ధరించుకోవడమే కాదు, సమాజం కోసం, లోకం కోసం ఎంతో పాటుపడ్డారు. అందరికి ఆదర్శ ప్రాయులయ్యారు. జీవితంలో లోకానికి ఉపయోగకరమైన పనులు చెయ్యడమే వారి జీవిత ధ్యేయంగా శ్రమించారు. వారి జీవితం ఎప్పడూ నిరాడంబరంగా ఉండటమే కాదు, వారి ఆశయాలు కూడా ఎంతో ఉన్నతంగా వుంటాయి. వారు ఏ పని చేసినా అందరి హితం కోరే చేస్తారు. అలాంటి వారిదే అసలైన జీవితం.

మనం కూడా సోమరులు కాకూడదు. సోమరిపోతు తనకే నష్టాన్ని కలుగ చేసుకుంటాడు. అజ్ఞానమనే చీకటిలో తిరుగుతూ, ఎదురుదెబ్బలు తింటూ, తన అపజయాలకు కారణం ఇతరుల మీదకు నెడుతూ జీవిస్తూ వుంటాడు. భగవంతుని సహకారం అందుకునే శక్తి, ప్రకృతి సందేశాన్ని గ్రహించే సామర్థ్యం అతనిలో వుండవు.

సోమరితనం అన్ని పాపాలకు మూలం . భగవంతుడు శ్రమించే వారినే ప్రేమిస్తాడు. సోమరులను కాదు. కష్టించేవారికి, సాహసులకు, కృషి చేసేవారికి, భగవంతుడు సహాయం చెయ్యటానికి ప్రయత్నిస్తాడు. సోమరులు అదృష్టాన్ని నమ్ముకుని కూర్చుంటారు. చకోర పక్షిలా ఎదురుచూస్తుంటారు. పని చేయకుండా, కష్టపడకుండా పూజిస్తూ, ప్రార్థిస్తూ, అన్నీ కోరుకుంటూ ఉంటారు. చివరకు హీనులుగా, దీనులుగా మిగిలిపోతారు. వారు కష్టపడరు, అన్నీ పొందాలనుకుంటారు. శ్రమపడకుండా అన్నీ సాధించాలనుకుంటారు. కబుర్లు చెబుతారు పని చెయ్యరు. అందరిని విమర్శిస్తుంటారు. నిందలు వేస్తూంటారు. తమ దోషాలు చూసుకోరు. ఇతరుల దోషాలు ఎంచుతారు.

వీరికి ఆశ ఎక్కువ. కష్టం చెయ్యలేరు. తేలికైన మార్గాలు అన్వేషిస్తుంటారు. సుఖ పడాలని సుఖాల కోసం తాపత్రయ పడుతూంటారు. సుఖాల కోసం పరుగులు పెడుతూ, అడ్డదారులు తొక్కుతుంటారు. పాపాలు కూడా చేస్తారు. చేయకూడని పనులు చేస్తారు. చివరకు జీవితాన్ని దుఃఖమయం చేసుకుంటారు.

అసలు సుఖపడాలనుకోవడమే సోమరిలా తయారవడానికి ముఖ్య కారణం. అందుచేత సోమరి కాకుండా కష్టాలలో కూడా ముందుకు వెళ్ళగలగాలి. వాడినే విజయాలు వరిస్తాయి. మన పతనానికి కారణం భగవంతుడు కాదు, మన సోమరితనమే.

మనకి రెండు మార్గాలున్నాయి.1. ప్రేయోమార్గం 2.శ్రేయోమార్గం.

మొదటిది ఇంద్రియాలకు సుఖాన్నిచ్చే ప్రేయోమార్గం. సోమరుల మార్గం. రెండవది కళ్యాణకరమైనది, శాశ్వతమైనది ఆనందమైన శ్రేయోమార్గం. ఇది శ్రమించే వారి మార్గం.

ఈ శరీరం ఆత్మ యొక్క వాహనం అని గుర్తించాలి. శరీరానికి, ఇంద్రియాలకు ప్రాముఖ్యం ఇవ్వకూడదు. అలా ఇస్తే ఆత్మ ప్రకాశం ప్రకటితం కాదు. ఉన్నత శిఖరాలు అధిరోహించలేం. అందుచేత సోమరులు కాకుండా కష్టపడి ధ్యానసాధన చెయ్యాలి. ధ్యానం యొక్క సారం ఇంద్రియాలను జయించడం. ముక్తిని సాధించడం. అందుచేత ధ్యానం చేద్దాం. "సోమరులు కాకుండా జీవిద్దాం."

## సుఖాలు కోరవద్దు - సోమరులు కావద్దు.

### తెలుసుకోండి

**వారు చెడ్డవారని అంటే చెడ్డతనం మనలో వున్నట్టు గుర్తు.**

**లోపల చెడుతనం వుంది కాబట్టి బయట కనిపిస్తుంది.**

**నేను చేసే ఈ పని ఎవరికైనా తెలుస్తుందని భయపడే పనిని, మీ జీవితంలో చేయకండి.**

# ప్రకృతి తల్లిలాంటిది!

తల్లి తన బిడ్డల్ని ఎలా ప్రేమిస్తుందో, ప్రకృతి కూడా తన బిడ్డలైన మనల్ని అలాగే ప్రేమిస్తుంది. బిడ్డలు తల్లిని గౌరవించినా, గౌరవించక పోయినా తల్లి బిడ్డల్ని ప్రేమిస్తూనే వుంటుంది. తనను గౌరవించట్లేదని ఎప్పడూ బాధపడదు. వాడు నష్టపోతాడు, కష్టాల పాలవుతాడు అని ఆవేదన చెందుతుంది. తల్లికోపం బిడ్డలు మంచి మార్గంలో వుండాలని, మంచి నడవడిక కలిగి వుండాలనే కాని నిజమైన కోపం కాదు. అలాగే తల్లిదండన పిల్లలలో పరివర్తన తీసుకురావడానికే కాని, అది శిక్ష కాదు.

తల్లిని ఏదీ అడగవలసిన పనిలేదు. బిడ్డకు ఏమి కావాలో తల్లికి తెలుసు. పసితనం నుంచి బిడ్డను గమనిస్తూనే వుంటుంది. బిడ్డకు ఏమి కావాలో ఎంత కావాలో, కన్న తల్లికి తెలుసు. అందుచేత బిడ్డకిష్టమైనవి. బిడ్డకి నచ్చేవి బిడ్డ కోరకుండానే వాడికోసం అమర్చుతుంది. తాను త్యాగం చేసైనా బిడ్డను ఆనందింప చేస్తుంది. బిడ్డ తల్లిప్రేమను అర్థం చేసుకోకుండా తల్లిని నిందించినా, బాధించినా తల్లి ఓర్చుకుంటుంది. ఇదంతా అడ్డాల్లో వున్న బిడ్డకు సంబంధించింది. అంతేకానీ గడ్డాలు వచ్చిన వాడి గురించి కాదు.

అంతే కాదు పెద్దవాడైనా కాని బిడ్డను ద్వేషించదు. బిడ్డ తల్లి ప్రేమను అర్థం చేసుకోలేక తల్లి మీద అలిగినా, కోపంతో దూరమైనా తల్లి మధనపడతుందే కాని బిడ్డ మీద శత్రుత్వం పెంచుకోదు. బిడ్డ తన ప్రేమను అర్థం చేసుకుంటాడు. ఎప్పడో ఒకప్పడు తన ప్రేమను అర్థం చేసుకుని, తన దగ్గరకు వస్తాడని ఎంతకాలమైనా ఎదురుచూస్తుంది. అంతే కాని తన బిడ్డను విమర్శించదు. మంచివాడు కాడు అని ఎప్పడూ అనుకోదు.

ఏ క్షణంలో అయితే బిడ్డ తన తప్పను తెలుసుకుని, పశ్చాత్తాప పడి, పరివర్తన చెంది, తల్లి దగ్గరకు వస్తాడో, తల్లి అన్నీ మరిచిపోయి బిడ్డను దగ్గరకు తీసుకుంటుంది. ప్రేమను పంచుతుంది. అంతేకాని గతాన్ని తిరగతోడదు. పరివర్తన చెంది బిడ్డ రావడమే ఆమె చూసుకుంటుంది. కాని బిడ్డలో చెడు చూడదు, బిడ్డ గతాన్ని చూడదు. తనకు చేసిన చెడును కూడా మరచిపోతుంది, క్షమిస్తుంది.

అలాగే ఈ తల్లిలాంటి లక్షణాలు, గుణాలు ప్రకృతిలో మనం గమనించవచ్చు. ప్రకృతి అంటే భగవంతుడు. మనమంతా ప్రకృతి బిడ్డలం. అంటే భగవంతుని బిడ్డలం. భగవంతుని గౌరవించినా, గౌరవించకపోయినా భగవంతుడు మనల్ని ప్రేమిస్తూనే వుంటాడు. అంటే ప్రకృతి మనల్ని ప్రేమిస్తూనే వుంటుంది. మనమంతా తల్లి ఒడిలో వున్న పసిపాపలలాంటి వారం. ప్రకృతి ఒడిలో వున్నాం. తనను గౌరవించలేదని ప్రకృతి ఎప్పుడూ బాధపడదు.

అడ్డాలలో వున్నపుడు తల్లి గమనిస్తే టైం చూసుకుని, రాత్రిళ్ళు అలారం పెట్టుకుని బిడ్డకు పాలు పడుతుంది. బిడ్డల కడుపు నింపుతుంది. వారికి ఆనందం కలిగిస్తుంది. వారు హాయిగా నిద్రపోవాలని చూస్తుంది. గాలి లేకపోతే ఫ్యాను వేస్తుంది. లేకపోతే విసురుతుంది. చలిగా వుంటే వెచ్చగా రగ్గు కప్పతుంది. వాడు హాయిగా నిద్రపోవాలని చూస్తుంది. తాను మేలుకుని కూడా వాడిని నిద్రపుచ్చుతుంది.

అలాగే ప్రకృతి కూడా మనము అడగందే మనము కోరకుండానే మనం భూమిమీదకు రాకుండానే మనకు కావలసినవన్నీ సమకూర్చింది. మనం పెరగడానికి కావలసిన పాలు మన అమ్మ దగ్గర ముందే ఏర్పాటు చేసింది. మనం హాయిగా, జీవించడానికి, ఆనందం పొందటానికి, కావలసినవన్నీ సమకూర్చింది. మనం తినటానికి, మన ఆకలి తీర్చటానికి మధురమైన ఫలాలు, రకరకాల కూరగాయలు, పప్పలు ధాన్యాలు ప్రకృతి సమకూర్చే వుంచింది. ఇంకా మనం చూసి ఆనందించటానికి సుందరమైన, రంగురంగుల మనోహరమైన దృశ్యాలు ప్రకృతి సృష్టించింది. వినటానికి వీనులవిందైన ధ్వనులు, ఏర్పాటు చేసింది. మనకున్న పంచ జ్ఞానేంద్రియాలతో అన్ని అనుభవించేలా ప్రకృతి ఏర్పాట్లు చేసి వుంచింది. ఇవన్నీ మనం కోరకుండానే మన కోసం, మన ఆనందం కోసం ప్రకృతి ఏర్పాటు చేసింది.

పైవన్నీ తల్లి బిడ్డకు అమర్చినట్టు, ప్రకృతి మనకు అమర్చింది. తల్లి తాను త్యాగం చేసైనా బిడ్డకు ఆనందం ఎలా కలిగిస్తుందో! ప్రకృతి కూడా ఆకులు తుంచినా, కాయల కోసం కొమ్మలు విరిచినా, మన ఆనందమే ప్రకృతి చూస్తుంది. అలాగే నదులను కాలుష్యం చేసినా, మురికి చేసినా బాధపడదు. నీరు ఇస్తూనే వుంటుంది. మానవుడు తన ఆనందం కోసం

ప్రకృతిని చిన్నాభిన్నం చేసినా ప్రకృతి కోపించదు, బాధపడదు, తల్లిలా ప్రేమిస్తూనే వుంటుంది. ఓర్చుకుంటుంది.

ప్రకృతిలోని సమస్తం ప్రకృతిలో భాగాలే. తల్లిపాలు త్రాగుతూ తల్లి రొమ్ములు గుద్దితే ఎలా సున్నితంగా మందలిస్తుందో, అలాగే రొమ్ము కొరికితే ఎలా దండిస్తుందో! ప్రకృతిలో భాగమైన జంతువులను, మూగ జీవులను బంధించి వాటి స్వేచ్ఛను హరించినా, వాటిని తన సరదా కోసం బాధించినా ముందు అలాంటివి చేయకూడదని అంతరాత్మ రూపంలో బోధిస్తుంది. ఎవరో ఒకరి ద్వారా బోధిస్తుంది. అయినా గ్రహించక జీవులను చంపినా, హింసించినా, చేయకూడని మాంస భక్షణ చేసినా, తనలో భాగమైన ఇతరులను కష్టపెట్టి, నష్టపెట్టి మితిమీరి ప్రవర్తిస్తే రోగాల రూపంలో చిన్న చిన్న శిక్షలు వేస్తుంది. మన తప్పులు తెలుసుకోవటానికి శిక్షణ ఇస్తుంది.

ఇవి శిక్షణ కోసం వేసే శిక్షలు అని అర్థం చేసుకోలేక తనను కోపించినా, దూషించినా, ఫొటోలు మార్చి అవమానించినా, మతాలు మార్చినా, ప్రకృతి అంటే భగవంతుడు కోపించడు. ఎప్పడో ఒకప్పుడు వాడే అర్థం చేసుకుంటాడని ఎదురు చూస్తాడు. తన బిడ్డ మంచివాడు కాడని ఎప్పుడూ అనుకోడు.

ఎప్పుడయితే మనం మన తప్పులు తెలుసుకుని జ్ఞానం పొందుతామో అలాంటి తప్పులు చేయకుండా వుంటామో!మనం చేసిన పాపాలు అన్నీ క్షమించి తన దగ్గరకు తీసుకుంటాడు. అంటే మోక్షం ఇస్తాడు. అందుచేత ప్రకృతి తల్లి లాంటిదని తెలుసుకోండి. తల్లి ప్రేమను, ప్రకృతి ప్రేమను గుర్తించండి. ప్రకృతికి హాని చేయకండి. ప్రకృతికి హాని చెయ్యడమంటే తల్లి పాలు త్రాగి రొమ్మును గుద్దడం లాంటిదేనని తెలుసుకోండి. ప్రకృతిని గౌరవించండి, ప్రేమించండి. ప్రకృతి ప్రేమను పొందండి. అన్ని ప్రాణులను, జీవులను ప్రేమించండి.

**ధ్యాన సత్యం :**

**గాఢ నిద్రలో ఉన్న సహజ స్థితిని ధ్యానం ద్వారా జాగ్రదావస్థితిలోనికి తెచ్చుకుంటే దానినే సమాధి స్థితి అంటారు.**

# మానవుడు స్వేచ్ఛా జీవా?

మానవుడు స్వతంత్రంగా, స్వేచ్ఛగా జీవిస్తున్నాడా? ఆలోచిస్తే లేదనే తెలుస్తుంది. మానవుడు ఎన్నో రకాలుగా బంధింపబడి వున్నాడు. సాంప్రదాయాల పేరుతో, కట్టుబాట్లు, ఆచారల పేరుతో ఎన్నో రకాలుగా బంధింపబడి వున్నాడు.

అలా కుటుంబ కట్టుబాట్లతో, కుల, మతాచారాలతో, ప్రాంతీయ, దేశ సాంప్రదాయాలతో మానవుడు బందీయై వున్నాడు. వీటన్నిటిలో చిక్కుకుని జీవిస్తూ కూడా తాను స్వతంత్రంగా, స్వేచ్ఛగా జీవిస్తున్నానని భావిస్తున్నాడు. కానీ వీటన్నిటి నుంచి బయటపడినపుడే మానవుడు స్వేచ్ఛా జీవి అంటే స్వేచ్ఛగా జీవించినవాడవుతాడు.

అసలు పుట్టగానే వీటన్నిటిలో బందీ అవుతున్నాడు. అంటే బందీగానే పుడుతున్నాడు. అందుకే జన్మ బంధం అంటారు. మానవుడు ఈ బంధం నుండి విడివడాలి. బంధ విముక్తుడు కావాలి. ముక్తిని పొందాలి. జీవించి ఉండగానే ముక్తిని పొందాలి. జీవన్ముక్తుడుకావాలి.

ఎందుకంటే బంధాలతో జీవిస్తున్న వాడు స్వేచ్ఛాజీవి ఎలా అవుతాడు? అసలు సృష్టి రహస్యమేమిటంటే అంతా ఒక్కటే. వేరే వేరు అనేవి ఏమీ లేవు. పైకి అలా కనిపిస్తున్నాయి కానీ అంతా ఒక్కటే. ఇన్ని రకాల బంధాలలో చిక్కుకోవడం వల్ల ఈ జ్ఞానం పొందలేకపోతున్నాడు. వీటిలోంచి బయటపడిన వెంటనే మానవుడు ఈ సత్యాన్ని తెలుసుకుంటాడు. ఈ జ్ఞానాన్ని పొందుతాడు. ఈ దుఃఖాల నుండి శాశ్వతంగా బయటపడతాడు. ముక్తుడవుతాడు.

మానవుడు కుటుంబ కట్టుబాట్లు పాటిస్తున్నాడు. అంటే తాను ఒక కుటుంబం వాడినన్నట్లు భావిస్తున్నాడు. కుల, మత ఆచారాలు పాటిస్తున్నాడు అంటే తాను ఒక కులస్తుడనని, మతస్తుడనని భావిస్తున్నాడు. అలాగే ప్రాంతీయ, దేశ సాంప్రదాయాలు పాటిస్తున్నాడంటే తాను ఒక ప్రాంతం వాడినని, ఒక దేశస్తుడనని భావిస్తున్నట్టే కదా? అలా భావిస్తున్నాడంటే అంతా ఒక్కటే అన్న సృషి రహస్యాన్ని తాను తెలుసుకోనట్టే కదా? ఆ సత్యం తనకు అవగతం కానట్టే కదా?. ఆ జ్ఞానం తాను పొందనట్టే కదా?

అలా జీవించేవారు ఎంతో కొంత స్వార్థం ప్రదర్శిస్తూనే వుంటారు. సృష్టి విరుద్ధమైన పనులు చేస్తూనే వుంటారు. నష్టపోతారు. వారు ఎన్నటికీ స్వేచ్ఛా జీవులు కాలేరు. స్వేచ్ఛగా వ్యవహరించలేరు. ప్రవర్తించలేరు, జీవించలేరు. ముక్తి పొందలేరు.

గమనిస్తే ప్రతీ ఒక్కరూ కుటుంబ కట్టుబాట్లను పాటిస్తూనే వుంటారు. ఆ కుటుంబంలో వున్న ఆచారాలు, అలవాట్లు, పద్ధతులు అనుసరిస్తారు. వారు చేసుకునే ఫంక్షన్లు కాని, వేడుకలు కాని, పండుగలు కానీ కుటుంబ పద్ధతుల ప్రకారమే చేసుకుంటారు. మా పద్దతి ఇది, మా ఆచారం ఇది అంటూ ఆ కుటుంబంలో  వస్తున్న కట్టుబాటు ప్రకారమే చేస్తుంటారు.

ఇంకా గమనిస్తే కుటుంబం తరువాత కుల, మత ఆచారాలను పాటిస్తూంటారు. సాటి కులస్తులను, మతస్తులను గౌరవించడం, ఆ కుల ఆచారాలు, మతాచారాలు పాటించడం, వారంతా ఏమి చేస్తే తాము అదే చెయ్యడం చేస్తుంటారు. అలా ఆ కులం వారినే వివాహం చేసుకోవడం, ఫంక్షన్సుకు, పార్టీలకు ఆ కులం వారికి ప్రాముఖ్యం ఇచ్చి పిలవడం, పెళ్ళిళ్ళకు, చావులకు ఆ కులం వారే ఎక్కువగా కలగచేసుకోవడం, ఆ కులాచారాల ప్రకారం ఆచరించడం చేస్తుంటారు.

అలాగే మతాన్ని అభిమానించడం, మతాచారాలు పాటించడం, అంటే కొంతమంది బొట్టు పెట్టుకుంటారు. కొంతమంది బొట్టు తీసి వేస్తారు. ఇంకా కొంతమంది బురఖా కప్పకుంటారు. వస్త్రధారణ కూడా మతాచారం ప్రకారమే వుంటుంది.  దేవుని ఆరాధించడం కూడా మతాచారం ప్రకారమే వుంటుంది. కొంతమంది పూజిస్తారు. కొంతమంది ప్రార్థిస్తారు. మరికొంతమంది నమాజు చేస్తారు. అలా మతాచారం ప్రకారం ఎవరికి వారు ప్రవర్తిస్తారు. అంతేకానీ తాము చేసే పనివల్ల ప్రయోజనం వుందా? లేదా? అని ఆలోచించరు. ప్రతీ ఒక్కరూ ఇతర మతస్తులను ద్వేషిస్తారు. తమ మతస్తులను ప్రేమిస్తుంటారు. మతాచారాలు, మత నియమాలు పాటించకపోతే దేవుడు కోపిస్తాడని కూడా భయపడతారు.

భగవంతునికి రూపం లేదు అంటూనే భగవంతుని గూర్చి, సృష్టి నియమాలు గురించి, ధర్మాల గురించి బోధించడానికి వచ్చిన దూతలను

దేవుళ్ళని ఆరాధిస్తుంటారు. వారు చెప్పినవి ఆచరించడం మాని వారిని ఆరాధించటానికి, కోరటానికి ప్రాముఖ్యం ఇస్తారు. వారి పేరుతో మతాలు స్థాపించుకుని, కొన్ని ఆచారాలను ఏర్పాటు చేసుకుని ఆ మతాచారాల ప్రకారమే చేస్తుంటారు.

ఆ తరువాత ప్రాంతాన్ని, దేశాన్ని అభిమానిస్తూ ప్రాంత, దేశ, సాంప్రదాయాలు పాటిస్తారు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్ళినా తమ దేశ సాంప్రదాయాలు పాటిస్తూనే వుంటారు. అలా వస్త్ర ధారణ చేస్తుంటారు. ఆ ప్రాంతంలో జరిగే, ఆ దేశంలో జరిగే జాతరలు, తీర్థాలు, వేడుకలు చేసుకుంటారు. దేశ పండగలు జరుపుకుంటారు. ఆ ప్రాంత సాంప్రదాయాన్ననుసరించి నృత్యాలు చేస్తారు, పాటలు పాడతారు. అలా ప్రాంతాన్ని, దేశాన్ని దేశస్తులను గౌరవిస్తుంటారు.

ఇలా అన్నీ పాటిస్తూ, అన్నిటినీ గౌరవిస్తూ, తాను కేవలం మానవుడ్ని, మానవ జాతికి చెందిన వాడిని అన్నది మర్చిపోయారు. ఎంతసేపూ తాను ఈ కులస్తుడ్ని, ఈ మతస్తుడ్ని, ఈ దేశస్తుడ్ని అని భావిస్తారే తప్ప మానవుడ్ని అన్న భావం వుండదు. అందరూ వేరు వేరు కులస్తులు, మతస్తులు, దేశస్తులు అని భావిస్తారే తప్ప అంతా ఒకటే, అంతా మానవులే అని భావించరు. అలాగే తాను ఈ కులస్తుడిని, ఈ మతస్తుడిని, ఈ దేశస్తుడిని అని చెప్పకుని గర్విస్తారు. సంతోషపడుతుంటారు. అంతే కాని మానవుడ్ని అని భావించరు.

తాను ఫలానా అని భావిస్తూ ఇతరులను ద్వేషిస్తూ వుంటారు. స్వార్థంగా ప్రవర్తిస్తూంటారు. కానీ అంతా ఒకటే అని అందరినీ ప్రేమించరు. నిస్వార్థంగా ప్రవర్తించరు. సృష్టి రహస్యాన్ని గుర్తించరు. భగవంతుని ఆశయాన్ని గుర్తించరు. పైగా భగవంతుడంటే ఇష్టమంటారు. ఆయనకు అంతా సమానమంటారు. ఆయనకు అంతా సమానమైనపుడు ఆయన్ను ఇష్టపడే తాము అందరినీ సమానంగా చూడరు, గౌరవించరు, ప్రేమించరు. ఎంతసేపూ వారు ఇతరులు అన్న భావంతో మోసగిస్తారు. అవమానిస్తారు. నష్టపరుస్తారు. కష్టాలు పాలు చేస్తారు. దోచుకుంటూ వుంటారు. అంతా సమానమన్న భావం లేకుండా తామే అధికులమన్న భావంతో ఆధిక్యం ప్రదర్శిస్తుంటారు. ఇతరులను చులకనగా, హీనంగా

చూస్తుంటారు.

ఇలా ప్రవర్తించటానికి ముఖ్య కారణం మానవుడు కుటుంబం, కులం, మతం, ప్రాంతం, దేశం అన్న వాటిలో బందీ కావడమే. ఈ బంధాల నుండి ఎంతకాలం బయటపడడో అంతకాలం మానవుని ప్రవర్తన అంతా వేరు వేరు అన్నట్టుగానే వుంటుంది.

అలా మానవుడు ఎంతకాలం సృష్టి రహస్యాన్ని అర్థం చేసుకోడో అంతా ఒకటే అని అర్థం చేసుకోడో అంతకాలం దుఃఖపడుతూనే వుంటాడు. దుఃఖంలో జీవిస్తూనే వుంటాడు. ఈ దుఃఖంలోంచి బయటపడాలంటే ఖచ్చితంగా అంతా ఒకటే అన్న సృష్టి రహస్యాన్ని అవగతం చేసుకోవాలి. ఆ జ్ఞానాన్ని పొందాలి.

మరి ఆ జ్ఞానం పొందాలంటే ముందు తాను చిక్కుకున్న కులం, మతం, దేశం అన్న బంధాల నుండి బయటపడాలి. స్వేచ్ఛను పొందాలి. అప్పుడే అతనికి జ్ఞానం లభిస్తుంది. అప్పుడే అతను స్వేచ్ఛా జీవి. స్వేచ్ఛగా జీవిస్తున్నట్టు. అలాంటివాడే అందరూ ఒకటే అని ప్రవర్తించగలడు. ఏ మాత్రం ఎందులో అతడు బందీయై వున్నా అతడు స్వేచ్ఛా జీవి కాలేడు!

మరి ఇటువంటి వాటి నుండి బయట పడాలంటే ముఖ్యంగా నేను ఫలానా అనే అహంకారం, ఫలానాది నాది అనే మమకారం పోవాలి. అవిపోయే దాకా మానవుడు స్వేచ్ఛా జీవి కాలేడు. మరి నేను, నాది పోవాలంటే ఒక్కటే మార్గం. అదే ధ్యానం. ధ్యానం విశేషంగా చేస్తుంటే నేను, నాది అన్నది పోయి అంతా ఒక్కటే అన్న సత్యం అవగతమవుతుంది. అప్పుడే అందరినీ ప్రేమించగలడు. అందరినీ సమానంగా చూడగలడు. స్వేచ్ఛగా జీవించగలడు.

## ధ్యాన సత్యం

**కోట్లు సంపాదించిన వారి కంటే, చక్రవర్తి లాంటి పదవులు సంపాదించిన వారి కంటే, గొప్ప పాండిత్యం సంపాదించే కంటే, మోక్ష మార్గంలో (అంటే ధ్యానంలో) ప్రవేశించిన వాడే గొప్పవాడు.**

# "కలిసి జీవించాలి!"

సృష్టిలో ఎన్నో జాతులున్నాయి. అందులో మానవ జాతి చాలా విశిష్టమైనది. ఈ మానవ జాతి ముఖ్యంగా స్త్రీ, పురుషులుగా విభజింపబడ్డారు. అంటే మానవుల్లో స్త్రీలు, పురుషులు అని రెండు రకాల వారు మనకు కనిపిస్తారు. అంటే స్త్రీలైనా, పురుషులైనా అంతా మానవులే. అంతా సమానమే అని తెలుసుకోవాలి.

ఈ మానవులలో స్త్రీ పురుష బేధమే కాదు. ఇంకా అనేక బేధాలు కనిపిస్తాయి. తెలుపు నలుపు, పొడుగు పొట్టి, బలవంతులు బలహీనులు, ఆరోగ్యవంతులు అనారోగ్యులు, అందమైనవారు అంద విహీనులు ఇలా చూసుకుంటూ పోతే ఒకరికీ ఒకరికీ అసలు పోలికే వుండదు. సంబంధమే వుండదు. ఆకారంలో, రంగులో, శక్తిలో తెలివిలో, ఆరోగ్యంలో ఎన్నో వైవిధ్యాలు, తేడాలు కనిపిస్తాయి.

గమనిస్తే ఇంకా తెలివైనవారు, తెలివితక్కువ వారు, ధనికులు పేదలు, అధికారంలో వున్నవారు  అధికారం లేనివారు, ఉద్యోగస్తులు నిరుద్యోగులు,  యజమానులు పనివారు. అలా ఈ మానవులనే ఎన్నో రకాలుగా విభజించి చూస్తున్నారు.  ఇంకా గమనిస్తే కుటుంబాలుగా, కులస్థులుగా, మతస్తులుగా, ప్రాంత వాసులుగా, దేశస్తులుగా కూడా విభజించారు.

కానీ ఏది ఏమైనా అందరూ మానవులే. అందరూ ఒకటే. భగవంతునికి అందరూ సమానమే. కారణం అందరి దేహాలు పంచభూతాలతో తయారు చేయబడినవే. అంతేకాదు అన్ని దేహాలు ఒకే ఆత్మశక్తితో పనిచేస్తున్నాయి. సూక్ష్మంగా పరిశీలిస్తే మానవులలో తేడాలు లేనేలేవు.

ఇంకా గమనిస్తే అందరికీ మనస్సు వుంది. ఎవరికైనా కష్టం కలిగితే బాధ ఒక్కటే. అందరికీ ఆకలి ఒక్కటే. అందరికీ చూసే కళ్ళున్నాయి. వినే చెవులు వున్నాయి. మాట్లాడే నోరు వుంది. పనిచేసే చేతులు, కాళ్ళు వున్నాయి. అందుచేత మానవ జాతి అంతా ఒకటే. అంతా మానవులే అని తెలుసుకోవాలి.

మానవులకంటే ముందు అందరూ ఆత్మలే. ఆత్మ స్వరూపులే. ఆ స్థితిలో అంతా ఒకటే. ఎవరికి ఏ తేడా వుండదు. కానీ ఈ ఆత్మలు తమ

ఎదుగుదల కోసం, తమ ఉన్నతి కోసం, కొన్ని పాఠాలు నేర్చుకోవడం కోసం, కొన్ని అనుభవాల కోసం, భూమి మీదకు వచ్చి ఈ మానవదేహం ధరించడం జరిగింది. అందుకే మానవుడని పిలువబడుతున్నాడు.

అలా కొన్ని కారణాల వల్ల దేహం ధరించిన మానవునకు భూమి మీద జీవించడానికి దేహానికి కొన్ని అవసరాలు వున్నాయి. మానవుడు భూమి మీద జీవించాలంటే, తన జన్మ లక్ష్యాన్ని సాధించాలంటే కొన్ని తప్పనిసరి నెరవేర్చుకోవలసిన, సమకూర్చుకోవలసిన అవసరాలు వున్నాయి. అవి కూడు, గూడు, గుడ్డ అంటే ఆహారం, బట్ట, ఇల్లు. ఇవే కాకుండా ముఖ్యంగా పురుషునికి స్త్రీ అవసరం వుంది. అలాగే స్త్రీకి పురుషుని అవసరం ఉంది. జీవించడానికి శరీరానికి తిండి, బట్ట, ఇల్లు ఎలా అవసరమో, ప్రకృతి సహజమైన శారీరక వాంఛ తీరటానికి పురుషునికి స్త్రీ, స్త్రీకి పురుషుడు తప్పనిసరి అవసరం.

అందుచేత జీవితంలో మానవుడు ఆహారం, వస్త్రం, గృహం ఎలా సంపాదించుకుంటాడో అలాగే పురుషుడు స్త్రీని, స్త్రీ పురుషుణ్ణి సంపాదించుకుంటారు. ఇది మనం ప్రపంచ వ్యాప్తంగా చూస్తూనే వున్నాం. పుట్టగానే కూడు కోసం ఎలా పరితపిస్తారో అలాగే వయస్సు రాగానే తోడు కోసం ప్రతీ ఒక్కరూ ప్రయత్నిస్తారు. ఒక్కటవుతారు. సంసారంలో ప్రవేశిస్తారు. ఇది ప్రకృతి సహజం.

అలా అవసరాలు తీరగానే మానవుడు తన జీవిత లక్ష్యాన్ని సాధించటానికి ప్రయత్నించాలి. అవసరాల వరకు పరిమితమై జీవితమంటే ఏమిటి? జీవితం దేనికి?జీవితంలో ఏమి సాధించాలి? జీవితం అనుభవించటానికేనా? లేక ఇంకా ఏమైనా సాధించటానికా? అని ఆలోచించి అవి సాధించటానికి కృషి చెయ్యాలి.

కానీ మానవుడు ఇవన్నీ ఆలోచించడం మాని నేను పురుషుణ్ణి, నేను ధనవంతుణ్ణి, నేను అందగాడిని, నేను పదవి వున్నవాడిని, నేను బలవంతుణ్ణి అని అనుకుంటూ తోటి వారిని, ఇతరులను రకరకాలుగా హింసిస్తూ, అవమానిస్తూ మోసగిస్తూ, బాధిస్తూ ఆధిక్యత ప్రదర్శించటానికి ప్రయత్నిస్తున్నాడు.

ఇంకా గమనిస్తే సమాజంలో పురుషులు తమ కంటే స్త్రీలను తక్కువగా చూడటం, హీనంగా చూడటం, అవమానించడం, బాధించడం ఎక్కువగా చూస్తున్నాం. ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడ చూసినా పురుషాధిక్యత

కనబడుతూనే వుంది.

తమ జీవిత లక్ష్య సాధనకు, జీవిత అవసరాలకు అవసరమని తోడైన భార్యను తక్కువగా చూడటం, తనతో సమానమని భావించకపోవడం, వారు తమ లాంటి మానవులేనని భావించకపోవడం చులకనగా చూడటం, హీనంగా చూడటం చూస్తూనే వున్నాం.

సహజంగానే పురుషుడు బలవంతుడు కావడం, తరతరాల నుంచి ఆర్థిక హక్కు కలిగి వుండటం బార్యను తక్కువగా చూడటానికి ముఖ్య కారణమయ్యింది. అందుచేత పురుషుడు స్త్రీని తన అవసరాలకు ఉపయోగించుకోవడమే కాదు. తన కోసమే భార్య అన్నట్టుగా తన సేవకే భార్య అన్నట్టుగా ప్రవర్తిస్తున్నాడు. అంతే కాని ఇద్దరూ సమానమే. సంసారంలో ఇద్దరి అవసరం వుంది. ఇద్దరి పాత్ర సమానం. ఎవరు లేకపోయినా ఇంకొకరు వుండలేరు. జీవించలేరని తెలుసుకోలేకపోతున్నాడు.

ఎంతసేపూ తన బలం, తన ధనం చూసుకుని అధికుడిని అని ప్రవర్తిస్తున్నాడు కానీ ఇద్దరూ మానవులే, ఇద్దరూ ఆత్మ స్వరూపులే ఇద్దరూ సమానమే. ఇక్కడ ప్రదర్శించవలసింది బలం కాదు, తెలివి, ధనం కాదు జ్ఞానం అని తెలుసుకోలేకపోతున్నారు. ఇద్దరూ జ్ఞానసముపార్జనకు భూమి మీదకు వచ్చినవారేనని తెలుసుకోలేకపోతున్నారు.

దీనికి తోడు తరతరాల నుంచి సమాజంలో స్త్రీని, తక్కువగా చూడటం, పుట్టినప్పటి నుండి స్త్రీని మానసికంగా అల్పురాలిగా తయారు చేయడం జరుగుతుంది. అందుచేత స్త్రీ సహజంగానే తాను అబలనని భావించడం, ఏమీ చేయలేనని అనుకోవడం. ఏమీ చెయ్యకపోవడం. చెయ్యటానికి ప్రయత్నించకపోవటం, ఇంటికి, వంటింటికి పరిమితమై పోవడం కూడా చూస్తున్నాం.

కుటుంబంలోనే చిన్నప్పటి నుండీ ఆడ పిల్లలను తక్కువగా చూడటం, అంతే కాదు ఆడపిల్లను కనడమే నష్టంగా భావించడం చూస్తున్నాం. అసలు ఇక్కడి నుండే అంటే జన్మించకుండానే స్త్రీ అవమానించబడుతుంది. తక్కువగా చూడబడుతుంది. తరువాత ప్రతీ సందర్భంలో అడుగడుగునా స్త్రీకి అవమానాలే, తక్కువ చూపులే, సమాన స్థాయి ఎక్కడా ఇవ్వబడలేదు. గమనిస్తే ఇది అందరికీ తెలుస్తుంది.

ఆడపిల్లలు మగపిల్లలు తగువులాడుకుంటే తల్లులే మగపిల్లవాణ్ణి

ఏమీ అనరు. ఆడపిల్లలనే మందలిస్తారు. వాడు మగవాడు మగవాడితో నీకు దెబ్బలాటేమిటి? ఆడపిల్లలు అణుకువగా వుండాలి అంటారు. ఏమైనా ఆటలాడినా, కొన్ని సాహసకార్యాలు చేస్తున్నా, మగరాయుడిలా ఏమిటీ ఆ పనులు? ఆడది ఆడదానిలా ప్రవర్తించాలి అంటారు. అలా నిరుత్సాహ పరుస్తారు. నువ్వు తక్కువ దానివి. అల్పురాలివి నువ్వు ఏమీ చెయ్యలేవు అని ఎప్పటికప్పడు మానసికంగా నిరుత్సాహపరుస్తూనే వుంటారు. ఏ తల్లికూడా మగపిల్లలను నిరుత్సాహ పరచదు. పైగా ప్రోత్సహిస్తుంది కూడా. ఆడది అబలై పోవటానికి ఏ పని చెయ్యటానికైనా ధైర్యం చూపించక పోవటానికి ఇదొక కారణం.

పుట్టినప్పటి నుండి ఎప్పడూ ఒకరి మీద ఆధారపడి జీవించటానికే పుట్టినప్పటి నుండి ప్రోత్సహించబడటం వల్ల, భార్యగా ఎదిగినా కూడా మగని చాటులోనే బ్రతకటానికి ఇష్టపడుతుంది. ఆమె అలాగే ప్రవర్తిస్తుంది.

అలాగే ఆడపిల్ల ఒంటరిగా బయటకు వెళుతుంటే, ఆమె ధైర్యానికి మెచ్చుకోవలసింది పోయి వెంటనే, ఒక్కదానివే ఎలా వెళతావు? జాగ్రత్త కావాలి. ఎవరినైనా తోడు తీసుకు వెళ్ళు అంటారు. అదే మగ పిల్లవాడు వెళితే ఏమీ అనరు. అలా ఆడపిల్లలు చిన్నప్పటి నుండి విని, విని ఎలా తయారయ్యారంటే తాము ఒంటరిగా ప్రయాణం చేయలేనేమోననే భావం బలంగా వారిలో నాటుకు పోయింది. అందుచేత పెళ్ళైయిన వారే కాదు, ఇంకా పెద్ద వారైనా ఒక్కరే ప్రయాణించటానికి భయపడతారు. తోడు కోసం చూస్తుంటారు. కారణం చిన్నప్పటి నుంచి ఇచ్చిన ట్రయినింగే.

ఇంకా ఆడపిల్లలకు ఇచ్చిన ట్రయినింగు ఏమిటంటే! నీ శీలాన్ని కాపాడుకో, స్త్రీకి శీలం ప్రధానం, శీలం పోతే జీవితం వ్యర్థం. వున్నా ఒకటే లేకపోయినా ఒక్కటే అంటారు. ఇది కూడా తరతరాల నుంచి స్త్రీ అబలగా మారటానికి మరొక కారణం. శీలం పోతుందనే భయంతో స్త్రీ ఏమీ చెయ్యలేకపోతుంది. ఎక్కడికి వెళ్ళలేకపోతుంది. దేనికి సాహసించలేక అల్పురాలిగా, అబలగా మిగిలిపోతుంది. పురుషాధిక్య ప్రపంచం 'శీలం' స్త్రీకే ముఖ్యమన్నట్టు పురుషునికి అవసరం లేదనట్టు చిత్రించింది. పురుషునికి 'శీలం' గురించి బోధించరు. చెప్పరు. మరి 'శీలం' అన్నది పురుషునికి అవసరం లేదా? 'శీలం' స్త్రీకి మాత్రమేనా?

శీలం చెడిన స్త్రీ పురుషుడికి పనిచెయ్యకపోతే, శీలం చెడిన పురుషుడు స్త్రీకి ఎలా పనిచేస్తాడు?ఇద్దరూ మానవులే కదా? శీలం ఇద్దరికీ

అవసరమే కదా? అబల కాబట్టి శీలం చెడినా స్త్రీ పురుషుణ్ణి భరించాలి. కాని శీలం చెడితే పురుషుడు మాత్రం స్త్రీని భరించడు. వదిలివేసి ఇంకొక స్త్రీని చేసుకుంటాడు.

సమాజం స్త్రీకి ప్రసాదించిన గొప్ప కానుక 'శీలం'. ఇది పురుషునికి ఇవ్వకుండా స్త్రీకి సమాజం అదనంగా ఇచ్చినవరం అన్నట్టుగా చిత్రించారు. కానీ ఈ భయంతో స్త్రీ ఊహించలేనంత శక్తి హీనురాలయ్యింది. ఆబలగా మారిపోయింది.

అంతేకాదు కొంతమంది పురుష పండితులు కొన్ని పురాణ కథల పేరుతో స్త్రీని ఇంకా అబలగా చేశారు. స్త్రీలు శక్తివంతులైనా శక్తిలేని వారుగా తయారు చేశారు. శీలమే కాదు పాతివ్రత్యాన్ని కూడా స్త్రీలకు అంటగట్టారు. ఎంత వరకు అంటే "సతికి పతియే ప్రత్యక్ష దైవం" అంటే భార్యకు భర్త తప్ప వేరే దేవుళ్ళు లేరన్నట్టుగా వ్రాసారు. భర్తకు దేవుళ్ళున్నారు. వారి భార్యకు మాత్రం భర్తే దేవుడు అని చిత్రించారు. అదే పత్రివ్రతా లక్షణం అని కూడా తెలియచేశారు.

"అహం బ్రహ్మాస్మి" అన్న వేదవాక్కుకి బూజు పట్టించారు. ఎవరికి వారే దైవమైనపుడు ఎవరు ఎక్కువ? ఎవరు తక్కువ? ఇక్కడ ఎక్కువ లేదు, తక్కువ లేదు .కాని ఆ పండితుల కథల ప్రకారం భర్తలు బాధించినా స్త్రీలు మాట్లాడకూడదు. తాగి వచ్చి తన్నినా కూడా భరించాలి. తన దెబ్బలు మరచిపోయి మరల భర్తకు సేవ చెయ్యాలి. భర్త తిట్టినా తాను మాత్రం పల్లెత్తు మాట అనకూడదు. వాడు కుష్టువాడైనా, రోగైనా పనికి రాని వాడైనా భరించాలి, సేవ చెయ్యాలి. కానీ అదే భర్త అయితే భార్యకు ఏమీ చెయ్యడు, పట్టించుకోడు. భార్య పనికి రాకపోతే ఇంకొక వివాహం చేసుకోవటానికి ప్రయత్నిస్తాడు. పిల్లలు లేకపోయినా ఆఖరుకు మగపిల్లలు కలగకపోయినా లోపం భార్యదంటూ ఇంకొక వివాహం చేసుకోవటానికి ప్రయత్నిస్తాడు. ఇంకా పతివ్రతా లక్షణాలు అంటూ స్త్రీకి ఎన్ని ఆంక్షలు విధించారో, ఎన్ని కట్టుబాట్లు విధించారో ఎన్ని నియమాలు ఏర్పాటు చేశారో, ఎన్ని రకాలుగా స్త్రీని అణగదొక్కారో సమాజాన్ని చూస్తే తెలుస్తుంది. సుమతి, సావిత్రి, దమయంతి అంటూ ఏవో కొన్ని కథలు చెప్పి స్త్రీని ఎంత అణగదొక్కాలో అంత అణగదొక్కారు. అబలగా మార్చారు. ఆశక్తురాలిగా తయారు చేశారు. ఏమీ చేయలేని వారిగా స్త్రీని తయారు చేశారు.

కానీ ఆలోచించండి, గమనించండి సమాజం ఇంతలా స్త్రీని అణగ

తొక్కుతున్నా కూడా స్త్రీలు ఎన్ని సాధిస్తున్నారు? ఎన్నో రంగాలలో పురుషులతో సమానంగా ఎదుగుతున్నారు. పోటీ పడుతున్నారు. అసలు అలా అణగతొక్కకుండా వుంటే స్త్రీ, పురుషులు ఇరువురూ సమానమేనన్నది స్త్రీలు ఖచ్చితంగా ఋజువు చెయ్యగలరు. చూపించగలరు. చాటి చెప్పగలరు.

అందుచేత సంసారంలో భార్యాభర్తలిరువురూ సమానమనన్న భావం ఏర్పరచుకోండి. ఎవరూ ఒకరికంటే ఒకరు అధికులు కారు. అసలు ఎవరు అధికులు అన్నది కాదు ఆలోచించవలసింది. జీవితంలో ఏమి సాధించాలన్నది ఆలోచించాలి. లేకపోతే సాధించవలసింది సాధించలేం? సరికదా సంసారంలో సుఖ శాంతులు కూడా వుండవు. సంసారం నరక మవుతుంది.

సంసారమన్నది "కలసి జీవించటానికి కాని కలహించు కోవటానికి కాదు". అందుకే "కలసి వుంటే కలదు సుఖం" అంటారు. ఎప్పుడయితే ఇద్దరూ సమానమేనన్న భావం కలుగుతుందో అపుడు కలహాలు వుండవు. ఇద్దరూ కలిసి జీవిస్తారు. అందుచేత భూమి మీద వున్నంత కాలం "కలిసి జీవించాలి" జన్మ లక్ష్యాన్ని సాధించాలి. దీనికి ధ్యానం చెయ్యాలి. ధ్యానం చేస్తేనే అంతా ఒక్కటేనని అర్థం చేసుకోగలం. "కలిసి జీవించగలం" సంసారాన్ని స్వర్గం చేసుకోగలం. అంటే ఇహలోకంలోనే కాదు. పరలోకంలో కూడా శాశ్వత ఆనందాన్ని పొందుతాం.

## ధ్యాన సత్యం

**పాలల్లో పంచదార కలిపితే పాల ఆకారం మారదు. పాల మాధుర్యం పెరుగుతుంది. అలాగే జీవితంలో ధ్యానం చేస్తే జీవితం మారదు. జీవితంలో మాధుర్యం (ఆనందం) పెరుగుతుంది.**

# "ప్రకృతి నిర్ణయాన్ని గౌరవించాలి!"

మనమంతా భగవంతుడంటే ఇష్టం అంటాం. ఇంకా అడిగితే చాలా ఇష్టం అంటాం. అలా మాటలతో ఇష్టమంటాం. కానీ చేతలలో చూపించం. కానీ చేతల ఇష్టమే నిజమైన ఇష్టం. కాని మాటలతో చెప్పే ఇష్టం నిజమైన ఇష్టం కాదు. అలా మనం చేతలతో భగవంతుని మీద ఇష్టం చూపించం కాని భగవంతుడు మటుకు మన మీద ఇష్టం చూపించాలనుకుంటాం.

ఆలోచించండి సమస్త ప్రకృతి భగవంతుడే కదా? భగవంతుడు కానిది, లేనిది అంటూ ఏదీ లేదు కదా? ఆయన సర్వాంతర్యామి అంటే సర్వత్రా వున్నట్లే కదా? అంతేకాదు ప్రకృతే ఆయనంటారు. ప్రకృతిలో ఏమి జరిగినా ఆయన నిర్ణయం ప్రకారమే కదా? ప్రకృతి నుండి మానవులు ఏమి పొందినా భగవంతుని నుంచి పొందినట్టే కదా?

మరి భగవంతుడంటే ఇష్టమైనపుడు ప్రకృతిలో ఏది జరిగినా అది భగవంతుని నిర్ణయమని గౌరవించాలి, ఆనందంగా స్వీకరించాలి. ప్రకృతి నిర్ణయాన్ని విమర్శించకూడదు. అవమానించకూడదు. అలా చేస్తే భగవంతుని విమర్శించినట్టే. అవమానించినట్టే, అగౌరవపరచినట్టే. అలా చేస్తే ఆయనంటే ఇష్టం లేనట్టే.

భగవంతుని గౌరవించడమంటే ప్రకృతిని గౌరవించడం. కారణం ప్రకృతే భగవంతుడు కనుక. జరిగేవన్నీ ప్రకృతి నిర్ణయం ప్రకారమే జరుగుతుంటాయి. అందుచేత "ప్రకృతి నిర్ణయాన్ని గౌరవించాలి". కానీ మనం దీనికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నాం.

చూడండి ఎక్కువగా వర్షాలు పడుతుంటే ఎన్ని రకాలుగా మాట్లాడతామో అబ్బ ఏమి వర్షాలు పట్టుకుని వదలడం లేదు. ఈ వర్షాలు వస్తే అంతా చిరాకే, పడితే అదే లోకంగా పడతాయి, లేకపోతే అసలుపడవు. అబ్బ ఈ వర్షంలో ఏ పని చేసుకోవాలన్నా కుదరదు అంటూ ఎన్నో రకాలుగా విసుక్కుంటాం. ఒకవేళ వర్షాలు పడకపోయినా విమర్శిస్తాం. ఎండలు మండిపోతున్నాయి. ఈ వానలు ఎప్పుడు పడతాయో! అంటూ! ఎక్కువ చలిగా వుంటే అబ్బబ్బ ఈ చలి చంపేస్తుంది బయటకు రాలేకపోతున్నాం అంటూ ఏమి జరిగినా విమర్శించటం మటుకు మానం.

అంటే ప్రకృతిని విమర్శిస్తున్నట్టే కదా! ప్రకృతి నిర్ణయాన్ని ఆహ్వానించకపోతే వ్యతిరేకిస్తున్నట్టే కదా! అంటే భగవంతుని విమర్శిస్తున్నట్టే కదా?

అలాగే ఒక భూకంపం వచ్చినా, తుఫాను వచ్చినా, రకరకాల ప్రకృతి వైపరీత్యాలు వచ్చినా రకరకాల విమర్శలు చేస్తుంటాం. కానీ అన్నీ ప్రకృతి నిర్ణయమని గ్రహించాలి.

భగవంతుని ఇష్టపడేవారు భగవంతుని నిర్ణయాన్ని కూడా ఇష్ట పడాలి అంగీకరించాలి. ముందు ఇది నేర్చుకోవాలి. అంటే ప్రకృతిలో జరిగే ప్రతీదాన్ని స్వీకరించాలి. ఆహ్వానించాలి, గౌరవించాలి. ఆఖరుకు మన జీవితంలోనైనా సరే, మన చుట్టు ప్రక్కలైనా సరే, ఏది జరిగినా, ఏ సంఘటన జరిగినా ప్రతీదీ ప్రకృతి నిర్ణయమే. అన్నిటికీ కారణముంటుంది. అంతా న్యాయమే జరుగుతుంది. అన్యాయమనేది లేనేలేదు. ప్రకృతిలో జరిగేది అంతా న్యాయమే. ప్రకృతి నిర్ణయం సరైనదే అంటే భగవంతుని నిర్ణయం సరైనదే అని తెలుసుకోవాలి.

అలా ప్రకృతి నిర్ణయం గౌరవించడం నేర్చుకుంటే మనం ఎప్పడూ లాభమే పొందుతాం. విమర్శించితే అంటే భగవంతుని విమర్శిస్తే నష్ట పోయేది మనమే. భగవంతుని నిర్ణయాన్ని విమర్శించే స్థాయిలో మనం వున్నామా? మనం అంత ఎదిగిపోయామా? అలా అయితే ఆయన్ని అన్నీ ఎందుకు కోరుతున్నాం? ఎందుకు ఆరాధిస్తున్నాం? ఆయన్ను ఎందుకు వేడుకుంటున్నాం. గొప్పవాడనే కదా అన్ని చేస్తున్నాం. గొప్పవాని నిర్ణయాలు ఎప్పడూ తప్పకావు, విమర్శనాత్మకంగా వుండవు. ఇది అందరూ తెలుసుకోవాలి.

మనం ప్రకృతిని ఎంత వరకు అర్థం చేసుకుంటున్నాం? ప్రకృతి గురించి మనకు ఎంత తెలుసు? ప్రకృతి పట్ల మన కర్తవ్యం ఏమిటి? అసలు ప్రకృతి అంటే ఏమిటి? ప్రకృతి పట్ల మన బాధ్యత ఏమిటి? మన బాధ్యత మనం సరిగ్గా నిర్వర్తిస్తున్నామా? ప్రకృతి నుంచి ఆశించే ముందు ప్రకృతికి మనం ఇవ్వవలసింది ఇస్తున్నామా? మనం ప్రకృతిని గౌరవిస్తే, సహకరిస్తే ప్రకృతి మనకు సహకరించదా? మన హింసాత్మకమైన చర్యలే ప్రకృతి అస్తవ్యస్త చర్యలకు కారణమని అర్థం చేసుకున్నామా? అందుచేత ముందు మనల్ని మనం విమర్శించుకోవాలి. మనలో లోపాలు వెతుక్కోవాలి. మనల్ని మనం సరిచేసుకోవాలి. దానికి ధ్యానం చెయ్యాలి. ధ్యానం చేస్తే ప్రతీదాన్ని అంగీకరిస్తాం. అన్నిటిని గౌరవిస్తాం. జరిగే ప్రతీదానికి కారణం వుంటుందని తెలుసుకుంటాం. “ప్రకృతి నిర్ణయాన్ని గౌరవించగలుగుతాం”. ప్రకృతి సహకారాన్ని పొందగలుగుతాం. సకాల వర్షాలు, పుష్కల పంటలు, పాడితో సస్యశ్యామలమే. అందరం సుఖ సంతోషాలతో జీవిస్తాం.

# "దేవుళ్ళు మనకోసమే వున్నారా?"

మనం అనుకుంటాం. దేవుళ్ళంతా మనకోసమే ఉన్నారని మనకు వరాలివ్వడం, మనకు సంపదలివ్వడం, మన సుఖాలు చూడటమే ఆ దేవుళ్ళ పని అని అనుకుంటాం. అంతకన్నా ఆలోచించం. ఎందుకంటే అసలు దేవుళ్ళకి మనకు సంబంధమేమిటి? మన గురించి దేవుళ్ళు ఎందుకు ఆలోచించాలి? మన గురించే ఆలోచించాలన్నది మన హక్కా? ఇలాంటివి ఎన్నో ఆలోచించాలి.

అసలు అన్ని కోట్ల మందిలో మనం ఎంత? దేవుళ్ళకు మనవల్ల జరిగే మేలు ఏమైనా వుందా? అని ఆలోచించం. మనకి వ్యాపారంలో లాభ, నష్టాలు వస్తే దేవుళ్ళకి వచ్చే లాభమేమిటి? నష్టమేమిటి? ఇదంతా దేవుని లోకమే కదా? లోకంకోసం మనమెపుడైనా ఖర్చుపెట్టామా? మనకి జబ్బు చేసి బాధ పడుతున్నాం. దేవుడు ఎందుకు ఆదుకోవాలి? లోకంలో అనారోగ్యంతో బాధపడేవారికి మనమెపుడైనా సాయపడ్డామా? లోక కళ్యాణం కోసం మనమేమైనా పాటు పడుతున్నామా? మన వల్ల లోకానికేమైనా మంచి జరుగుతుంటే అపుడు దేవుడు ఆదుకోవడంలో అర్థం వుంది. కానీ, మన స్వార్థంతో లక్షలు కోట్లు గడించడానికి, అన్యాయంగా, అక్రమంగా సంపదలు ఆర్జించడానికి, సాటి ప్రజలను మోసగిస్తూ, సాటి జీవులతో వ్యాపారం చేసి, హింసిస్తూంటే, ఆదుకోవాలా ఇవన్నీ ఆలోచించనక్కరలేదా?

ఇంకా దేవుళ్ళు మనకి సాయం చెయ్యాలి మనం మాత్రం ఎవరికి సాయం చెయ్యం, వాళ్ళు మనకి ఐశ్వర్యం ఇవ్వాలి కాని మనం ఎవరికీ పైసా ధర్మం చెయ్యం. దేవుళ్ళు మనకి రోగాలు లేకుండా చెయ్యాలి మనం మాత్రం ఇతరులను, ఇతర జీవులను హింసించకుండా వుండం. మన జీవితం ఆనందంగా ఉండాలి. కాని మనం మాత్రం ఎవరిని ఆనందంగా ఉండనివ్వం. అలా నిర్దాక్షిణ్యంగా, స్వార్థంగా, ప్రేమ రహితంగా బ్రతికేవారికి దేవుడి దయ కోరే హక్కు ఎక్కడిది? మన క్రూర కర్మలు, పాప కార్యాలకు కష్టాలు రాకుండా దేవుళ్ళకు ముడుపులు, లంచాలు మాత్రం ఇస్తుంటాం. మనం ఏమి ఇచ్చినా స్వీకరించి అనుగ్రహించడానికే దేవుళ్ళున్నారా?

ఆలోచించడండి దేవుళ్ళు మనం ఇచ్చే డబ్బు ఏమి చేసుకుంటారు?

అసలు ఈ సృష్టి అంతా వారిదే కదా? అసలు మనం ఇచ్చే కానుకల వైపు దేవుళ్ళు చూస్తారా? అసలు వీటిని దేవుళ్ళు తీసుకుంటున్నారా? మనం ఇచ్చే పులిహోరలు, దద్ధోనాలు, లడ్డూలు, వడలు దేవుడికి ఇష్టమా? అసలు మన ఇష్టాలనే భగవంతుడి ఇష్టాలుగా చేస్తున్నాం. కాని మనం ఇవ్వదగ్గ ప్రేమను మాత్రం ఇవ్వం. అసలు ఆ ప్రేమ మన దగ్గర ఉంటే కదా ఇవ్వటానికి?

సాటి మనిషికి, జీవులకు ఇవ్వలేని ప్రేమ దేవునికి మాత్రం ఎలా ఇస్తాం? అందుచేత "దేవుళ్ళు మన కోసమే వున్నారనే అభిప్రాయం మూర్ఖమైనది. వారు అందరి వారు. వారికి అందరూ సమానమేనని తెలుసుకుని అందరినీ ప్రేమించాలి. అంతే కాని వాడు ఆ కులస్థుడు వీడు యీ మతస్థుడు, వాడిది ఈ దేశం అంటూ వేరు, వేరుగా చూడకూడదు. ద్వేషించకూడదు. అలాగే అల్పుడని, బలహీనుడని, స్త్రీ అని తక్కువగా చూడకూడదు. అందరినీ మనతో సమానంగా భావించాలి. ఎవరికి కష్టం, నష్టం, బాధ కలిగించ కూడదు. అప్పడే జీవితం ఆనందమయమవుతుంది. అంతే కాని దేవుళ్ళు నా కోసమే వున్నారనుకుంటూ పాపాలు చేస్తే జీవితం దుఃఖమయమవుతుంది. ఇదంతా అర్థం కావాలంటే ధ్యానం చెయ్యాలి.

మనం బాధలలో ఉన్న వారికి సాయం చేస్తే పరలోకంలో ఉన్న దేవతలు మనకు సాయం చేస్తారు. అంటే వారు రథం ఎక్కి ఇక్కడకు దిగి వచ్చి మనకు సాయం చేస్తారని కాదు, మన మంచితనం, పదింతలై మరో రూపంలో మనకు అందుతుంది. అది ప్రకృతి ధర్మం. సృష్టి ధర్మం. అంతే కానీ అందులో దేవుళ్ళ హస్తం ఉండదు. అంటే దేవుళ్ళు మన కోసమే లేరు. దేవుళ్ళు అందరివారు. వాళ్ళకు రాగద్వేషాలు వుండవు. వారికి అంతా సమానం. అందుచేత మన మంచే మనల్ని రక్షిస్తుంది. మన చెడే మనల్ని శిక్షిస్తుందని తెల

**ధ్యాన సత్యం**

**విత్తనములో గొప్ప వృక్షం వుంది. కొయ్యలో అగ్ని వుంది.**

**ఆ విధంగానే శరీరంలో ఆత్మ వుంది.**

**ధ్యాన సాధనతో దానిని తెలుసుకోవచ్చు.**

# కోరడమా? యాచించడమా?

లోకంలో మానవులు ఎన్ని వున్నా, ఎంత వున్నా దేవుళ్లను ఇంకా కోరుతూనే వుంటారు. అలా కొంతమంది పూజ చేసి కోరతారు. కొంతమంది ప్రార్థనతో కోరతారు. కొంతమంది నమాజు చేసి కోరతారు. వారి నమ్మకమేమిటంటే దేవుడు శక్తి స్వరూపుడు, ఆయన ఏమైనా చెయ్యగలడు. ఏమైనా ఇవ్వగలడని భావిస్తారు. అటువంటి దేవుణ్ణుంచి తాము కోరుకున్నవి పొందాలంటే ముందు ఆయన్ను ప్రసన్నం చేసుకోవాలి. దానికి పూజ, ప్రార్థన. నమాజులే మార్గమని భావిస్తారు. అప్పడే ఆయన అనుగ్రహిస్తాడని వారి నమ్మకం. చివరకు ఏ మార్గమైనా అందరూ చేసేది ఒక్కటే. తమకు ఎన్ని వున్నా ఇంకా, ఇంకా కావాలని కోరడమే.

ఈ మతాల గురించి కొందరు చెపుతుంటారు. "మార్గాలు వేరైనా గమ్యం ఒక్కటే" అని. కానీ అసలు సత్యం ఏమిటంటే "మార్గాలు వేరైనా అందరి ఉద్దేశ్యం ఒక్కటే" అదే కోరడం.

మరి ప్రపంచంలో అందరూ దైవాన్ని తమదైన శైలిలో కోరుతూనే వున్నారు. కానీ తాము ఏమి చేస్తున్నారో ఆలోచించడం లేదు. ఎందుచేతనంటే అసలు కోరడం అంటే ఏమిటో తెలుసుకోవాలి. కోరడమంటే "కష్టపడకుండా పొందాలనుకోవడం, ఇవ్వకుండా పుచ్చుకోవాలనుకోవడం" అంటే కోరడంలో కష్టపడడం వుండదు, ఇవ్వడం ఉండదు. అలా ఇవ్వకుండా, కష్టపడకుండా కోరేదాన్ని సమాజంలో యాచించడం అంటారు. అంటే మన ఇంటికి కాని, షాపుకు గాని ఎవరైనా వచ్చి ఏమీ ఇవ్వకుండా, మన దగ్గర ఎటువంటి కష్టం చేయకుండా కోరితే వాడిని యాచకుడు అంటాం. అందుచేత ఏమీ కష్టపడకుండా, ఇవ్వకుండా కోరే దానిని కోరడం అనరు 'యాచించడమే' అంటారు.

కొంతమంది అనవచ్చు సరే అంతటి గొప్పదేవుణ్ణి అడగడంలో తప్పేమిటి? అడగందే అమ్మయినా పెట్టదు కదా? అంటారు. కానీ దేవుణ్ణి యాచించడంలో తప్ప లేదు. దేవుడే కాదు ఎవరిని యాచించినా తప్ప లేదు. కానీ మనం మనల్ని యాచించే వాళ్లను చాలా హీనంగా చూస్తాం? అలాగే దేవుణ్ణి యాచించే వారు ఆయన దృష్టిలో తక్కువగానే లెక్కించబడతారు. ఎవరైనా దేవుని దృష్టిలో గొప్పవారు కావాలి కానీ తక్కువ కాకూడదు.

అలాగే అడగందే అమ్మైనా పెట్టదు కదా? అంటారు. కానీ అమ్మకు, దేవుడికి పోలికెక్కడ. అమ్మ వేరు, దేవుడు వేరు. అమ్మ సామాన్యమైన మానవుడు, కానీ దేవుడు శక్తి స్వరూపుడు. అమ్మే అడుగుతూ వుంటుంది. కానీ దేవుడు ఎవరినీ అడగవలసిన పని లేదు. అందుచేత అమ్మ వేరు, దేవుడు వేరు అని తెలుసుకోవాలి. అమ్మను దేవుడితో పోల్చలేం. దేవుణ్ణి అడగవలసిన పని లేదు. ఆయన్ను అడగకుండానే ఆయన్నుంచి పొందగలం? ఎలా? చేయవలసింది చేస్తే. అందుకే "చేసుకున్న వాడికి చేసుకున్నంత మహదేవ" అంటారు. అందుచేత దేవుణ్ణి అమ్మతో పోలుస్తూ అడగడం తప్పు కాదని సమర్థించుకుంటూ, దేవుని దృష్టిలో తక్కువ కాకూడదు. ఆయనకు అన్నీ తెలుసు.

కొంతమంది అనుకోవచ్చు. మేము కొండ ఎక్కుతున్నాం. కష్టపడి పూజ చేస్తున్నాం. కష్టపడి దండాలు పెడుతున్నాం. ప్రదిక్షణలు చేస్తున్నాం. సాష్టాంగ ప్రమాణం చేస్తున్నాం. ఇదంతా కష్టమే కదా? అలాగే కొబ్బరికాయ ఇస్తున్నాం. అరటిపళ్ళు ఇస్తున్నాం. హుండీలో డబ్బులు వేస్తున్నాం. ఇవన్నీ ఇస్తున్నట్టే కదా? అందుచేత మేము యాచించినట్టు ఎలా అవుతుంది? అనవచ్చు.

కానీ గమనిస్తే మనల్ని యాచించేవాడు కూడా ఎంతో కష్టపడతాడు. ఎక్కడి నుండో కష్టపడి నడుచుకుని వస్తాడు. మనం గుడి, గుడికీ తిరిగినట్టు ఇంటి ఇంటికీ తిరుగుతాడు. గట్టిగా అరుస్తాడు. దండాలు పెడతాడు. అంటే మన కష్టం కూడా వాడి కష్టం లాంటిదే. కానీ నిజమైన కష్టమెలా అవుతుంది? చేతులు చాపకుండా కష్టపడి సంపాదించే దానిని కష్టమంటారు. కాని చేతులు చాపేదాన్ని యాచించడమంటారు.

అలాగే కొబ్బరికాయ ఇస్తున్నాం, అరటిపళ్ళు ఇస్తున్నాం అంటారు. కానీ ఆలోచించండి. మన ఇంటికి వచ్చి ఎవరైనా కొబ్బరికాయ కొడితే, అరటిపళ్ళు పెడితే వాడు కోరింది ఇస్తామా? కచ్చితంగా ఇవ్వం. మనలా కోట్లు, నోట్లు, కార్లు కోరకపోయినా, లక్షలు అడగకపోయినా వందలు అడిగినా ఇవ్వం. అంటే కొబ్బరికాయ కొడితేనే వందలు ఇస్తే అందరూ మీ ఇంటికి వచ్చి కొబ్బరికాయలు కొట్టరా? చిన్న కొబ్బరికాయకు పెద్ద కారు ఎలా వస్తుంది? అలాగే చిన్న కొబ్బరికాయకు వంద రూపాయలు ఎలా ఇస్తాం? అందుచేత కొబ్బరికాయ మన కోరికలకు పరిష్కార మార్గం కాదని తెలుసుకోవాలి. కొబ్బరికాయ అన్నది ఇవ్వడం కాదు. అసలు భూమి మీద వున్న సంపదలు ఎవరివి? ఆయనవే కదా! ఆయన ఇచ్చినవే కదా?

సృష్టి ధర్మమేమిటంటే మానవుడు ఏది ఇస్తే అదే సృష్టి నుండి వస్తుంది., ఎంత ఇస్తే అంతే వస్తుంది. అందుచేత 'పొందాలంటే ఇవ్వాలని' తెలుసుకోవాలి. స్వార్థంతో ఇస్తే ఇచ్చింది సగం పోతుంది. అందుకే చూడండి కొబ్బరికాయ ఇస్తే సగం చిప్పే కదా వస్తుంది? ఆరు పళ్ళు ఇస్తే మూడు పళ్లే వస్తాయి. కాస్త గమనిస్తే ఇది మనకు తెలుస్తుంది.

కొంచెం ఆలోచించండి కొబ్బరికాయకే కారు, వేలు, లక్షలు వచ్చేస్తే కొట్టువాడు మనకెందుకు అమ్ముతాడు. కాయలు అన్నీ వాడే కొట్టేస్తాడు. వాడు కోటీశ్వరుడు అయిపోడా! కష్టపడి రోజంతా కూర్చుని మనకు అమ్ముతాడా? కాయలు మనకు అమ్మటానికి వాడేమైనా తెలివి తక్కువవాడా? మనకన్నా వాడే తెలివైనవాడు, మన అజ్ఞానాన్ని సొమ్ము చేసుకుంటున్నాడు. లాభం వేసుకుని మరీ అమ్ముతున్నాడు. ఈ విషయం మనం గ్రహించలేకపోతున్నాం.

తెలుసుకోండి మనం కోరేది "కోరడం కాదు యాచించడం". అందుచేత దేవుని నుంచి పొందాలంటే ఏం చెయ్యాలో తెలుసుకోవాలి. ఇంకా లోతుగా ఆలోచించాలి.

మనకు కొన్నే ఎందుకు వస్తున్నాయి? కొన్నే ఎందుకు పొందు తున్నాం? మనం ఇలా వుండటానికి కారణం ఏమిటి? కష్టాలు ఎందుకు వున్నాయి? మనకు లేనివి భగవంతుని లోకం నుంచి పొందాలంటే ఏం చెయ్యాలి? ఇవన్నీ ఆలోచించాలి. ముఖ్యంగా భగవంతుని లోకం నుంచి పొందాలంటే రెండే మార్గాలు 1) కష్టపడడం, 2) ఇవ్వడం.

కష్టపడటం అంటే కష్టపడి ధ్యాన సాధన చెయ్యడం.

ఇవ్వడమంటే ఏది కావాలో అది ఇవ్వాలి. ఆనందం కావాలంటే అందరినీ ఆనందింప చెయ్యాలి. శాంతి కావాలంటే అందరినీ శాంతిగా బ్రతకనివ్వాలి. ధనం కావాలంటే అందరికీ ధనాన్ని పంచాలి. ఆరోగ్యం కావాలంటే ఎవరినీ బాధించకూడదు. కష్టపెట్టకూడదు. జీవహింస చెయ్యకూడదు. హింసచేసి ఇతర జీవులను బాధిస్తే తిరిగి మనం రోగాలతో బాధపడవలసి వస్తుంది.

అంతే కాదు దుఃఖం ఇస్తే దుఃఖం వస్తుంది. నష్టాన్ని కలుగచేస్తే నష్టం వస్తుంది. అందుచేత భగవంతుని సృష్టి ధర్మం అర్థం చేసుకోవాలి. "ఇస్తేనే వస్తుంది. కోరితే రాదు". అందుచేత ఇవ్వడానికి ప్రయత్నించాలి. కష్టపడి ధ్యానం చెయ్యాలి. గీతలో శ్రీకృష్ణ భగవానుడు నిష్కామకర్మ చెయ్యమన్నాడు కదా! ధ్యానం చేస్తే కోరం. యోగులులా ఇవ్వగలుగుతాం.

# "ఆరాధన - అనుగ్రహము!"

ఆరాధించేది మానవుడు. అనుగ్రహించేది భగవంతుడు. ఆరాధన మానవునిది. అనుగ్రహం భగవంతునిది. అందుచేత ఆరాధన మానవుని ఇష్టం. అనుగ్రహం భగవంతుని ఇష్టం.

లోకంలో ఎవరిని చూసినా అంతా తమ కష్టాలు, సమస్యలు, దుఃఖం పోవాలని భగవంతుని ఆరాధిస్తున్నారు. గమనిస్తే ఎవరు ఎన్ని రకాలుగా ఆరాధించినా తాము కోరుకున్నవిధంగా మాత్రం జీవితం వుండటం లేదు. కష్టాలు తీరడం లేదు. దుఃఖం పోవట్లేదు. కోరికలు నెరవేరడం లేదు. అందుకే మానవులు ఫొటోలు మారుస్తున్నారు. మతాలు మారుస్తున్నారు. అంటే భగవంతుని అనుగ్రహం పొందలేదని అర్థమవుతుంది.

మానవులు తమ ఇష్టం వచ్చినట్టు ఆరాధిస్తూ అనుగ్రహించటం లేదని భగవంతుడు తాను చెప్పినట్టు వినలేదని కోపగిస్తూ, ఫొటోలు మారుస్తూ భగవంతుని మీద చర్య తీసుకుంటున్నారు. ఆలోచించండి అదేనా చెయ్యవలసింది? అంతకన్నా ఆలోచించవలసింది లేదా? అంటే కచ్చితంగా వుంది.

మానవుల ప్రవర్తన ఎలా వుందంటే ఎంతసేపూ తమలో లోపం లేనట్టు, లోపమంతా భగవంతునిదే అన్నట్టు ప్రవర్తిస్తున్నారు.

ఇక్కడ గమనిస్తే అవసరం మానవుడిదే కాని, భగవంతునిది కాదు. ఎందుచేతనంటే "భగవంతుని అనుగ్రహం మానవులకు కావాలి కాని మానవుల పూజ, ప్రార్థన భగవంతునికి అవసరం లేదు". అవసరం మానవులకే కాని భగవంతునికి కాదు. అందుచేత మానవులు ముందు ఈ ప్రశ్న వేసుకోవాలి.

"అనుగ్రహం కోసం ఆరాధన పుట్టబడిందా? ఆరాధన కోసం అనుగ్రహం ప్రవేశపెట్టబడిందా"? ఆలోచిస్తే అనుగ్రహం కోసమే భూమిమీద ఆరాధన వచ్చిందని తెలుస్తుంది. అంటే అవసరం మానవులదే కాని భగవంతునిది కాదు. అంటే భగవంతుని అవసరం మానవులకే వుంది

కాని మానవుల అవసరం భగవంతునికి లేదు అని తెలుస్తుంది. అవసరం మానవులదైనపుడు మానవులే భగవంతునికి నచ్చేటట్లు, భగవంతుడు మెచ్చేటట్లు ప్రవర్తించాలి. అంతేకాని మానవులకు నచ్చినట్లు భగవంతుడు ఎలా వుంటాడు?

మానవుల కోరికలు నెరవేరకపోవటానికి కారణం, భగవంతునికి నచ్చేటట్లు, భగవంతుడు మెచ్చేటట్లు మానవుడు ప్రవర్తించక పోవడమే. ఆలోచిస్తే కారణం ఇదేనని ఖచ్చితంగా అర్ధం అవుతుంది. అంటే లోపం మానవులలోనే వుంది కాని భగవంతునిలో లేదు. అందుచేత "సరిచేసుకోవలసింది మానవుల ప్రవర్తననే కానీ, సరిచేయవలసింది భగవంతుని ఫోటో కాదు." అంటే "ఫోటోలు మార్చడం కాదు. మతాలు మార్చడం కాదు. మానవుని ప్రవర్తన మార్చుకోవాలి."

మానవుని ప్రవర్తన అంటే ఆరాధన. ఆరాధనలో లోపాన్ని సరిచేసుకోవాలి. మరి ఆరాధనలో లోపాన్ని సరిచేసుకోవాలంటే ముందు భగవంతుడు ఎవరో తెలుసుకోవాలి. ఆయన శక్తిని, ఆయన తత్వాన్ని అర్థం చేసుకోవాలి. దానికి తగ్గట్టు ప్రవర్తించాలి. ఆరాధించాలి.

మరి భగవంతుడంటే విగ్రహం కాదు, ఫోటో కాదు. ఆయన సర్వాంతర్యామి. అందరిలో అంతర్యామిగా వ్యాపించి వున్నాడు. ఎలా అంటే ఆత్మ రూపంలో అంటే అందరిలో వున్న ఆత్మే భగవంతుడు. అందుచేత ఆత్మ ఆరాధన చెయ్యాలి. అదే సరైన ఆరాధన. అంతరంలో వున్న ఆత్మను అంటే భగవంతుని ఆరాధించాలంటే అంతర్ముఖులు అవ్వాలి. అంటే ధ్యానం చెయ్యాలి.

ధ్యానం చెయ్యడమంటేనే భగవంతుని ఆరాధించడం. ధ్యానం చేస్తే జీవితం మీద మంచి అవగాహన ఏర్పడుతుంది. ఎన్నో సత్యాలు తెలుసుకుంటాం. సరైన రీతిలో సవ్యంగా జీవిస్తాం. తప్పలు, పాపాలు చెయ్యం. కర్మలు కూడా రహితమవుతాయి. జీవితంలో కష్టాలు వుండవు. అసలు అనుగ్రహం కోసం ప్రయత్నించవలసిన పనే వుండదు.

అంతేకాని మానవుడు తనకు నచ్చినట్టు ఆరాధించడం వల్ల ప్రయోజనం లేదు. అందుచేత పూజ, ప్రార్థన నమాజుల వల్ల ప్రయోజనం లేదని తెలుసుకోవాలి. ధ్యానం చెయ్యాలి.

# భగవంతునికి ఆగ్రహ అనుగ్రహాలు వుంటాయా?

లోకంలో సహజంగా భగవంతునికి ఆగ్రహం, అనుగ్రహం వుంటాయని భావిస్తాం. అంటే ఆరాధించకపోతే అంటే పూజ కాని, ప్రార్థన కాని చెయ్యకపోతే భగవంతునికి కోపం వస్తుందని, ఆయన ఆగ్రహించి మనకు కష్టాలు కలుగచేస్తాడని భావించి ఏ రోజైనా పూజ కానీ, ప్రార్థన కానీ చెయ్యకపోతే భయపడతాం. అంటే భగవంతునికి ఆగ్రహం వుందని అనుకుంటాం.

అలాగే పూజ కానీ, ప్రార్థన కానీ చేస్తే భగవంతుడు ఆనంద పడతాడు. మనల్ని అనుగ్రహిస్తాడని కూడా భావిస్తుంటాం.. అందుచేత క్రమం తప్పకుండా పూజ, ప్రార్థన చేస్తూంటాం. అంటే భగవంతునికి ఆగ్రహం, అనుగ్రహం వున్నాయని భావిస్తున్నట్టేగా?

కానీ అసలు భగవంతునికి ఆగ్రహ, అనుగ్రహాలు వున్నాయా? ఈ విషయం మనం తప్పకుండా ఆలోచించాలి? ఎందుకంటే నిజంగా భగవంతునికి ఆగ్రహ, అనుగ్రహాలు వుంటే ప్రస్తుతం మనం ప్రవర్తించే తీరు కరక్టు! కానీ భగవంతునికే కనుక ఆ రెండూ లేకపోతే భగవంతుని విషయంలో మనం ప్రవర్తించే తీరు మార్చుకోవాలి. సరిచేసుకోవాలి.

ఎందుచేతనంటే ఆగ్రహానుగ్రహాలు లేనపుడు పూజ, ప్రార్థన చెయ్యకపోతే భగవంతుడు ఆగ్రహిస్తాడని భావించడం అర్థరహితమవు తుంది. అలాగే అనుగ్రహిస్తాడని అవి చేస్తూ ఆశపడుతూ, ఎదురు చూడటం, కోరికలు నెరవేరకపోతే ఫోటోలు మార్చడం-మతాలు మార్చడం కూడా అర్థరహితమే అవుతుంది. అందుచేత ముందుగా, ముఖ్యంగా భగవంతునికి ఆగ్రహ, అనుగ్రహాలు వుంటాయా? వున్నాయా? అన్నది తెలుసుకోవాలి.

అది తెలుసుకోవాలంటే దానికంటే ముందు అసలు భగవంతునికి రాగద్వేషాలు వుంటాయా? వుండవా? అన్నది తెలుసుకోవాలి. మరి భగవంతునికి రాగ ద్వేషాలు వుంటాయా అంటే ఖచ్చితంగా వుండవు. అవి వుంటే ఆయన భగవంతుడే కాదు. రాగద్వేషాలు అన్నవి మనకే వుంటాయి. కారణం మనం మన వారి పట్ల అనురాగం, అంటే మన కుటుంబం, మన కులం, మన మతం మన ప్రాంతం, మన దేశం పట్ల అనురాగం. అలాగే ఇతరుల పట్ల ద్వేషం అంటే ఇతర కుటుంబీకులు, ఇతర కులస్తులు, ఇతర మతస్తులు, ఇతర దేశస్తుల పట్ల ద్వేషం వుంటాయి. వుండటమే కాదు

ప్రదర్శిస్తున్నాం కూడా.

అందుచేత మన వారిని ప్రేమిస్తాం. ఇతరులను ద్వేషిస్తాం. దీనికి కారణం మనం అంతా వేరు వేరు అని భావించడమే. కానీ భగవంతునికి మాత్రం అంతా సమానం. ఆయనకు అంతా ఒకటే. అంతా ఒకటైనపుడు ఆయన ఎవరిని ప్రేమిస్తాడు? ఎవరిని ద్వేషిస్తాడు? అందుచేత భగవంతునికి రాగద్వేషాలు వుండవని ఖచ్చితంగా చెప్పవచ్చు.

ముఖ్యంగా మనం గమనించవలసింది ఏమిటంటే "అనురాగమున్న చోటే అనుగ్రహము వుంటుంది". "ద్వేషమున్న చోట ఆగ్రహముంటుంది". అంటే "అనురాగం లేకపోతే అనుగ్రహం వుండదు". "ద్వేషం లేకపోతే ఆగ్రహం వుండదు".

కొంచెం గమనిస్తే మనం మన పిల్లల్ని అనురాగంతో చూస్తాం. ఇతరుల పిల్లల్ని, పని పిల్లల్ని ద్వేషిస్తాం. అందుకే మన పిల్లల మీద ఎప్పుడూ మన అనుగ్రహం వుంటుంది. వాడు అడగకపోయినా ఎన్నో ఇస్తాం. ఎన్నో సమకూరుస్తాం. వారి కోసం కష్టపడతాం కూడా. కానీ ఇతరుల పిల్లల మీద, పని పిల్లల మీద ఉండే ద్వేషం, కారణంగా వారికి మన అనుగ్రహం వుండదు. వారు అడిగినా కూడా ఇవ్వం. వారికి ఏమీ సమకూర్చం. వారి కోసం కష్టపడం. సరికాదా వారి ప్రవర్తన సరిగా లేకపోయినా, వారి వల్ల నష్టం కలిగినా ఆగ్రహించి కఠినంగా దండిస్తాం. కారణం వారి పట్ల ద్వేషభావమే. అందుచేత "ద్వేషమున్న చోటే ఆగ్రహముంటుంది. అనురాగమున్న చోట అనుగ్రహముంటుందని" కచ్చితంగా మనం తెలుసుకోవచ్చు.

మరి భగవంతునికి రాగద్వేషాలు లేవు కాబట్టి ఆయనకు ఆగ్రహ అనుగ్రహాలు కూడా ఖచ్చితంగా వుండవు. అందుచేత పూజ, ప్రార్థన చెయ్యకపోతే ఆగ్రహిస్తాడని భయపడవలసిన పని లేదు. ఆయన ఎవరినీ ఆగ్రహించడు. ఎవరినీ అనుగ్రహించడు. మనమే అవి వుంటాయనుకుంటూ పూజ, ప్రార్థన, నమాజు మానటానికి భయపడుతున్నాం. ప్రతిరోజూ క్రమం తప్పకుండా పూజ, ప్రార్థన చెయ్యటానికి ప్రాముఖ్యం ఇస్తున్నాం. అన్నిటి కంటే వాటికే ప్రాముఖ్యం ఇస్తున్నాం. అంతకన్నా ఆలోచించడం లేదు.

అలా గుడ్డిగా నమ్ముతూ కోరికలు నెరవేరకపోతే అనుగ్రహించలేదని ఆయన మీద మనమే ఆగ్రహిస్తూ, ఫోటోలు

మారుస్తున్నాం. మతాలు మారుస్తున్నాం. మనకు నచ్చిన దేవుడంటే ఇష్టం. ఆయనకే మన అనుగ్రహం లభిస్తుంది. అంటే మన పూజలు, ప్రార్ధనలు లభిస్తాయి. మిగతా దేవుళ్లకు అవి లభించవు సరికదా వారి ఫోటో చూడగానే మనకు ఆగ్రహం కలుగుతుంది. కొత్త ఇంటికి మారినపుడు ఆ ఇంట్లో ఆ ఫోటో వుంటే తీసివేస్తాం. అంటే ఆగ్రహానుగ్రహాలు మనకే వుంటాయి. అంతేకాని భగవంతునికి కాదు అని తెలుసుకోవాలి. ఆయన అనుగ్రహం కోసం చేసే పూజ, ప్రార్థన, భజన అన్నీ వ్యర్థమేనని తెలుసుకోవాలి. అలాగే ఆయన ఆగ్రహిస్తాడని భయపడటం కూడా అర్థరహితం.

భగవంతుడు సాక్షీభూతుడు. అన్నిటినీ సాక్షిగా గమనిస్తూ వుంటాడు. "చేసుకున్న వాడికి చేసుకున్నంత మహదేవ" అన్నదే ఆయన సూత్రం. మంచి చేసుకున్న వారికి మంచి. చెడు చేసుకున్న వారికి చెడు అన్నదే ఆయన సూత్రం. ఇది మనం అర్థం చేసుకుని పూజకు, ప్రార్థనకు, భజనలకు ప్రాముఖ్యం ఇవ్వకుండా మంచి చెయ్యటానికి ప్రాముఖ్యం ఇవ్వాలి.

ప్రస్తుతం మన పరిస్థితి ఎలావుందంటే మొదట అనుగ్రహం కోసం పూజ, ప్రార్థన ప్రారంభిస్తాం. తరువాత అది అలవాటుగా మారుతుంది. చివరకు ఆ అలవాటు మానటానికి భయపడతాం. ఎంతవరకు ఆలోచిస్తామంటే భగవంతుడు అవి చెయ్యకపోతే ఆగ్రహిస్తాడనుకుంటారు. కష్టాలు కలగచేస్తాడని కూడా అనుకుంటాం.

అంతేకాదు మనం ఇతర కులస్తులను, ఇతర మతస్తులను ద్వేషిస్తాం. వారితో కలహం లేకపోయినా వారంతా చెడ్డవారన్నట్టు వారంటే ఆగ్రహంతో వుంటాం. అందుచేత మనం కూడా భగవంతుని లాగే రాగ ద్వేషాలకు అతీతంగా వుండాలి. కారణం అంతా ఒక్కటే కనుక. అంతా ఒక్కటైనపుడు ఎవరి మీద ప్రత్యేకమైన అనురాగముంటుంది? ఎవరిని ద్వేషించగలం?

మనకు కూడా ఎవరిమీదా అనురాగం ఉండకూడదు. ఎవరి మీద ఆగ్రహం వుండకూడదు. దగ్గర వారని అధికంగా చూడకూడదు. ఇతరులని తక్కువగా చూడకూడదు. భగవంతుని లాగే రాగద్వేషాలు లేకుండా ప్రవర్తించాలి. ఇది మనకు ఆచరణలోనికి రావాలంటే మనకు సాధ్యం కావాలంటే సృష్టిలో అంతా ఒకటేనని తెలుసుకోవాలి. ఈ సత్యం మనకు తెలియాలన్నా ఈ జ్ఞానం మనకు కలగాలన్నా ధ్యానం ఒక్కటే మార్గం. అందుచేత తప్పనిసరిగా ధ్యానం చెయ్యాలి.

# "లోకా సమస్తా సుఖినోభవన్తు!"

ముఖ్యంగా భగవంతుని ప్రార్థించేటపుడు చాలామంది "లోకా సమస్తా సుఖినోభవన్తు ఓం శాంతిః, శాంతిః శాంతిః"! అని అంటారు. అంటే లోకంలో అందరూ సుఖంగా శాంతిగా ఉండాలనే వీరి ఉద్దేశ్యాన్ని అలా ప్రార్ధన ద్వారా వ్యక్తం చేస్తారు.

గమనిస్తే లోకంలో అంతా సుఖంగా వుండాలని అలా పార్థిస్తారే కానీ అంతకన్నా ఆలోచించలేరు. అసలు వారి ప్రవర్తన వారు ప్రార్థించినట్టుగా వుంటుందా? అంటే వుండదు. కారణం ఎవరిని చూసినా స్వార్థంతో అందరినీ అన్ని రకాలుగా దోచుకుంటున్నారు. కష్టనష్టాలకు గురిచేస్తున్నారు. అలా ప్రవర్తించే వారు లోకం సుఖంగా ఉండాలని కోరుకోవడంలో అర్థం ఏముంది?

ఎందుచేతనంటే ప్రార్ధన ముఖ్యం కాదు. చేతలు ముఖ్యం. ప్రార్థన మన ఉద్ధేశ్యాన్ని సూచించదు. చేతలే మన ఉద్ధేశ్యాల్ని సూచిస్తాయి. కారణం మన ఉద్ధేశ్యాన్ని బట్టే మన ప్రవర్తన ఉంటుంది. మరి మన ప్రవర్తనతో ఎవరిని సుఖంగా ఉండనిస్తున్నాం? అలాంటపుడు మనం చేసే ప్రార్థన మన నోటి నుండి వచ్చే మాటలు అసత్యమే కదా? భగవంతుని దగ్గర అసత్యం పలుకుతూ మనకేదో గొప్ప ఆశయమున్నట్టుగా భావించడం ఎంత అవివేకం. అందుచేత "మాటలు కాదు. చేతలు ముఖ్యమని" తెలుసుకోవాలి. ప్రార్థన కాదు ఆచరణ ముఖ్యం. అందరూ సుఖంగా వుండాలని ప్రార్థిస్తే భగవంతుడు మెచ్చుకోడు. అందరిని సుఖంగా వుండనిస్తేనే భగవంతుడు మెచ్చుకుంటాడు.

భగవంతునికి మటుకు చెపుతున్నాం లోకంలో అందరినీ సుఖంగా వుండేటట్లు చూడు అని. ఆలోచించండి భగవంతునికి మనం చెప్పకపోతే ఆయన ఎవరినీ సుఖంగా ఉండనివ్వడా? మనం చెబితేనే ఆయన అందరినీ సుఖంగా ఉండనిస్తాడా? అసలు ఆయనకు చెప్పవలసిన అవసరం వుందా? చెప్పవలసింది ఎవరికి? లోకాన్ని సుఖంగా వుండనివ్వాలని తెలుసుకోవలసింది ఎవరు? తెలుసుకోవలసిన వాడు. అన్ని తెలుసున్న వాడికి సలహా ఇస్తున్నాడు. ఎంత విచిత్రం మానవుల ప్రవర్తన.

ఆలోచించండి అలా ప్రార్థించే వారంతా అందరినీ సుఖంగా శాంతిగా వుండనిస్తే అసలు ప్రార్థనే అవసరం లేదు కదా? ఆలోచించండి అసలు లోకం సుఖంగా వుండనిది ప్రార్థించేవారివల్లా? లేక భగవంతుడి వల్లా? కొంచెం ఆత్మవిమర్శ చేసుకుంటే ప్రార్థించేవారి వల్లేనని తెలుస్తుంది. ఎందుచేతనంటే దొడ్లోకోడిని సుఖంగా ఉండనిస్తున్నామా? చెరువులో

చేపని సుఖంగా వుండనిస్తున్నామా? ఎవరిని సుఖంగా వుండనిస్తున్నాం? పైగా లోకా సమస్తా సుఖినోభవన్తు! అని ప్రార్థిస్తున్నాం. అలా చేస్తూ ప్రార్థించడంలో అర్థముందా? అందుచేత ప్రార్థన కాదు ఆచరణ ముఖ్యమని తెలుసుకోవాలి.

భగవంతుడు అందరూ బాగుండాలని, తాను సృష్టించిన లోకం ఎప్పుడూ సుఖంగా వుండాలని ప్రయత్నిస్తూనే వుంటాడు. కాని మానవులే తమ స్వార్థం కోసం తమ స్వలాభం కోసం, తమ ఆనందం కోసం లోకాన్ని, లోకం లోని ఇతర మానవులను, జీవులను రకరకాలుగా దోచుకుంటున్నారు. హింసిస్తున్నారు. సుఖం లేకుండా చేస్తున్నారు.

"లోకా సమస్తా సుఖినోభవన్తు" అని ప్రార్థిస్తున్నామంటే అసలు మన ఉద్దేశమేమిటి? అందరూ సుఖంగా ఉండాలనేగా? అటువంటపుడు అందరి సుఖం కోసం పాటుపడాలి. అలా పాటుపడినపుడే భగవంతునికి ఆనందం. అంతే కాని ప్రార్థించినంత మాత్రాన భగవంతుడేమీ మెచ్చుకోడు.

"లోకా సమస్తా సుఖినోభవన్తు!" అనడం కాదు. లోకంలో అందరినీ అన్ని జీవులను సుఖంగా జీవించనివ్వాలి. సమస్త జీవులు భగవంతుని లోకంలోనివే. భగవంతుని రూపాలే. మరి అన్ని జీవులు సుఖంగా వుండాలంటే ఏ జంతువుని ఏ పక్షిని చంపకూడదు అంటే మాంసభక్షణ మానాలి. అప్పడే మనం చేసే ప్రార్థనకి అర్థం వున్నట్టు. ఎందుచేతనంటే మన ఉద్దేశ్యాన్ని ఆచరణలో చూపిస్తున్నాం కనుక. సర్వాంతర్యామి అయిన భగవంతుడు అన్నీ గమనించగలడు. మన ప్రవర్తన బట్టి మన ఉద్దేశాన్ని కూడా తెలుసుకోగలడు. అందుచేత ప్రార్థన కాదు. ప్రవర్తన ముఖ్యమని" తెలుసుకోవాలి.

ఇక్కడ గమనిస్తే అంతా ప్రార్థించగలుగుతున్నారు కానీ ఆచరించ లేకపోతున్నారు. కారణం ఆ శక్తి వారి దగ్గర లేదు. మరి అలా ఆచరించగలిగే శక్తి రావాలంటే ధాన్యం చెయ్యవలసిందే. ధ్యానం చెయ్యకపోతే ఎంతకాలమైనా మాటలే వుంటాయి తప్ప చేతలు వుండవు. అందుచేత "ఆదర్శవైన మాటలు కంటే ఆదర్శవైన చేతలు ముఖ్యమని" తెలుసుకోవాలి.

## ధ్యాన సత్యాలు

**మామూలు మనస్సుతో కానీ, కళ్ళతో కానీ కొంచెం వరకే తెలుసుకుంటాం. కానీ మనస్సులేని ధ్యాన స్థితిలో పొందే దివ్య జ్ఞాన చక్షువుల ద్వారా సర్వం తెలుసుకుంటాం. సృష్టి మొత్తాన్నే తెలుసుకుంటాం.**

# "ఆస్తికుడు! - నాస్తికుడు!"

సహజంగా మనం భగవంతుడు వున్నాడు అనే వారిని ఆస్థికులుగా భగవంతుడు లేడనే వారిని నాస్థికులుగా భావిస్తాం. విగ్రహారాధన చేసేవారిని, పూజలు, భజనలు, స్తోత్రాలు, జపాలు చేసేవారిని ఆస్థికులనుకుంటాం. మిగిలిన వారిని నాస్తికులంటాం.

కాని నిజమైన ఆస్థికుడెవరంటే భగవంతుడు వున్నాడనే వాడు కాదు, భగవంతుడు చెప్పింది ఆచరించే వాడే నిజమైన ఆస్థికుడు. ఎందుచేతనంటే భగవంతుని నమ్మేవారు ఆయన చెప్పింది కూడా నమ్మాలి. ఆయన చెప్పింది నమ్మినపుడు వాటిని ఆచరించాలి. అలా కాకుండా వాటిని ఆచరించనపుడు భగవంతుడు చెప్పింది నమ్మనట్టే కదా? భగవంతుడు చెప్పింది నమ్మనపుడు ఆయనను నమ్మనట్టే కదా! ఆయనను నమ్మనివాడు నాస్తికుడే కదా?

ప్రస్తుతం ఆస్థికులనుకునేవారంతా ఆస్థిక ముసుగులో వున్న నాస్తికులే. నిజమైన ఆస్థికులెవరంటే భగవంతుడు చెప్పింది ఆచరించేవారు.

భగవద్గీత, శ్రీ కృష్ణభగవానుడు ఆచరించడానికి చెప్పాడు కాని పారాయణ చెయ్యటానికి కాదు. కాని మనం ఆచరించకుండా పారాయణ చేస్తున్నాం. అంటే భగవంతుడు చెప్పింది చెయ్యటం లేదు. ఇంకా కొన్ని ఉదాహరణలు చూద్దాం.

1. భగవంతుడు మరణానంతర జీవితం ఉందని చెప్తే మనం మరణానంతర జీవితం లేనట్లుగా ప్రవర్తిస్తున్నాం.

2. చనిపోయిన వారి గురించి కానీ, చనిపోయే వారి గురించి కాని చింతించ వద్దు అని అంటే అందరి గురించి చింతిస్తున్నాం.

3. భగవంతుడు మనల్ని యోగికమ్మంటే మనం భోగి అవుతున్నాం.

4. భగవంతుడు మనల్ని నిర్గుణిడిగా అవ్వమంటే మనం గుణాలతోనే జీవిస్తున్నాం.

5. ఆత్మే నేను అని అంటే దేహమే నేను అనుకుంటున్నాం.

6. ఎవరిని వారే ఉద్దరించుకోవాలంటే నువ్వే ఉద్ధరించు అంటున్నాం.

7. ఏ పనైనా నిష్కామంగా చెయ్యమంటే ఫలితం ఆశించే

చేస్తున్నాం.

8. కర్మ చెయ్యడానికే అధికారం ఉందంటే కర్మ చెయ్యడం మానివేసి ఫలితం ఆశిస్తున్నాం.

9. సమర్పించే భావం ప్రధానం అంటే సమర్పించే వాటికి ప్రాధాన్యత ఇస్తున్నాం.

10. జీవహింస చెయ్యవద్దంటే జీవుల్ని చంపి మాంసం తింటున్నాం.

11. ఎదుటవాని కష్టం నీ కష్టంగా భావించమంటే మన సుఖం కోసం ఎదుట వారిని కష్టపెడుతున్నాం.

12. "నేను ఆత్మను" అని ఆయన అంటే ఆత్మను వదలి విగ్రహాన్ని పట్టుకున్నాం."

అంతేకాదు. ఇంకా ఆలోచించండి భగవంతుడు అసత్యాలు పలకమని చెప్పాడా? మోసగించమని చెప్పాడా? అధర్మంగా ప్రవర్తించమని చెప్పాడా? అందరికి కష్టనష్టాలు కలిగించమని చెప్పాడా? జీవహింస చేయమని చెప్పాడా? పాపాలు చెయ్యమని చెప్పాడా? చెప్పనిది చేస్తున్నాం. చెప్పింది చేయటం లేదు. అలా భగవంతుడు చెప్పింది చెయ్యకపోతే ఆయన్ను నమ్మనట్టేగా? ఆయన్ను నమ్మని వాడు నాస్థికుడేగా? అందుచేత తెలుసుకోండి. భగవంతుడు చెప్పింది చేసేవాడే ఆస్థికుడు. మిగిలిన వారంతా నాస్థికులే. మరి మనం ఆస్థికులు అవ్వాలంటే భగవంతుడు చెప్పింది ఆచరించగలగాలి. ఆ శక్తి మనకు రావాలంటే ఆయన చెప్పినట్లు యోగి అవ్వాలి. యోగి అవ్వాలంటే ధ్యానం చెయ్యాలి. ధ్యానం చేస్తేనే నిజమైన ఆస్థికులం కాగలం.

## తెలుసుకోండి

**పొగడ్తల కోసం చూసేవారందరికీ మిగిలేది నరకం.**

**కాటిలో వేసే శవాలు కడుపులో వేయకూడదు**

# "సర్వాంతర్యామి!"

భగవంతుడు సర్వాంతర్యామి సర్వ వ్యాపి అని అంటాం. అంటే అన్నిటా, అంతటా వున్నాడని చెపుతాం.

మరి భగవంతుడు అంతటా, అన్నిటా వున్నప్పడు మనం ఒక్క విగ్రహాన్నే? ఎందుకు పవిత్రంగా చూస్తున్నాం? మిగిలిన వాటిని వేటినీ ఆ భావంతో ఎందుకు చూడం?

అన్నీ భగవంతుడైనపుడు అన్నిటినీ పవిత్రంగా చూడాలి. అసలు ఇంతటి సృష్టిలో ఒక విగ్రహం ఎంత? చాలా చాలా స్వల్పశాతం కదా? మరి స్వల్ప శాతాన్ని గౌరవించి అధిక శాతాన్ని అగౌరవపరుస్తున్నట్లే కదా?

ఆయనలో ఒక చిన్ని భాగాన్ని పవిత్రంగా చూసి, అత్యధిక భాగాన్ని అగౌరవ పరిస్తే ఆయన్ను ఏదో కొద్దిగా గౌరవించి ఎక్కువ అగౌరవపరుస్తున్నట్టేగా? ఎక్కువ సమయం ఆయనకు దుఃఖమేగా మనం కలిగిస్తున్నాం!

ఎందుచేతనంటే మనతో ఎవరైనా కాసేపు సరదాగా మాట్లాడి, మిగిలిన రోజంతా రుసరుసలాడుతూ కోపంగా వుంటే, ఎక్కువ సమయం బాధ కలిగించి చాలా అల్ప సమయం సంతోష పెట్టినట్టేగా? అలా అల్ప సమయం సంతోషపెట్టినా ప్రయోజనమేముంటుంది. మనల్ని ఎప్పడూ సంతోష పెట్టినప్పడేగా మనకు ఆనందం. అలాగే మనలో ఒక భాగానికి సేవ చేసి మిగిలిన భాగానికి కష్టం కలిగిస్తే మనకు ఆనందం ఎలా కలుగుతుంది? పూర్తి శరీరానికి సేవ చేస్తేనే మనకు ఆనందం.

అలాగే భగవంతునికి పూర్తి ఆనందాన్ని కలిగించాలంటే సమస్త సృష్టినీ ప్రేమించాలి. అన్నింటిని పవిత్రంగా చూడాలి. అప్పడే భగవంతునికి ఆనందం. ఏదో ఆయనలో ఒక భాగమైన చిన్న విగ్రహాన్ని, ఫోటోను పవిత్రంగా చూస్తే, గౌరవిస్తే ఆయన్ను పూర్తిగా గౌరవించినట్టా? ఎక్కువ భాగం అగౌరవ పరచి బాధ కలిగిస్తున్నాం. చాలా స్వల్పశాతం ఆనందం కలిగిస్తున్నాం. అలా చేస్తే ప్రయోజనమేమిటి?

అందుచేత సమస్తమూ భగవంతుడే అని తెలుసుకోవాలి. అంతా ఆయనే అని తెలుసుకోవాలి.. విగ్రహం అంటే భగవంతునిలో స్వల్పాతి

స్వల్పమైన భాగమని గుర్తుంచుకోవాలి. విగ్రహాన్నే కాదు సమస్త సృష్టిని ప్రేమించాలి. విగ్రహం దగ్గరే పవిత్రంగా కాదు అన్ని చోట్లా పవిత్రంగా ఉండాలి. సమస్త మానవులతో, జీవులతో స్నేహభావం కలిగివుండాలి. అన్నిటికి సేవ చెయ్యాలి. వేటినీ హింసించకూడదు. అన్ని జీవులను, ప్రాణులను ప్రేమించాలి. వేటిని చంపకూడదు. మాంసభక్షణ చెయ్యకూడదు. అలా చేస్తేనే ఆయన సర్వాంతర్యామి అని అర్థం చేసుకున్నట్టు.

ఈ సత్యం ధ్యానం చేస్తేనే అర్థమవుతుంది. ధ్యానం చెయ్యకపోతే విగ్రహమే భగవంతుడంటాం. మిగిలినవన్నీ భగవంతుడు కాదన్నట్లు ప్రవర్తిస్తాం. అందుచేత ధ్యానం చేసి భగవంతుడు సర్వాంతర్యామి అని తెలుసుకోవాలి.

## ధ్యాన సత్యాలు

**గుడ్డలు, పేరుమార్చుకుంటే యోగి కాదు. ధ్యానం చేస్తేనే యోగి.**

**ధ్యానసాధన సరిగా చేయకుండా ఫలితాలు ఆశించటం చెట్టు పూర్తిగా పెరగకుండా ఫలాలు ఇవ్వాలని ఆశించడం లాంటిది.**

**'అహం' మే బ్రహ్మ, అంతేకాని అహంకారం బ్రహ్మ కాదు.**

# "ఆత్మ చింతన చెయ్యాలి!"

సహజంగా లోకంలో బాల్యం అన్నది ఆటపాటలతో గడపటానికి, యవ్వనం అన్నది శారీరక వాంఛలు తీర్చుకోవటానికి, సుఖాలు అనుభవించటానికి, భోగభాగ్యాలు సమకూర్చుకుని జీవిత మాధుర్యం అనుభవించటానికని భావిస్తుంటారు. అందుచేత అన్నీ అనుభవించాక శక్తి సన్నగిల్లినపుడు ఏమీ చేయలేనపుడు, మాత్రమే భగవత్ చింతన చెయ్యాలని భావిస్తూ వుంటారు.

దీనికి కారణం తర తరాల నుంచి పెద్దలు ఈ రకంగా ప్రవర్తించటమే. అందువల్ల అంతా అలాగే ప్రవర్తిస్తున్నారు. అందుచేత ముసలి వయస్సు వచ్చిన తరువాత భగవంతునికి సంబంధించిన పనులు చెయ్యటం, అలాంటి కార్యక్రమాలలో పాల్గొనడం చేస్తున్నారు. అంటే పూజలు, భజనలు, ప్రార్థనలు, జపాలు చేస్తూ ఆధ్యాత్మిక చింతన చేస్తున్నామని భావిస్తుంటారు.

కానీ ఆధ్యాత్మికత అంటే ఏమిటో? ఆధ్యాత్మిక చింతన అంటే ఏమిటో? అది ఎప్పుడు చెయ్యాలో? ఎందుకు చెయ్యాలో సరైన అవగాహన లేదు. అందుచేత కొంచెం తెలుసుకుందాం. ఆధ్యాత్మిక చింతన అంటే విగ్రహాన్ని పూజించడం కాదు. ఫోటో పెట్టి భజన చెయ్యడం కాదు. మన కష్టాలు, కోరికలు తీర్చమని ప్రార్థించడం కాదు. ఆధ్యాత్మిక చింతన అంటే ఆత్మ గురించి అధ్యయనం చెయ్యటం. ఆత్మ గురించి తెలుసుకోవటానికి ప్రయత్నించటం. ఆత్మకు సంబంధించిన జ్ఞానాన్ని కలిగి వుండటం. నిరంతరం ఆత్మ దృష్టిలో వుండటం. ఆత్మోన్నతికి కృషి చెయ్యడం, ఇదే నిజమైన ఆధ్యాత్మికత.

ఆత్మగురించి, ఆత్మజ్ఞానం గురించి ఎప్పుడో ముసలి వయస్సులో తెలుసుకోవడం కాదు. ఎందుచేతనంటే మనకి కావలసిన ఆరోగ్యం, శాంతి, ఆనందం, నిర్భయత్వం, జ్ఞానం, మంచి గుణాలు, మంచి అలవాట్లు, మంచి నడవడిక ఆత్మ పరిజ్ఞానం వున్నప్పడే లభిస్తాయి.

అంటే జీవిత మాధుర్యం అనుభవించాలన్నా, జీవితంలో ఆనందం పొందాలన్నా చిన్నప్పటి నుండే ఆధ్యాత్మిక చింతన వుండాలి. అసలు మానవుడంటే కనబడే దేహం అనుకుంటున్నాం. కానీ దేహంతో పాటు మనస్సు, ఆత్మ అనేవి కూడా వున్నాయి అన్నిటికీ మూలం ఆత్మ. ఆత్మశక్తి వల్లే దేహం ఇంద్రియాలు సమస్తం పనిచేస్తున్నాయి. దేహంలో జరిగే అనేక

క్రియలకు ఆత్మే కారణం

ఎందుచేతనంటే దేహం నుండి ఆత్మ తప్పు కుంటే దేహం శవం అవుతుంది. అంటే కళ్ళు చూడలేవు. నోరు మాట్లాడలేదు. చెవులు వినలేవు. చేతులు, కాళ్ళు పనిచెయ్యలేవు. కనీసం ఒక గడ్డి పరకను కూడా కదల్చలేం. దీనిని బట్టి మనం ఈ పనులన్నీ చెయ్యటానికి కారణం ఆత్మశక్తే అని అర్థం అవుతుంది. అంతేకాదు ఆత్మవల్లే మనకి ఈ వైభవం కలిగింది. ఇన్ని పనులు చెయ్యగలుగుతున్నాం. ఇన్ని సుఖాలు, భోగాలు అనుభవిస్తున్నాం. మనం ఇవన్నీ అనుభవిస్తున్నా వీటికి కారణం ఆత్మేనని తెలుసుకోలేక పోతున్నాం.

అలాంటి ఆత్మను మనం మరచి పోతున్నాం. కనీసం ఆత్మ వుందనే సంగతి కూడా మనకి తెలీదు. మనం ఎంతసేపూ ఆహారానికి లోటు లేకుండా వుంటే చాలనుకుని ఆహారాన్ని సమకూర్చు కోవటానికి మన శక్తి యుక్తులన్నీ వినియోగిస్తున్నాం. జీవితమంతా వెచ్చిస్తున్నాం. ఎంతసేపూ కడుపులో నచ్చిన ఆహారం వెయ్యడానికి చూస్తున్నాం. కానీ పడేసిన ఆ ఆహారాన్ని ఎవరు జీర్ణం చేస్తున్నారు? ఎవరు శక్తిగా మార్చి ఆ శక్తిని శరీరమంతా వ్యాపింప చేస్తున్నారు? పనికి రాని మలినాల్ని విసర్జించడం లాంటి వెన్నో కార్యక్రమాలు ఎవరు జరిపిస్తున్నారో తెలుసుకోవట్లేదు. కాని అన్నీ ఆత్మే, అంతా ఆత్మేనని తెలుసుకోవాలి.

లోపల ఎంత మంచి ఆహారం వేసినా ఆ శక్తి లేకపోతే ఈ పనులన్నీ జరగవని గ్రహించలేక పోతున్నాం. అందుచేత ఆహారం వేయడం కంటే వీటిని నడిపించే ఆత్మశక్తి వృద్ధి చేసుకోవడం ముఖ్యమని తెలుసుకోవాలి. ఆ ఆత్మ శక్తే శరీరంలో లోపిస్తే ఆహారం వేసినా ప్రయోజనం లేదని తెలుసుకోవాలి.

అందుచేత మనం పెంచుకోవలసింది, సమకూర్చుకోవలసింది భోగభాగ్యాలు కాదు, పేరు ప్రఖ్యాతులు కాదు, డబ్బు సంపదలు కాదు ఆత్మశక్తి. ఆ ఆత్మశక్తే లేనపుడు ఇవన్నీ ఎన్ని వున్నా అన్నీ వ్యర్థమే. అందుచేత ముందుగా మూలమైన ఆత్మశక్తిని పెంచుకోవటానికి ప్రయత్నించాలి.

మరి ఆత్మశక్తిని పెంచే మార్గం ఒక్కటే అదే ధ్యానం.

ఆత్మశక్తిని పెంచే ఆధ్యాత్మిక చింతన అంటే ఆత్మ చింతన అన్నది ముసలి వయస్సులో కాదు. చిన్న నాటి నుండే అని తెలుసుకోవాలి. ధ్యానం చెయ్యాలి. జీవితాన్ని ఆరోగ్యంతో ఆనందమయం చేసుకోవాలి.

# "ఎవరు, ఎవరిని పూజిస్తున్నారు!"

పూజలో పూలు, పత్రాలు, పళ్ళు సమర్పిస్తాం. అలా పూలు, పత్రాలు, పళ్ళు ఇచ్చి భగవంతుని పూజిస్తున్నాం. ఒక రకంగా ఇవ్వడాన్నే పూజించడం అంటున్నాం.

కాని గమనిస్తే మానవుడు భగవంతునికి ఇవ్వడం లేదు. భగవంతుడే మానవునకు ఇస్తున్నాడు. అందుచేత మానవుడు భగవంతుణ్ణి పూజించడం కాదు. భగవంతుడే మానవుణ్ణి పూజిస్తున్నాడు.

కారణం మానవునికి ఇవ్వబడినవన్నీ భగవంతుడు ఇచ్చినవే. అలా అన్నీ ఇచ్చి భగవంతుడు మానవుణ్ణి పూజించవలసిన అవసరమేముంది? అనిపిస్తుంది. కాని ఆలోచిస్తే ఎందుకు అన్నది తెలుస్తుంది. ఎందుచేతనంటే మానవుడు భగవంతుణ్ణి పూర్తిగా మరచిపోయాడు. నా గురించి తెలుసుకో, నన్ను గుర్తుంచుకోమనే అన్నీ ఇస్తున్నాడు.

కారణం మానవుడు ఎంతసేపూ భగవంతుణ్ణి కోరుతున్నాడు కాని భగవంతుడు గురించి తెలుసుకోవటానికి ప్రయత్నించడం లేదు. గంటలు గంటలు పూజిస్తూ, ప్రార్థిస్తూ కోరడానికి జీవితమంతా వెచ్చిస్తున్నాడు కాని ఆ భగవంతుని గురించి తెలుసుకోవటానికి కనీసం కొంత సమయమైనా కేటాయించడం లేదు. తినటానికి, సంపాదించటానికి, వినోదానికి, వ్యర్థకాలక్షేపానికి రోజంతా వెచ్చిస్తున్నాడు కాని కనీసం రోజులో ఆ భగవంతుని గూర్చి తెలుసుకోవటానికి ఒక గంట సమయమైనా కేటాయించలేకపోతున్నాడు.

అసలు మానవునకు భగవంతుని శక్తి గూర్చి కాని, ఆయన వల్ల తాను పొందే లాభాల గురించి కాని అవగాహన లేదనే చెప్పాలి. ఆయన వల్ల తాను ఎన్ని ప్రయోజనాలు పొందుతున్నాడో, ఎన్ని లాభాలు పొందుతున్నాడో, ఆయన చేసే ఉపకారాలు ఏమిటో అసలు గ్రహించనే లేదని చెప్పవచ్చు.

అవి గ్రహించకపోవడమే కాకుండా ఇంకా అల్పమైన అశాశ్వతమైన కారులు, టి.విలు, మేడలు, నగలు, అలంకారాలు, దుస్తులు, ధనం లాంటివి కోరుతున్నాడు.. వాటిని పొందటానికి ప్రయత్నిస్తున్నాడు.. వాటి కోసమే జీవితమంతా వెచ్చిస్తున్నాడు.

అంత గొప్పవాడైన భగవంతుని పొందడానికి కాకుండా ఆయన నుంచి పొందటానికి ప్రయత్నిస్తున్నాడు. అంటే మానవుడు భగవంతుడ్ని ఇష్టపడడం లేదు. భగవంతుడ్నించి ఇష్టపడుతున్నాడు. అంటే మానవునికి "భగవంతుడు కాదు ఇష్టం. ఆయన సృష్టిలోనివి ఇష్టం". "తండ్రి కాదు తండ్రి ఆస్తి ఇష్టం", అంటే "భగవంతుడు కాదు ఆయన ఆస్తే ఇష్టం".

ఇన్ని లాభాలు పొందుతూ మానవుడు ఆయన్ను పూర్తిగా మరచిపోయాడు. ఆయన్ను ఆరాధించడం మాని ఎంతసేపూ రాయితోనో, చెక్కతోనో చెక్కబడిన విగ్రహాలు మీదే దృష్టి వుంచుతున్నాడు. అవే భగవంతుడనుకుంటున్నాడు. అంతే కానీ ఆయన శక్తిని, ఆయన ఉనికిని, సత్యమైన ఆయన ఆత్మ తత్వాన్ని అర్థం చేసుకోవడం లేదు. ఆత్మ మీద దృష్టి వుంచడం లేదు.

అందుకే భగవంతుడు మానవులను పూజిస్తున్నాడు. నాయన లారా నేను విగ్రహం కాదు, ఫొటో కాదు, నేను ఆత్మరూపంలో మీలోనే వున్నాను. నన్ను గుర్తించండి. నా వునికిని తెలుసుకోండి. నేను మీలోపలే వున్నాను. నేను బయటలేను. మీ లోపల వున్న నన్ను తెలుసు కోండి. నాపైన దృష్టి పెట్టండి. నన్ను గుర్తించండి. అంతర్ముఖులవ్వండి, ధ్యానం చెయ్యండి. నన్ను దర్శించండి. శాశ్వతానందాన్ని పొందండి. అని ఆయన మానవులకు తెలియచేస్తున్నారు.

అసలు మీరు వేరు, నేను వేరు కాదు. మీరు నేను ఒకటే అని కూడా తెలుసుకోండి. ఈ సత్యాన్ని గ్రహించండి. అజ్ఞానుల్లా ప్రవర్తించకండి. అని తానెవరో తెలియక అయోమయంలో, గందరగోళంలో పడి వున్న మానవుల్ని తన గురించి తెలుసుకోమంటున్నాడు. అందుచేత మానవులు భగవంతుని పూజించడం కాదు. భగవంతుడే పూలు, పళ్ళు ఇంకా భూమి మీద ఎన్నో ఇచ్చి తనను తెలుసుకోమంటున్నాడు.

## ధ్యాన సత్యాలు

**తిరుగలిలో వేసిన గింజలు పిండి పిండి అవుతాయి. మధ్యలో ఇనుప ఇరుసు దగ్గర వున్న గింజలు అలాగే ఉంటాయి. అలాగే మనం ధ్యానానికి దగ్గరగా ఉంటే దుఃఖాలతో, బాధలతో నలిగిపోం.**

# "ఆలోచించండి"!

1. ప్రతి ఒక్కరు ఆర్థికంగా ఏ స్థితిలో వున్నా, వారు సాధించవలసింది ఆత్మపరంగా ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితి మాత్రమే.
2. ఇతరుల దోషాలు ఎంచుతున్నామంటే మనలో దోషాలు వున్నట్టే లెఖ్ఖ.
3. ఎదుట మనిషిలోని అర్హతను గుర్తించటానికి మనలో కూడా అర్హత ఉండాలి.
4. మనకు దేవాలయంలో దేవుడంటే ఇష్టం. కాని మన దేహంలో వున్న దేవుడంటే ఇష్టం లేదు. ఎందుచేతనంటే దేవాలయంలో దేవుడు కనిపిస్తున్నాడు. దేహంలో వున్న దేవుడు కనబడటం లేదు కాబట్టి.
5. ముత్యపు చిప్పలో పడ్డ చినుకు ముత్యమవుతుంది. నీటిలో పడ్డ చినుకు నీరుగానే ఉంటుంది. అలాగే సరైన గురువు దగ్గర చేరిన శిష్యుడు దేవుడుగా మారతాడు. లేని వాడు శిష్యుడుగానే ఉంటాడు.
6. సాధన చేయగలిగిన శరీరానికి సాధన చేయాలని తెలియదు. శరీరం వదిలిన ఆత్మకు సాధన చెయ్యాలని తెలుస్తుంది. సాధన చేయలేదు. అందుచేత ప్రతీ ఒక్కరూ ముక్తి పొందలేక జన్మచక్రంలో పడి నలుగుతున్నారు.
7. చాలా మంది ఈ వేసవిలో అక్కడ జీవించాలి. చలికాలంలో ఇక్కడ జీవించాలి అని ఆలోచి స్తారు. కానీ మరణం గురించి ఆలోచించరు.
8. ఎవరైనా మీ సహకారం తీసుకుంటే వారు ఉద్ధరింపబడిపోతున్నారు అని అనుకోకండి. మీరు పవిత్రులు అవ్వటానికి సహకరిస్తున్నారని అనుకోండి.
9. మానవుడు ప్రపంచానికి సంబంధించిన ఏ వస్తువులనూ వదిలిపెట్టనవసరం లేదు. కాని ఇవి నావి అన్న భావనను మాత్రం వదిలేయాలి.
10. దేనినీ చూసి గర్వపడకు మరణాన్ని గుర్తు పెట్టుకో.
11. ఎవరైనా కాసిని మంచినీళ్ళు ఇమ్మంటే విసుక్కుంటాం. ఆకలిగా ఉంది కొంచెం ఏదైనా పెట్టమంటే ఛోఛో అంటాం. కాని మనం చేసే పెద్ద పెద్ద పూజల కంటే, ప్రార్థనల కంటే, భజనలు కంటే ఇలాంటి చిన్న విషయాలనే భగవంతుడు మెచ్చుకుంటాడని గ్రహించట్లేదు.
12. ఇక్కడ అనేకములైనవి ఏమీ లేవు. అలా అనుకునే వాడు మృత్యువు నుండి మృత్యువుకు తిరుగుతాడు.

# "జ్ఞాని విశిష్టత!"

1. ఐశ్వర్యవంతుడు, ఉన్నతమైన అధికారంలో ఉన్న వాళ్లకంటే జ్ఞాని గొప్పవాడు.
2. జ్ఞాని ఏది చేసినా ఇతరుల కోసమే, జ్ఞాని దేహం ధరించటం లోకానికి మంచిది. తన దేహం వలన ఆయనకు ఏమీ ఉపకారం లేదు.
3. ఒకడు విరోధి, ఒకడు స్నేహితుడు అని జ్ఞానికి ఉండదు. అతను కదిలినా, మాట్లాడినా, కూర్చున్నా అతని చేష్టలు అన్నీ ఆత్మ పరంగానే వుంటాయి.
4. జ్ఞాని మీ హృదయంలో వున్న సత్యాన్నే చూస్తూ ఉంటాడు.
5. నిప్పుకు వేడి ఎంత సహజంగా ఉంటుందో, జ్ఞానికి దయ అంత సహజంగా ఉంటుంది.
6. శరీరాలను చూసినప్పుడు స్త్రీ పురుష బేధం కనబడు తుంది. ఈ శరీరాలను మనస్సును అతిక్రమించి చూస్తే అంతా బ్రహ్మమే. జ్ఞాని అది చూస్తూ ఉంటాడు.
7. అన్ని పరిస్థితుల్లోను జ్ఞాని ఒకే విధంగా ఉంటాడు. మనం పరిస్థితులు అనుకూలంగా వుంటే ఒకలాగ, ప్రతికూలంగా వుంటే ఒకలాగ ఉంటాం.
8. ప్రపంచంలో జరిగే ఏ సంఘటనా జ్ఞాని మీద ప్రభావం చూపలేవు.
9. ఆత్మ జ్ఞానుల సహవాసం వల్ల వచ్చే లాభం మన కళ్లకు కనబడదు.
10. జ్ఞానుల సన్నిధిలో నీవు పొందవలసింది ప్రయత్నం లేకుండా పొందుతావు.
11. జ్ఞాని సమక్షంలో వున్నప్పుడు జ్ఞానం పొందాలనే కాంక్ష నీలో కలుగుతుంది.
12. నదికి ప్రవాహం వచ్చినప్పుడు పెద్ద పెద్ద దుంగలు ఎలా కొట్టుకుని పోతాయో! అలాగే జ్ఞాని సమక్షంలో ఉన్నప్పుడు ఆ చైతన్య ప్రవాహంలో ఆత్మానుభవాన్ని పొందటానికి అడ్డు వచ్చే నీ అలవాట్లు అనే దుంగలు కొట్టుకుని పోతాయి.
13. జ్ఞానుల సన్నిధి సహజమైన గాలి వంటిది. నీ మనస్సుతో నీవు చేసే ప్రయత్నం విసనకర్రతో వచ్చే గాలిలాంటిది.
14. జ్ఞాని సమక్షంలో ఉన్నప్పుడు అక్కడి నుండి వచ్చే శాంతి తరంగాలు, కాంతి తరంగాలు నీ మనస్సును పరిశుద్ధం చేస్తాయి. పవిత్రం చేస్తాయి.
15. అపరాధాలు చేసే వారిపట్ల ఆత్మజ్ఞానులకు అనుగ్రహం కలగదు.
16. ఆత్మ జ్ఞానులను నమ్మిన వారికి ఆత్మజ్ఞానులు సులభంగా వశులు అవుతారు.
17. గురువు కొందరితో కోపంగా, కొందరితో ఉదాసీనంగా, కొందరితో ప్రేమగా ఉంటాడు. ఎవరికి ఎలా చెప్పాలో అలా చెప్తాడు. మనిషిని బట్టి ప్రవర్తిస్తాడు. కానీ లోపల ఏ వికారాలు ఉండవు.

పుస్తకాలు చదవటం వల్ల మనకు ఎన్నో విషయాలు తెలుస్తాయి. పుస్తకాలు చదవటం ద్వారా ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని సంపూర్ణంగా తెలుసుకుని మనలో వున్న మూఢ నమ్మకాల్ని, మూఢత్వాలనూ వదలించుకుంటే మన పురోగతికి మనమే దారి ఏర్పరచుకున్నవారమవుతాం.

ముఖ్యంగా మనం చనిపోవడం అనే మాటను తలచుకోవటానికే భయపడతాం. అసలు చనిపోవడమనేది రెండు పగళ్ళ మధ్య నిద్రలాగా, రెండు జీవితాల మధ్య విశ్రాంతి. ఎప్పుడయితే ఈ విషయాన్ని తెలుసుకుంటామో ఇంక మనకు చనిపోవడం అంటే భయంపోయి అది వచ్చినపుడు ఆనందంగా స్వీకరిస్తాం.

మన జీవితంలో తెలుసుకోవలసిన ఇలాంటి సత్యాలు ఎన్నో ఉన్నాయి. అవి ఎన్ని తెలుసుకుని జీవిస్తే జీవితం అంత ఆనందంగా వుంటుంది. జీవితానికి సంబంధించిన అలాంటి కొన్ని సత్యాలే ఈ **"జీవిత సత్యాలు"**.

పాఠకులు చదివి జీవితాన్ని ఆనందమయం
చేసుకోవాలని కోరుకుంటూ...



మీ...
**తటవర్తి వీర రాఘవరావు**

www.pssmovement.org